epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily — తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

శనివారం | 13-06- 2026 | సంపుటి: 17, సంచిక: 70, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ



ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com



ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526


### సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు

# మార్గం సుగమం

## ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయితో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక భేటీ



- సమ్మక్క-సారక్క ప్రాజెక్టు ఎన్‌ఓసీ కోసం తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక చొరవ
- అంతర్‌రాష్ట్ర సత్సంబంధాలతో ప్రాజెక్టు అనుమతులకు వేగం
- సానుకూలంగా స్పందించిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి
- సర్వే ఖర్చుల కోసం రూ.9.883 కోట్లు విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం
- ముంపు ప్రభావిత భూములకు చట్టబద్ధ పరిహారం చెల్లించేందుకు సిద్ధం
- 4.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు భారీ ఊతం
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 12 (ప్రజాకలం) : గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన సమ్మక్క--సారక్క బ్యారేజ్ / సమ్మక్క సాగర్ ప్రాజెక్టు అనుమతుల సాధనలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు పడిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. గురువారం రాత్రి హైదరాబాద్‌కు వచ్చిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి శ్రీ విష్ణు దేవ్ సాయి తో హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘనంగా స్వాగతించారు. అనంతరం రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారుల బృందంతో కలిసి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రితో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్-తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన సమ్మక్క-సారక్క ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించారు.ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం తుది పరిశీలనకు తీసుకెళ్లేందుకు అవసరమైన అభ్యంతర రహిత పత్రం-ఎన్‌ఓసీ- జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారిక విజ్ఞాపన పత్రాన్ని

తరువాయి 2వ పేజీలో...



### ఓట్ల వేటలో 'కేంద్రం'

# దొంగదారి!

## కాంగ్రెస్ బలంగా ఉన్న చోట ఓట్ల తొలగింపునకు కుట్ర

- 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్' పేరిట లేపేసే ప్లాన్
- బీహార్, బెంగాల్ ఫార్ములాను ఇక్కడా ప్రయోగిస్తున్నారు
- కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్ష ప్రభుత్వాలపై దాడి
- పాలేరు 'బి.ఎల్.ఏ'ల శిక్షణ శిబిరంలో మంత్రి పొంగులేటి నిప్పులు

పాలేరు జూన్ 12(ప్రజా కలం న్యూస్ ) పాలేరు ఏదులాపురం మున్సిపాలిటీ కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రతిపక్ష పార్టీలను, ప్రతిపక్ష ప్రభుత్వాలను టార్గెట్ చేస్తూ ప్రజాస్వామ్య విరుద్ధమైన కుట్రలకు తెరలేపిందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా బీజేపీపాలితా ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో అప్రజాస్వామిక పాలన సాగుతోందని మండిపడ్డారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బి.ఎల్.ఏ) అవగాహన శిక్షణ శిబిరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట క్రాస్ రోడ్డులో గల పీవీఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం జరిగింది.

తరువాయి 2వ పేజీలో...

# గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

- 'లాజిస్టిక్స్ పాలసీ 2.0' ద్వారా మౌలిక వసతుల వృద్ధికి పెద్దపీట
- లాజిస్టిక్స్ లోనూ సమర్థవంతంగా ఎమర్జింగ్ టెక్నాలజీస్ వినియోగం
- 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్'లో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, జూన్ 12 (ప్రజాకలం) : గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్ గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ, సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో 'ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం'ను చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్ లో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఎగుమతుల సన్నద్ధత సూచీలో దేశవ్యాప్తంగా తెలంగాణ ఎనిమిదో స్థానంలో నిలిచిందన్నారు. అదే... సముద్ర తీరం లేని రాష్ట్రాల (ల్యాండ్‌లాక్డ్) జాబితాలో రెండో స్థానంలో ఉందన్నారు. మర్చండైజ్ ఎగుమతుల్లో దేశంలోనే ఏడో స్థానంలో నిలవడం తెలంగాణ పారిశ్రామిక వృద్ధికి నిదర్శనమన్నారు.

తరువాయి 2వ పేజీలో...

### సింగరేణిలో బొగ్గు నిల్వల పేరిట

# భారీ కుంభకోణం

- సింగరేణి అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



పెద్దపల్లి,జూన్12:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి సింగరేణి సంస్థలో వరుస కుంభకోణాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




### పర్యావరణ పరిరక్షణకే

# 'గ్రీన్ ఎనర్జీ'



- మంత్రి పొంగులేటి
- పాలేరు పరిధిలో రూ.37.38 కోట్లతో విద్యుత్ పనులు

పాలేరు జూన్ 12( ప్రజా కలం న్యూస్ ) పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని 33/ 11 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న

తరువాయి 2వ పేజీలో...

### అతి త్వరలో యథావిధిగా

# సింగరేణి మెడికల్ బోర్డు

- అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు చేపట్టాలి
- సింగరేణి యాజమాన్యానికి ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశం
- నేడు మంచిర్యాలలో 335 మంది వారసులకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడి



హైదరాబాద్, జూన్ 12 (ప్రజాకలం) : సింగరేణి కార్మికులకు శుభవార్త. సింగరేణిలో వివిధ కారణాలతో కొద్ది కాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాల్సిందిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తును

తరువాయి 2వ పేజీలో...




## సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు మార్గం సుగమం

మొదటి పేజీ తరువాయి...

ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రికి సమర్పించారు.

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదావరి జలాల వినియోగం, పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి, రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత కల్పించడం వంటి అంశాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

సమ్మక్క–సారక్క బ్యారేజ్ తెలంగాణ రైతాంగానికి అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని ఆయన వివరించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి శ్రీ విష్ణు దేవ్ సాయి గారు తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారని, అంశాన్ని సానుభూతితో పరిశీలిస్తామని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. ఈ పరిణామం సమ్మక్క–సారక్క ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియలో కీలక మలుపుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

కేంద్ర జల సంఘంలోని అంతర్రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ మినహా మిగతా అన్ని ప్రధాన డైరెక్టరేట్ల నుంచి ప్రాజెక్టుకు ఇప్పటికే అనుమతులు లభించాయని మంత్రి వెల్లడించారు. ఎన్‌ఓసీ లేకపోవడం వల్ల మాత్రమే డీపీఆర్ తుది పరిశీలన నిలిచిపోయిన విషయాన్ని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

ప్రాజెక్టు ముంపు, బ్యాక్‌వాటర్ ప్రభావిత ప్రాంతాలపై ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు ఇప్పటికే సంయుక్త సర్వే నిర్వహించారని మంత్రి తెలిపారు. మరింత ఖచ్చితమైన సర్వే కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందించిందన్నారు. సర్వే ఖర్చుల కోసం రూ.9.883 కోట్లను 2026 ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖకు విడుదల చేసినట్లు ఆయన వివరించారు.

ప్రస్తుతం బీజాపూర్ జిల్లాలో సర్వే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావిత భూములు గుర్తించిన పక్షంలో చట్టబద్ధంగా పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైతే పరిహారం మొత్తాన్ని ముందుగానే డిపాజిట్ చేసేందుకు కూడా తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి తెలియజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సమ్మక్క–సారక్క ప్రాజెక్టు మూలాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పీవీ నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి పథకంలో ఉన్నాయని మంత్రి వివరించారు. గోదావరి నదిపై కంతనపల్లి వద్ద బ్యారేజ్ నిర్మించి ఎస్సారెస్పీ స్టేజ్–2 ఆయకట్టును స్థిరీకరించడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపొందించబడిందన్నారు. 2009 ఫిబ్రవరి 10న జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.27 ద్వారా ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతి లభించిందని, 2012 మార్చి 2న కేంద్ర జల సంఘం డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీటిపారుదల రంగ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రాజెక్టును పునరూపకల్పన చేశారని మంత్రి తెలిపారు. సాంకేతిక అధ్యయనాల అనంతరం బ్యారేజీను ములుగు జిల్లాలోని తుపాకులగూడెం వద్ద నిర్మించడం సాంకేతికంగా, ఆర్థికంగా మరింత ప్రయోజనకరమని తేలిందన్నారు. ఈ మార్పుతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ముంపు ప్రభావం గణనీయంగా తగ్గిందని వివరించారు.

సమ్మక్క–సారక్క బ్యారేజ్ ద్వారా గోదావరి నుంచి 46.96 టీఎంసీల నీటిని మళ్లించి ఎస్సారెస్పీ స్టేజ్–2 కింద 4.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించనున్నట్లు మంత్రి తెలిపారు.

అదనంగా రామప్ప–పాకాల లింక్ కాలువ ద్వారా మరో 30 వేల ఎకరాలకు కొత్తగా సాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా సూర్యాపేట జిల్లాలో 2,34,199 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 96,494 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 85,774 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 22,422 ఎకరాలు, జనగామ జిల్లాలో 1,111 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ప్రయోజనం కలుగుతుందని ఆయన తెలిపారు. రామప్ప–పాకాల లింక్ కాలువ ద్వారా ములుగు జిల్లాలో 8,000 ఎకరాలు, వరంగల్ నర్సంపేట ప్రాంతంలో 22,000 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు.

ఇదే కాకుండా జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకంలోని కొంత ఆయకట్టు స్థిరీకరణకు కూడా ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని వందలాది గ్రామాలకు తాగునీటి ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

ప్రాజెక్టు డీపీఆర్‌ను 2021 ఆగస్టు 31న కేంద్ర జల సంఘానికి సమర్పించినట్లు మంత్రి తెలిపారు. హైడ్రాలజీ డైరెక్టరేట్, కాస్ట్ ఎస్టిమేట్స్ డైరెక్టరేట్, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కేంద్ర భూగర్భ జల మండలి సహా పలు ప్రధాన అనుమతులు ఇప్పటికే లభించాయని చెప్పారు. 2024 జూలై నుంచి 2026 జనవరి వరకు కేంద్ర జల సంఘం కోరిన వివరణలన్నింటికీ తెలంగాణ నీటిపారుదల శాఖ సమగ్ర సమాధానాలు సమర్పించిందన్నారు.

ఎన్‌ఓసీ సాధన కోసం తెలంగాణ ప్రభుత్వం గత రెండేళ్లుగా నిరంతరంగా కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. 2024 ఏప్రిల్ 26, ఆగస్టు 12, 2025 జనవరి 24, ఏప్రిల్ 23 తేదీల్లో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి అధికారిక లేఖలు రాసినట్లు తెలిపారు. 2025 సెప్టెంబర్ 22న రాయ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని స్వయంగా కలిసి ఇదే అంశాన్ని ప్రస్తావించినట్లు గుర్తు చేశారు.

అంతే గాకుండా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి శ్రీ సి.ఆర్. పాటిల్ గారితో, కేంద్ర జల సంఘం చైర్మన్‌తో కూడా ఈ అంశంపై చర్చలు జరిపినట్లు మంత్రి తెలిపారు. 2025 నవంబర్, డిసెంబర్ నెలల్లో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు ప్రత్యేక విజ్ఞప్తులు పంపి అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరినట్లు వివరించారు. ప్రస్తుతం సర్వే పనులు కొనసాగుతుండటం, తెలంగాణ ప్రభుత్వం అవసరమైన నిధులు విడుదల చేయడం, ముంపు ప్రభావితులకు సహాయపరిహారం చెల్లించేందుకు ముందుకు రావడం, రెండు రాష్ట్రాల మధ్య సానుకూల వాతావరణం నెలకొనడం వల్ల ఎన్‌ఓసీ త్వరలోనే లభించే అవకాశాలు మెరుగయ్యాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఎన్‌ఓసీ జారీ చేసిన వెంటనే కేంద్ర జల సంఘం అంతర్రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ డీపీఆర్ తుది పరిశీలన పూర్తి చేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

దీంతో సమ్మక్క–సారక్క బ్యారేజ్ అమలుకు ఉన్న చివరి ప్రధాన పరిపాలనా అడ్డంకి కూడా తొలగిపోయే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

రైతుల ప్రయోజనాలు, సాగునీటి భద్రత, తాగునీటి అవసరాలు, అంతర్రాష్ట్ర సత్సంబంధాలు – ఈ నాలుగు అంశాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం సమ్మక్క–సారక్క ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తోందని మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

## ఓట్ల వేటలో 'కేంద్రం' దొంగదారి!

మొదటి పేజీ తరువాయి...

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి.. కేంద్ర ప్రభుత్వ వైఖరిని, బీజేపీ రాజకీయ వ్యూహాలను ఎండగడుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు.

– 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం.. దొంగదారి చర్య!

కేంద్ర ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిన 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం లాంటిదని, ఇది ముమ్మాటికీ దొంగదారి చర్యేనని మంత్రి విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో, ఎక్కడైతే మనకు ఓట్లు ఎక్కువగా ఉన్నాయో.. అక్కడ ఒక పద్ధతి ప్రకారం దాదాపు 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్ ఓట్లు'గా చిత్రీకరించి, వాటిని జాబితా నుంచి తొలగించేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోంది. ఓటరు వయస్సులో స్వల్ప తేడాలున్నా, పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ (రావుకు బదులు రెడ్డి, హుస్సేన్ బదులు శ్రీ అని పడటం) ఉన్నా.. వాటన్నింటినీ వంకగా చూపి ఓట్లను లేపేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే బీహార్, వెస్ట్ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఈ పద్ధతిని ప్రయోగించి సక్సెస్ అయ్యారు. అదే ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలోనూ ప్రయోగించాలని చూస్తున్నారు. దీన్ని కాంగ్రెస్ సైనికులు గట్టిగా తిప్పికొట్టాలి" అని మంత్రి పిలుపునిచ్చారు.

– నిన్న ఓట్లు.. నేడు ఏకంగా సీట్లే దొంగిలిస్తున్నారు!

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఉదంతాన్ని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "మీనాక్షి నటరాజన్ గారికి కావలసిన ఓట్ల కంటే 11 ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ కేవలం ఒక పాత ఎఫ్ఐఆర్ కాగితాన్ని సాకుగా చూపి, ఎన్నికల అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఆమె నామినేషన్‌ను తిరస్కరింపజేశారు. ఈ రకంగా కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన ఒక రాజ్యసభ స్థానాన్ని వాళ్ళు దొంగిలించారు. నిన్నటి వరకు ఓట్లను దొంగిలించిన వాళ్ళు.. ఈరోజు ఏకంగా సీట్లనే దొంగిలించే దుస్థితికి కేంద్ర ప్రభుత్వం దిగజారింది" అని నిప్పులు చెరిగారు.

– సీబీఐ, ఈడీలతో బెదిరింపు రాజకీయాలు

బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం దేశంలోని ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థలను వేట కుక్కల్లా వాడుకుంటోందని మంత్రి తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ చేతుల్లో ఉన్న సీబీఐ , ఈడీ , ఇన్‌కమ్ టాక్స్ సంస్థలను అడ్డం పెట్టుకుని, వేరే పార్టీల తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్రలు పన్నుతున్నారని, భారతదేశంలో ఎక్కడ బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నా ఇదే రకమైన దుర్మార్గపు పరిపాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

– ప్రతి ఓటూ కాంక్రీట్ గోడ కావాలి..

జూన్ 25 నుంచి జూలై 24 వరకు నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే 'ఓట్ మ్యాపింగ్' ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. "ఉద్యోగాలు, చదువుల రీత్యా ఖమ్మం, హైదరాబాద్‌లలో ఉండే మన వాళ్ళు అధికారులు వచ్చినప్పుడు ఊర్లో లేరనే సాకుతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది. అధికారులు వచ్చే ముందే గ్రామంలో చాటింపు వేయించి వేరే ఊర్లలో ఉన్న మన ఓటర్లను రప్పించి ఓటు కాపాడుకోవాలి. మనకు దొంగ ఓట్లు అవసరం లేదు.. మనకున్న జనాదరణతో ప్రతి ఓటునూ ఒక కాంక్రీట్ గోడ లాగా కాపాడుకోవాలి" అని స్పష్టం చేశారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కాబోయే ప్రధానమంత్రి, మన నాయకుడు రాహుల్ గాంధీకి కార్యకర్తలంతా సైనికుల్లా అండగా నిలబడాలని, ఈ అక్రమ ఎస్ఐఆర్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, పీసీసీ ప్రతినిధి సుధాకర్, ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్, ఏదులాపురం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, 291 బూత్‌ల బి.ఎల్.ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకే 'గ్రీన్ ఎనర్జీ'

మొదటి పేజీ తరువాయి...

0.8 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్, విద్యుత్ నియంత్రికల (ట్రాన్స్‌ఫార్మర్ల) మరమ్మత్తు కేంద్రానికి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. విద్యుత్ రంగ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నియోజకవర్గ పరిధిలో రూ.37.38 కోట్లతో విద్యుత్ సరఫరా మెరుగుదలకు పనులు చేపట్టామని, రూ.9 కోట్ల వ్యయంతో మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణాలు సాగుతున్నాయని వివరించారు.దశాబ్దాలుగా ఇళ్లపైనుంచివెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ లైన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఒకప్పుడు కరెంట్ కష్టాలతో రాత్రివేళల్లో పొలాలకెళ్లి రైతులు పాముకాట్లకు గురైన పరిస్థితులు ఉండేవని, నాటి ఉచిత విద్యుత్ స్ఫూర్తితోనే ప్రస్తుత ప్రభుత్వం రైతులకు నాణ్యమైన కరెంట్ అందిస్తోందని గుర్తుచేశారు.

– అర్హులందరికీ సొంతింటి కల..

అనంతరం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, రెండో విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి అదనంగా మరో 2 వేల ఇళ్లను కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా, కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు.

– రైతాంగానికి భరోసా..

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా సంక్షేమ పథకాలను ఆపడం లేదని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, రైతు భరోసా సాయాన్ని ఎకరాకు రూ.12 వేలకు పెంచామన్నారు. దేశంలోనే రికార్డు స్థాయిలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తూ కొనుగోలు చేశామని, తడిసిన ధాన్యాన్ని సైతం సేకరించి రైతులకు అండగా నిలిచామని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. గడిచిన ఏడాది కాలంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదల వైద్యం కోసం రూ.1,034 కోట్లు వెచ్చించామని, నిరుద్యోగుల కోసం 72 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టామని చెప్పారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్నందున, రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల సూచనల మేరకే పంటలు సాగు చేయాలని మంత్రి సూచించారు.

ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారీ, జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణిలో బొగ్గు నిల్వల పేరిట భారీ కుంభకోణం

మొదటి పేజీ తరువాయి...

పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఆర్ జి–1 పరిధిలోని ఓసిపి–5 బొగ్గుగనిలో శుక్రవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్,టీజీబికెఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి తో కలిసి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బొగ్గు నిల్వలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒకనాడు లక్షలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న సింగరేణి సంస్థను నేడు కాంగ్రెస్ పాలకుల దోపిడీతో నామరూపాలు లేకుండా చేసే దుర్మార్గపు ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. సింగరేణి అధికారిక వెబ్సైట్ లోని లెక్కల ప్రకారం ఓసిపి–5 గని వద్ద 6 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు చూపిస్తున్నారని,కానీ తాము క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అక్కడ మట్టి, బండరాళ్లు,పనికిరాని సేల్ బొగ్గును కుప్పలుగా పోసి బొగ్గు ఉన్నట్లు భ్రమింపజేస్తున్నారని విమర్శించారు. అక్కడ కనీసం 50 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు కూడా లేదని,సింగరేణి వ్యాప్తంగా ఉన్నాయంటున్న 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వల లెక్కలన్నీ పచ్చి మోసమని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల నేతృత్వంలో ఓబీ కాంట్రాక్టులు,సోలార్ పవర్ ప్లాంట్లు,డెటొనేటర్ కాంట్రాక్టులు, పవర్ ప్రాజెక్టుల నిర్వహణలో అవినీతి పరంపర కొనసాగుతోందని,దీనిపై ఇప్పటికే తమ నేత హరీష్ రావు గోదావరిఖనిలో పవర్ ప్లాంట్ ప్రెజెంటేషన్ ద్వారా అన్ని అక్రమాలను బయటపెట్టారని గుర్తు చేశారు. లేని బొగ్గును ఉన్నట్లు సృష్టిస్తూ,రాయల్టీలు చెల్లిస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్న ఈ వ్యవహారంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని,దీనికి కారణమైన సిఎండీ,డైరెక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇదే సమయంలో మెడికల్ అన్–ఫిట్ అయిన సుమారు నాలుగు వందల మంది కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా గత ఆరు నెలల నుండి ఏడాది కాలంగా పెండింగ్‌లో పెట్టారని,తమ పార్టీ నేత హరీష్ రావు ఈ విషయంపై గట్టిగా నిలదీ యడంతోనే ప్రభుత్వం దిగివచ్చి శనివారం భట్టి విక్రమార్క చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయడానికి సిద్ధమైందని అన్నారు. సింగరేణిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం మానుకోవాలని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉన్న ఈ ప్రజా ఆస్తిని కాపాడటానికి తాము నిరంతరం పోరాడుతామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి...

'తెలంగాణ రైజింగ్ – 2047' విజన్ లక్ష్యసాధనలో 'లాజిస్టిక్స్' రంగం కీలక పాత్ర పోషించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. తెలంగాణకు సముద్ర తీరం లేకపోవడాన్ని ఒక పరిమితి(లిమిటేషన్)గా కాకుండా, ఒక డిజైన్ అడ్వాంటేజ్ గా మార్చుకుంటున్నామన్నారు. 'లాజిస్టిక్స్ పాలసీ 2.0' ద్వారా రాష్ట్రంలో మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్, డ్రై పోర్టులు, బాండెడ్ వేర్ హౌజింగ్, లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేయబోతున్నామన్నారు. లాజిస్టిక్ రంగానికి అవసరమైన రెడీ టూ స్కిల్డ్ వర్క్ ఫోర్స్ తయారీకి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్ ను లాజిస్టిక్ రంగంలోనూ సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నామన్నారు. మల్టీ మోడల్ లాజిస్టిక్స్, రైల్ లింక్డ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, ఎయిర్ కార్గో, కోల్డ్ చైన్, గ్రేడ్ – ఏ వేర్ హౌజింగ్, ఆటోమేషన్, డిజిటల్ లాజిస్టిక్ ప్లాట్ ఫామ్స్, గ్రీన్ మొబిలిటీ తదితర రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ టీసీసీఐ ప్రెసిడెంట్ ఆర్.రవి కుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కేకే మహేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గరిమెళ్ల, షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ కమిటీ ఛైర్మన్ కమల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## అతి త్వరలో యథావిధిగా సింగరేణి మెడికల్ బోర్డు

మొదటి పేజీ తరువాయి...

దృష్టిలో ఉంచుకొని మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి అభివృద్ధిపై ఇటీవల కోల్ బెల్ట్ ప్రాంత శాసన సభ్యులు, మంత్రులతో నిర్వహించిన సమావేశం సందర్భంగా మెడికల్ బోర్డు అంశాన్ని వారు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ అంశంపై కార్మికుల ఆందోళనలను వివరించారని చెప్పారు. ఆ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

మెడికల్ బోర్డు ప్రక్రియ ద్వారా నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మధ్యవర్తిత్వం లేదా మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, మెడికల్ బోర్డు ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉంచి యాజమాన్యానికి సహకరించాలని కార్మికులకు సూచించారు. ఇటీవల కాలం వరకు కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335 మంది వారసులకు మంచిర్యాలలో శనివారం (ఈ నెల 13వ తేదీ) జరిగే కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు తెలియజేశారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు.

సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల అంశం తమ దృష్టిలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నట్లు..ఇందులో భాగంగానే ఈ అంశంపై న్యాయ పరమైన సలహా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిబంధనల మేరకు న్యాయ సలహా ప్రకారం సానుకూలంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ సింగరేణి...

అలాగే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేశామన్నారు. వీటిలో 555 ఎక్స్టర్నల్ పోస్టులు ఉండగా... 2,102 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీని కూడాఆన్లైన్ పద్ధతిలో చేపట్టి వివాద రహితంగా అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించామన్నారు. కారుణ్య నియామకాల కోసం ఉన్న గరిష్ట వయోపరిమితిని 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచడం ద్వారా మరింత మంది అర్హులకు అవకాశం కల్పించామని తెలిపారు. ఇప్పటికే 200 మంది లబ్ధి పొందారని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మంది ఉద్యోగులకు భరోసా కల్పించేలా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. ఇదే కాకుండా బ్యాంకులతో సంప్రదింపులు జరిపి ఇటీవలే సింగరేణి ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ బీమా సదుపాయాన్ని కూడా కల్పించామన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో సంక్షేమం - అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత

**- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**- భైరవునిపల్లి గ్రామ అభివృద్ధికి రెండున్నరేళ్లలో రూ.19.25 కోట్ల వ్యయం**

**- భైరవునిపల్లిలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం, బుద్ధారంలో రూ.2 కోట్ల వ్యయం తో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి.**

పాలేరు జూన్ 12( ప్రజా కలం న్యూస్ )



ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తయ్యాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమం – అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం నేలకొండపల్లి మండలంలో పర్యటించి ముందుగా భైరవునిపల్లి గ్రామంలో 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని పనిచేస్తోందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పేదలకు సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వానికి పేదలకు ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన లేకపోయిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. రెండవ విడతలో నియోజక వర్గానికి 2 వేల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇల్లు అనేది పేదలకు ఆత్మ గౌరవానికి ప్రతీక అని పేర్కొంటూ, ప్రతి సోమవారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పారదర్శకంగా నిధులు జమ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం రైతులకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ అందిస్తున్నామని చెప్పారు. 25 లక్షల మంది రైతులకు రెండు లక్షల వరకు 21 వేల కోట్ల రుణమాఫీ అమలు చేశామని, రైతు భరోసా మొత్తాన్ని ఎకరాకు 12 వేలకు పెంచామని తెలిపారు. నిరుద్యోగ యువత కు 72 వేల ఉద్యోగాలు కల్పించినట్లు పేర్కొన్నారు. భైరవునిపల్లి గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. నందిగామ బ్రాంచ్ కెనాల్ నుంచి అజయ్ తండా వరకు భైరవునిపల్లి క్రాస్ రోడ్డు మీదుగా రూ.4.50 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టామని చెప్పారు. భైరవునిపల్లి బోదులబండ మీదుగా కొనాయి గూడెం వరకు రూ.7.90 కోట్లతో మరో రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. భైరవునిపల్లి నుంచి నాచేపల్లి వరకు రూ.4.72 కోట్లతో బీటీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే భైరవునిపల్లి నుంచి చెరువుమాదారం వరకు రూ.1.22 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టామని, రూ.60 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించామని పేర్కొన్నారు.

మంచినీటి సరఫరా, సైడ్ డ్రైన్లు, విద్యుత్ తీగల సమస్యల పరిష్కారానికి మొత్తంగా భైరవునిపల్లి గ్రామ అభివృద్ధి కోసం గత రెండున్నరేళ్లలో రూ.19.25 కోట్ల పనులు చేపట్టినట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతులు పండించిన రికార్డు స్థాయి ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసిందని మంత్రి తెలిపారు. కొంత ఆలస్యం జరిగినప్పటికీ మద్దతు ధరతో కొనుగోలు చేయడంతో పాటు తడిసిన ధాన్యాన్ని కూడా స్వీకరించామని చెప్పారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు చివరి గింజ వరకు కొనుగోలు చేశామని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలుతో పాటు రైతుల ఖాతాల్లో వెంటనే చెల్లింపులు జమ చేసినట్లు తెలిపారు. రైతులు ఏ పంట పండించినా మద్దతు ధరతో కొనుగోలు చేసిన ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమేనని పేర్కొన్నారు. పేదల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం నేలకొండపల్లి మండలం బుద్ధారం గ్రామంలో 2 కోట్ల వ్యయంతో బుద్ధారం తండా – రాజారాంపేట్ రోడ్డు నుండి లకారం ఏటి వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. గత రెండున్నర సంవత్సరాలలో గ్రామంలో వివిధ అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.12.39 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ వి సీతారాములు, డిపిఓ రాంబాబు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ పిల్లి, రాంప్రసాద్, ఎంపీడీఓ ఎర్రయ్య, ఏఓ రాధ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ చే మున్సిపల్ చైర్మన్ లింబాద్రి సన్మానం



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 12 (ప్రజా కలం) తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని చంపాపేట్ సాము సరస్వతి గార్డెన్స్‌లో నిర్వహించిన అభినందన సభను నిర్వహించారు. కార్యక్రమంలో బాగంగా మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ని ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో ఆర్యవైశ్య సమాజం నుండి ప్రజాప్రతినిధిగా ఎన్నికై, ప్రజలకు విశేష సేవలందిస్తున్నందుకు గాను ఆయనకు ఈ సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ సభాధ్యక్షత వహించగా, ముఖ్య అతిథుల సమక్షంలో
తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి.వెంకటేశ్ ముఖ్య అతిథులుగా హాజరై చైర్మన్‌ను మైలారపు లింబాద్రి ని శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందచేశారు.న్ఈ సందర్భంగా సన్మాన గ్రహీత, చైర్మన్ సత్కరించిన ఆర్యవైశ్య మహాసభ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలో రాష్ట్ర నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా గెలుపొందిన పలువురు ఆర్యవైశ్య ప్రజాప్రతినిధులను కూడా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

మల్లాపూర్, జూన్ 12 (ప్రజా కలం ప్రతినిధి) : మల్లాపూర్ మండలంలోని



రత్నాపూర్ గ్రామానికి చెందిన పట్నం గంగాధర్ (50) ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, రత్నాపూర్ గ్రామానికి చెందిన పట్నం గంగాధర్ గత కొంతకాలంగా అయిలాపూర్ గ్రామానికి చెందిన గోనె మురళికి చెందిన సిరిపూర్ గ్రామ శివారులో ఉన్న ఆయిల్ పామ్ తోటలో కూలీగా పనిచేస్తున్నాడు. ప్రతిరోజు లాగే శుక్రవారం ఉదయం పనికి వెళ్లిన గంగాధర్, తోటకు నీటి పారుదల కోసం ఏర్పాటు చేసిన కరెంట్ మోటార్‌కు సంబంధించిన వైర్‌ను మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురయ్యాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పట్నం సాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మల్లాపూర్ ఎస్సై ఎ. అనిల్ తెలిపారు.

## బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి యేగి జానకి**

**- పిల్లల చేతిలో పుస్తకాలు ఉండాలే తప్ప పనిలోకి కాదన్న న్యాయమూర్తి**




ఎండపల్లి, జూన్ 12 : (ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామం లో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామంలో లీగల్ ఎయిడ్ ఆధ్వర్యం లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గౌరవ న్యాయమూర్తి యేగి జానకి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ సమాజానికి శాపమని ప్రతి చిన్నారి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాన్ని కల్పించడం అందరి బాధ్యత అని అన్నారు. పిల్లలను పనులకు పంపకుండా పాఠశాలలకు పంపించాలని బాలల హక్కుల పరిరక్షణ లో తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు, సమాజం కీలక పాత్ర పోషించాలని న్యాయమూర్తి సూచించారు. బాల కార్మిక నిర్మూలనకు ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్య క్రమం లో గ్రామ సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి, ధర్మపురి సీఐ రామ్ నర్సింహారెడ్డి, వెల్గటూర్ ఎస్ఐ పులిచెర్ల ఉదయ్ కుమార్, ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షులు బందేల రమేష్, జనరల్ సెక్రటరీ రామడుగు రాజేష్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్, న్యాయవాది కలమడుగు హరి ప్రసాద్, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నట్లు గ్రామ సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి తెలిపారు.

# దరఖాస్తుల ఆహ్వానం

మల్లాపూర్, జూన్ 12 ( ప్రజా కలం ప్రతినిధి)

మల్లాపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి దామోదర్ రెడ్డి తెలిపారు.
సైన్స్, ఆంగ్లం బోధించే అధ్యాపకులతో పాటు కెరీర్ మార్గదర్శక ఉపాధ్యాయ పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత విద్యార్హతలు కలిగిన మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 16వ తేదీ సాయంత్రం 4.30 గంటలలోపు విద్యాలయంలో సమర్పించాలని సూచించారు. అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాల కోసం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

# కార్మికులకు కనీస వసతులు కల్పించండి

## కార్మిక చట్టాలను పక్కాగా అమలు చేయండి

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు -జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల**

పెద్దపల్లి,జూన్ 12:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం అంటే కేవలం నినాదాలకే పరిమితం కాకూడదని,క్షేత్రస్థాయిలో కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల స్పష్టం చేశారు. రాఘవాపూర్‌లోని కేకేఆర్ ఇటుక బట్టీని శుక్రవారం సందర్శించిన ఆమె,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.భవనితో కలిసి అక్కడ ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ కార్మికుల పట్ల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని,వారికి చట్టబద్ధమైన కనీస వసతులు,ఆవాస సౌకర్యాలు కల్పించడం యజమానుల ప్రాథమిక బాధ్యతని స్పష్టం చేశారు. బట్టీలలో పనిచేసే వలస కార్మికుల పిల్లల విద్యాభ్యాసానికి ఆటంకం కలగకుండా చూడాలని,పిల్లల భవిష్యత్తు కోసం వారిని విద్యావంతులను చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ప్రతి




కార్మికుడికి తప్పనిసరిగా లేబర్ కార్డు ఉండాలని,కూలీ వేతనాలను మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాల ద్వారానే చెల్లించాలని నిబంధనలను గుర్తుచేశారు. కార్మిక చట్టాలను యధాతథంగా పాటించాల్సిందేనని, ఒకవేళ నిబంధనలను ఉల్లంఘిస్తే యజమానులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అనంతరం,బట్టీలో ఉన్న సౌకర్యాలను స్వయంగా పరిశీలించిన న్యాయ మూర్తులు,ప్రస్తుత వసతులు సరిపోవని, వాటిని మరింత మెరుగుపరచాలని యజమానులను ఆదేశించారు. కేవలం రాఘవాపూర్‌లోనే కాకుండా,జిల్లాలోని ఇతర ఇటుక బట్టీల యజమానులు కూడా కార్మికుల విషయంలో మానవీయ దృక్పథంతో వ్యవహరించి,అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య,సహాయ కార్మిక అధికారి రఫీ,గ్రామీణ ఎస్ఐ శ్వేత,ఇటుక బట్టీల యజమానులు,బట్టీ కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశాం

**- సీఎంఆర్ సరఫరాలో పెద్దపల్లినే జిల్లా టాప్ - ప్రభుత్వ భూముల ఆక్రమణలను సహించేది లేదు**

**- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తాం - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి,జూన్ 12:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లను రికార్డు స్థాయిలో వంద శాతం విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సమగ్ర జిల్లా కార్యాలయ సముదాయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి 2025-26 సీజన్‌లో 59,342 మంది రైతుల నుంచి రూ. 1,031 కోట్ల విలువైన 4.35 లక్షల మెట్రిక్ టన్నుల వరిని సేకరించామని, రైతులకు ఇప్పటికే 93 శాతం చెల్లింపులు పూర్తి చేశామని వెల్లడించారు. గత పదేళ్లలో ఇదే అత్యధిక కొనుగోలు అని పేర్కొంటూ, సీఎంఆర్ బియ్యం సరఫరాలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత,ఎఫ్‌సీఐ గోదాముల్లో కార్మికుల కొరత వంటి సవాళ్లు ఎదురైనప్పటికీ కొనుగోళ్లను విజయవంతంగా పూర్తి చేశామని,మంథని ప్రాంతంలో మహారాష్ట్ర నుంచి అక్రమంగా వచ్చిన మూడు ధాన్యం లారీలను స్వాధీనం చేసుకుని బాధ్యులపై చర్యలకు ఆదేశించామని చెప్పారు. అలాగే,9 కొనుగోలు కేంద్రాల ద్వారా రూ. 63.40 కోట్ల విలువైన 26 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కూడా సేకరించినట్లు వివరించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా పారదర్శకంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో ఇంకా 1.80 లక్షల మంది ఓటర్ల వివరాల పరిశీలన మిగిలి ఉందని,బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు సేకరించే సమయంలో ప్రజలు ఆధారాలు చూపి సహకరించాలని కోరారు. ప్రభుత్వ భూముల పరిరక్షణపై స్పందిస్తూ,ఆక్రమణలను ఎంతమాత్రం సహించబోమని హెచ్చరించారు. ఇప్పటికే ధర్మారం మండలం బొమ్మారెడ్డి పల్లిలో 72 ఎకరాలు,నరసింగాపూర్‌లో 48 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి విముక్తం చేశామని,ముత్తారంలోనూ ఈ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటుక బట్టీల కోసం 8 చెరువుల నుంచి 13,250 ట్రిప్పుల మట్టి రవాణాకు అనుమతులిచ్చామని,ఆ రుసుమును స్థానిక అభివృద్ధికి వాడుతామని చెబుతూనే,రైతులు వ్యవసాయానికి ఉచితంగా మట్టిని తోలుకోవచ్చని స్పష్టం చేశారు. సాంకేతిక విద్యా రంగంలో పెద్దపల్లి, రామగుండం అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 30 చివరి తేదీ అని కలెక్టర్ తెలిపారు. మంథనిలో కూడా మరో కొత్త ఏటీసీ ఏర్పాటుకు అనుమతి లభించిందని,భూమి కేటాయింపు పూర్తయినందున త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సానికి ఎగిరిపోయిన రేకులు కూలిన ఇండ్లు విరిగిన చెట్లు

**- జగిత్యాల ధర్మారం ఆర్ అండ్ బి రోడ్డు పైన చెట్లు విరిగిపడటం తో వాహనాలకు అంతరాయం**


**- విరిగిన చెట్లను జేసిబి సాయంతో తొలగించిన గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్**

వెల్గటూర్, జూన్ 12 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఉమ్మడి వెల్గటూర్, ఎండపల్లి మండలాల పరిధిలోని పలు గ్రామాల లో రాజక్కపల్లి గ్రామం లో రంగు సత్తయ్య తండ్రి లింగయ్య రేకుల షెడ్డు పూర్తిగా లేచిపోయి అఫ్ కిలోమీటర్ దూరంలో పడడం జరిగిందని ఇంట్లో ఉన్న వస్తువులు మొత్తం వర్షానికి తడిచిపోయాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ తెలిపారు. అలాగే కొత్తపేట గ్రామం లో చెట్లు విరిగి కరెంటు తీగలపై పడడం తో విద్యుత్ పోల్లు విరిగి పోవడం వల్ల విద్యుత్ కు అంతరాయం జరిగింది. అలాగే చర్లపల్లి గ్రామం లో ఆదే వెంకన్న రేకుల షెడ్డు పూర్తిగా కుప్ప కూలింది రేకులు ఎగిరిపోవడం జరిగింది అలాగే ఒక ఇల్లు గోడలతో సహా కూలి పోవడం జరిగిందని గ్రామ సర్పంచ్ పడిదం లావణ్య--మొగిలి తెలిపారు. గుల్లకోట గ్రామం లో జగిత్యాల ధర్మారం రహదారిపై చెట్లు వేర్లతో సహా పడిపోవడం వల్ల రోడ్డుపై నడిచే వాహనాలకు అంతరాయం జరిగింది అలాగే బస్టాండ్ పరిధిలోని చాపల సత్తన్న రేకుల షెడ్లు ఎగిరిపోయి రోడ్డు పైన పడటం జరిగింది కల్లు మండువ దగ్గర గుండేటి మల్లేశం చెట్టు విరిగి రోడ్డుపై పడడం తో వాహనాలు రాకపోకలకు అంతరాయం జరిగింది వాహనాలు కోడిపుంజులపల్లే నుండి బస్టాండ్ కమాన్ మీదుగా వాహనాలు నడవడం జరిగింది. అలాగే విరిగిన చెట్లను జేసిబి సహాయంతో తొలగించడం వల్ల వాహనాలు యధావిధిగా వాహనాలు రాకపోకలు జరిగాయి అలాగే కోడిపుంజుల పల్లె గ్రామం లో జల్లెల్లే రామయ్య రేకుల షెడ్డు ఎగిరిపోయాయి గోడ కూలడంతో పెను ప్రమాదం తప్పింది వెంటనే ఇంట్లో ఉన్న పిల్లలుతో సహా వేరే ఇంట్లోకి పోయారు అలాగే గుండ గంగయ్య పశువులకు వేసిన రేకుల షెడ్డు రేకులు







ఎగిరి కొంత దూరం లో రేకులు చెల్లా చెదురు గా పడిపోయాయి. గుల్లకోట గ్రామ సర్పంచ్ దగ్గర ఉండి విరిగిన చెట్లను జేసిబి సహాయం తో తొలగించడం వల్ల వాహనాలు యధావిధిగా నడిచాయి. విద్యుత్ వైర్లను దగ్గరుండి సరి చేపిస్తు న్నట్లు గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ తెలిపారు.

# విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 12 (ప్రజా కలం)

రెండవ శనివారం సందర్భంగా మెట్ పల్లి వెంకట్రావుపేట విద్యుత్ ఉప కేంద్రంలో మైంటెనెన్సు పనులు నిర్వహించడం జరుగుతుందని. శుక్రవారం నాడు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ కారణంగా రేపు ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు మెట్పల్లి, వెంకట్రావుపేట, రేగుంట పట్టణ ప్రాంతంలో విద్యుత్ అంతరాయం కలుగుతున్న దృష్ట్యా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వెల్లడించారు.

# మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 12 (ప్రజా కలం) మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని చైర్ పర్సన్ అపర్ణ అన్నారు. మెట్టుపల్లి మహిళా రైతు ఉత్పత్తిదారుల వార్షిక సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో కంపెనీ చైర్పర్సన్ అపర్ణ పాల్గొని మాట్లాడారు. మహిళలు వ్యవసాయంలో మెలకువలు, పంట మార్పిడి పద్ధతులను పాటించాలని తెలిపారు. రైతు ఉత్పత్తులను, ఆహార ధాన్యాలు పంటలు పండించి కల్తీ లేని ఆహార ధాన్యాలు రైతుల నుండి కొనుగోలు చేసి వినియోగదారులకు నాణ్యమైన, కల్తీ లేని ఆహార దినుసులు అందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మెట్పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కోరుట్ల ఎఫ్ పి జి గ్రూపు సభ్యులు, ఫామ్ ఏపీఎమ్, మండలాల ఏపియం లు,సీసీలు పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా కంపనీ వార్షిక నివేదికను నివేదించారు. అనంతరం డైరెక్టర్లను ఎంపిక చేశారు.

# పడాల శ్రీనివాస్ గౌడ్‌కు డాక్టరేట్




పెద్దపల్లి,జూన్12:(ప్రజాకాలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని శాంతి నగర్‌కు చెందిన పడాల శ్రీనివాస్ గౌడ్ శాతవాహన యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్ విభాగంలో డాక్టరేట్ పట్టా సాధించారు. ఆయన శాతవాహన యూనివర్సిటీలో ప్రొఫెసర్ వరప్రసాద్ పర్యవేక్షణలో సోషియో-ఎకనామిక్ కండిషన్స్ ఆఫ్ అగ్రికల్చరల్ లేబర్స్ ఆఫ్ పెద్దపల్లి డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. జిల్లాలోని వ్యవసాయ కూలీల సామాజిక-ఆర్థిక పరిస్థితులపై శ్రీనివాస్ గౌడ్ చేసిన సమగ్ర విశ్లేషణకు గాను యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసింది. తన విద్యాభ్యాసానికి సంబంధించి,శ్రీనివాస్ గౌడ్ ప్రాథమిక విద్యను పెద్దపల్లిలోని ఇండియన్ మిషన్ హైస్కూల్‌లో పూర్తి చేయగా,ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ విద్యను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్తి చేశారు. ఈ అరుదైన ఘనత సాధించిన శ్రీనివాస్ గౌడ్‌కు పలువురు అధ్యాపకులు,స్నేహితులు మరియు శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తన పరిశోధన పూర్తి కావడానికి మార్గదర్శకత్వం వహించి,పూర్తి సహకారం అందించిన ప్రొఫెసర్ వరప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పది రోజుల జైలు శిక్ష


**-ట్రాఫిక్ సీఐ బి.శ్రీనివాస్**

పెద్దపల్లి,జూన్ 12:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడే మందుబాబులపై పెద్దపల్లి ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఆరుగురు వాహనదారులు మద్యం తాగి అడ్డంగా దొరికిపోయారు. వీరిని పోలీసులు స్థానిక కోర్టులో హాజరుపరచగా, కేసును తీవ్రంగా పరిగణించిన జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎన్.మంజుల నిందితుల్లో యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు గ్రామానికి చెందిన శివరాత్రి మల్లయ్య అనే వ్యక్తికి పది రోజుల కఠిన జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితుడిని పోలీసులు తక్షణమే జైలుకు తరలించారు. ఇదే కేసులో పట్టుబడిన మిగతా ఐదుగురు వాహనదారులకు కోర్టు 5,100 చొప్పున భారీ జరిమానా విధించినట్లు పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ బి.శ్రీనివాస్ వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరి భద్రతను దృష్టిలో ఉంచుకునే చట్టపరంగా ఇటువంటి కఠిన శిక్షలు విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. మద్యం మత్తులో అతివేగంగా,అజాగ్రత్తగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులయ్యే వారి పట్లపోలీసులు రాజీపడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు చిక్కితే ఎంతటి వారైనా కటకటాలపాలవ్వడం ఖాయమని, వాహన దారులు బాధ్యతగా వ్యవహరించి ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు.

# విద్యార్థుల అడ్మిషన్ ల కోసం ఇంటింటి ప్రచారం

మల్లాపూర్ జూన్ 12 ( ప్రజా కలం ప్రతినిధి)

మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్ల పెంపు కోసం అధ్యాపకులు మల్లాపూర్ మండలం గొర్రెపెల్లి, వివి రావుపెట్, రేగుంట,రాఘవపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కళాశాలలో ఉన్న సువిశాల తరగతి గదులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఉచిత మధ్యాహ్న భోజనం, అల్పాహారం, ఫిల్టర్ వాటర్ వంటి సౌకర్యాలను విద్యార్థులు, తల్లిదండ్రులకు వివరించారు. ఈ ప్రచారంలో అధ్యాపకులు సంతోష్ కుమార్, నంచర్ల రాజేష్, రాజేందర్, మహేష్, శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.



ప్రజా కలం
శనివారం, జూన్ 13, 2026

# టాలీవుడ్ కు ఏమైంది...

తెలుగు సినీ పరిశ్రమ సంక్షోభంలో ఉంది. ఏడాదిగా నిర్మాతకు నికరంగా లాభాలు మిగిల్చిన సినిమా లేదంటే అతిశయోక్తి కాదు. వందల కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న సినిమాలు.. రిలీజ్ ఎప్పుడో తెలియని దుస్థితిలో ఉన్నాయి. దీంతో నిర్మాతకు రిలీజ్‌కు ముందే చుక్కలు కనిపిస్తున్నాయి. సినిమా షూటింగ్ ఏడాది జరిగితే.. సీజీ వర్క్‌కు రెండుమూడేళ్లు తీసుకుంటూ.. ఏళ్ల తరబడి సాగదీస్తున్నారు. అంత టైమ్ తీసుకున్న సినిమాలు కూడా రిలీజయ్యాక.. సీజీ వర్క్ బాగాలేదనే టాక్ తొలిరోజే బయటికొస్తోంది. ఇలా వందల కోట్ల బడ్జెట్లు.. ఏళ్ల తరబడి షూటింగులతో సినిమా రిలీజ్ కు ముందే నిర్మాతలు మునిగిపోతున్న దుస్థితి టాలీవుడ్‌లో కనిపిస్తోంది. తెలుగు సినీ పరిశ్రమ ప్రస్తుతం సంక్షోభంలో పడింది. గడిచిన ఏడాదిలో అసలు హిట్ మాటే వినలేదంటున్నారు. ఇంకా మాట్లాడితే పుష్ప 2 తర్వాత నిర్మాతలకు నికరంగా డబ్బులు మిగిల్చిన సినిమా లేదని టాలీవుడ్ నిట్టూరుస్తోంది. సినీ పరిశ్రమలో చిన్న నిర్మాతలు ఎప్పుడో మునిగారు. పెద్ద నిర్మాతల స్థితి కూడా పైన పటారం. లోన లొటారంలా ఉంది. చివరకు అమెరికాలో సంపాదించిన డబ్బులతో సినిమాలు తీసే నిర్మాతలు కూడా మునిగిపోతున్నారు.తెలుగు సినీ పరిశ్రమలో మొదట్నుంచీ విజయాల శాతం తక్కువే. ఎన్నో లెక్కలు వేసుకుని.. ఎంతో జాగ్రత్తగా తీసే సినిమాలే ఆడతాయని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. అలాంటిది అసలు కనీస జాగ్రత్తలు తీసుకోకుండా.. గాల్లో లెక్కలు వేసుకుని తీసే సినిమాల గురించి చెప్పాల్సిన పనే లేదు. మొదట్లో కథల ఎంపిక కోసం ఏళ్ల తరబడి చర్చలు జరిగేవి. ఒకసారి కథ తయారయ్యాక కూడా 24 విభాగాల వారి సలహాలు తీసుకునేవారు. అలా బాగా నలిగిన, మార్పులు చేర్పులు చేసిన కథనే తెరకెక్కించేవారు. అలాగే కథకు తగ్గట్టుగా నటీనటుల ఎంపిక ఉండేది. కాంబినేషన్ల కోసం ఆరాటం, క్రేజ్ ఉన్న నటులే ఉండాలనే జంఝాటం ఏమీ ఉండేవి కాదు. పెద్ద హీరోలు అడిగినా కూడా.. ఈ కథ మీకు సరిపడదని నిర్మాతలు, దర్శకులు నిర్మొహమాటంగా చెప్పేసేవారు. ఎందుకంటే అప్పుడు కథే హీరో. సినిమాకే సింహాసనం. నటీనటులు, మిగతా వారికి ఎక్కువ ప్రాధాన్యత లేదు. ఆ రోజుల్లో ఓ సినిమాకు ప్రేక్షకుల ఆదరణ దక్కితే.. దాన్ని మిగతా భాషల్లోనూ డబ్ చేసేవారు. అప్పుడు డబ్బింగ్ రైట్స్ రూపంలోనూ డబ్బులొచ్చేవి. కొన్ని సినిమాలు నేరుగా పెట్టుబడి తేలేకపోయినా.. డబ్బింగ్ రైట్స్ తో నిర్మాతలు గట్టెక్కిన సందర్భాలున్నాయి. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితే లేదు. కాంబినేషన్ల కోసం విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు.తెలుగు సినిమాకు హంగులు, ఆర్భాటాలు చాలా ఎక్కువయ్యాయి. మార్కెట్ కూడా పెరిగిందని కొన్ని హిట్ సినిమాల కలెక్షన్లు చూపించి గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ ఏం మారినా.. విజయాల శాతం మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా ఉంది. ఏటా వందల సినిమాలు రిలీజ్ కావడమే కానీ.. డబ్బులు తెచ్చే సినిమాలు మాత్రం కనిపించడం లేదు. అడపాదడపా హిట్టయ్యే సినిమాల గురించి చెప్పుకోవడమే కానీ.. రెగ్యులర్‌గా లాభాలు మాత్రం రావడం లేదు. ఇప్పటికే సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల ప్రభావం చూచాయగా కనిపిస్తూనే ఉంది. కాకపోతే నిర్మాతలు మాత్రం కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది కాబట్టి.. పైన పటారం.. లోన లొటారం స్థితిని మెయింటైన్ చేస్తున్నారు. అమెరికాలో 10-20 ఏళ్ల పాటు డబ్బులు సంపాదించుకుని.. ఆ డబ్బులు పెట్టి సినిమాలు తీస్తున్న ఎన్నారై నిర్మాతలు కూడా నిండా మునుగుతున్నారు. వీరు మొదట పరిమిత స్థాయిలో సినిమాలు తీసి.. కాస్త లాభం కనిపించగానే.. నలుగురైదురు హీరోలు, డైరక్టర్లకు అడ్వాన్సులిచ్చి అడ్డంగా బుక్కైపోతున్నారు.ఒకప్పుడు స్క్రిప్ట్ పూర్తయ్యాక, నటీనటుల డేట్స్ అన్నీ కుదిరితేనే దర్శక-నిర్మాతలు సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేవారు. రానురానూ మార్పులు వచ్చాయి. షూటింగ్ మొదలయ్యే ముందు కూడా సన్నివేశాలు రాసుకుంటూ కూర్చోవడం వల్ల సినిమా వ్యయపెరిగిపోవడమే కాకుండా, నాణ్యతా దెబ్బతింటోందని సీనియర్ నటులు, రచయితలు వివిధ ఇంటర్వ్యూల్లో చెప్పారు. స్క్రిప్ట్ పూర్తయిన తర్వాత మరింత మెరుగు కోసం చిన్న చిన్న మార్పులు చేసుకోవచ్చు కానీ, అప్పటికప్పుడు కొత్త సన్నివేశాలు రాయడం కూడా నిర్మాణ వ్యయం పెరగడానికి కొన్నిసార్లు కారణమవుతోంది. ఇక సృజనాత్మకత పేరుతో దర్శకులు వేయించే సెట్లు, అనవసర హంగులు, విదేశీ ప్రయాణాలు.. ఇవన్నీ నిర్మాణ వ్యయాన్ని తడిసి మోపెడు చేస్తున్నాయి. ఇవన్నీ నిర్మాతలపై మోయలేని భారం మోపి.. అంతిమంగా టాలీవుడ్‌కి తీరని నష్టం చేస్తున్నాయి. సినీ పరిశ్రమకు ఎవరో పని గట్టుకుని నష్టాలు తేవడం లేదు. స్వయంగా చిత్ర పరిశ్రమే చేజేతులా సంక్షోభాన్ని కొనితెచ్చుకుంటోంది. ఇప్పటికే సగం మునిగింది. కనీసం ఇప్పటికైనా మేలుకోకపోతే.. నిండా మునిగే ప్రమాదం లేకపోలేదు. అనారోగ్యకర పోకడల్ని మొదట్లోనే తగ్గించుకునే ప్రయత్నం చేస్తే.. పరిస్థితి ఇక్కడదాకా వచ్చేది కాదు. కానీ పెడ ధోరణుల్ని ట్రెండ్ గా, కొత్త తరహా మార్కెటింగ్ సూత్రాలుగా చెప్పుకుని అదే ఒరవడిలో కొట్టుకుపోతున్నారు. ఎవరైనా సీనియర్లు సలహాలివ్వబోయినా.. వినిపించుకోవడం లేదు. అదేమంటే కాలం మారిందని చెబుతూ.. తెలుగు సినిమాని చేజేతులా చంపేయటానికి కంకణం కట్టుకున్నారు. కనీసం తెలుగు సినిమాల్ని ఓటీటీలు కూడా ఎందుకు కొనడం లేదని ఎవరూ ఆలోచించడం లేదు. ఇప్పటికైనా టాలీవుడ్ ఆత్మావలోకనం చేసుకోకపోతే.. రాబోయే రోజుల్లో తెలుగు సినీ పరిశ్రమ ఒకటుండేది అని చెప్పుకోవాల్సి వస్తుందేమో. అందుక ఇకనైనా ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకునే ప్రయాస మానేసి.. అందరూ కలిసి సమష్టి బాధ్యత తీసుకుంటే కానీ.. తెలుగు సినిమా పరిశ్రమ గాడిన పడే పరిస్థితి కనిపించడం లేదు.






## షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం



జగిత్యాల ప్రతినిధి జూన్ 12 (ప్రజా కలం)

జగిత్యాల పట్టణంలోని మోచి బజార్ లో షార్ట్ సర్క్యూట్ తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గంగాధర్ అనే టేలర్ కు చెందిన ఇంట్లో నిల్వ ఉంచిన దాదాపు 60 కొత్త కుట్టు మిషన్లు కాలిపోయాయి. ప్రమాదంలో సుమారు 8 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుని ద్వారా తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే జగిత్యాల ఫైర్ స్టేషన్ సిబ్బంది ఇంజన్ తో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. కాగా ప్రమాదానికి సంబంధించి విషయం తెలుసుకున్న జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి - శ్రీనివాస్, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ తదితరులు ప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలించి బాధితునితో మాట్లాడారు.

## జిల్లాలో విజయవంతంగా
# ధాన్యం కొనుగోళ్లు పూర్తి



### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, జూన్ 12(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు.


ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 1 లక్షా 58 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి, గోదాములకు తరలించినట్లు వివరించారు. 1 లక్షా 75 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులు, గోదాములకు తరలించినట్లు పేర్కొన్నారు. 30 వేల మెట్రిక్ టన్నుల జొన్న పంట దిగుబడి రాగా, ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నుల జొన్న పంటను కొనుగోలు చేశామని, మిగిలిన ధాన్యాన్ని మరో మూడు రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేస్తామని తెలిపారు. పంట కొనుగోలుకు సంబంధించి, డబ్బులను ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి చేయగలిగామని చెప్పారు.

రానున్న పంట కాలానికి సంబంధించి రైతులకు ఎరువుల కొరత రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులెవరూ కూడా యూరియా లభ్యతపై ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని, జిల్లాలో సరిపడినంత యూరియా అందుబాటులో ఉందని అన్నారు. ప్రస్తుతం 10734 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. రైతులు వారి అవసరాన్ని బట్టి యూరియా బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాలని చెప్పారు. ప్రతి ఎరువుల దుకాణం వద్ద ప్రత్యేకంగా ఒక పోస్టరును అందుబాటులో ఉంచుతామని, ఇందులో ఎరువుల ధరలు, తదితర వివరాలు ప్రదర్శించబడతాయని అన్నారు. రైతుల వద్ద ఎరువుల కోసం అధిక ధరలు వసూలు చేస్తే, 8977751754 నంబరును సంప్రదించవచ్చునని వివరించారు. ఎరువుల దుకాణదారులు, రైతుల వద్ద నుంచి అధిక డబ్బులు తీసుకోరాదని హెచ్చరించారు. అధిక డబ్బులు తీసుకునే దుకాణదారులపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఇప్పటికే అధిక ధరలకు ఎరువులను విక్రయించిన పలు దుకాణదారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమవుతున్నందున, ప్రజలకు ఈ ప్రక్రియపై మీడియా మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ పాత్రికేయుల సమావేశంలో పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, మార్క్ ఫెడ్ డీఎం మహేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, హార్టికల్చర్ అధికారి రమణ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా కార్యదర్శిగా నూకల అన్నపూర్ణ
### నియామక పత్రం అందించిన రాష్ట్ర అధ్యక్షురాలు రాయపూడి భవాని

వైరా జూన్ 12(ప్రజా కలం న్యూస్ )


తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా సంఘం కార్యదర్శిగా వైరా కి చెందిన నూక లఅన్నపూర్ణ ను నియమిస్తూ నియామక పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రాయపూడి భవాని హైదరాబాదులో శుక్రవారం అందజేశారు. నూకల అన్నపూర్ణ వార్డు మెంబెర్ గా వైరా లయన్స్ క్లబ్ సెక్రటరీగా ఆర్య వైశ్య మహా సభ మండల సభ్యురాలుగా వాసవి వనిత క్లబ్ నిర్వాక రాలుగా వాసవి నట రాజ భక్త బృందం లో భజన కార్యక్రమాలు ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ వైరా మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యురాలుగా పనిచేశారు, రాజకీయాల్లో కూడా తనకంటూ మంచి పేరును కూడా సంపాదించుకున్నారు. అదేవిధంగా వాసవి మాత మరియు ఆర్యవైశ్య మహాసభ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తనదైన రీతిలో మాట్లాడుతూ ప్రజలని ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా నూకల అన్నపూర్ణ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా అధ్యక్షురాలు రాయపూడి భవాని మరియు ఆర్యవైశ్య పెద్దలు పెట్టుకున్న నమ్మకంతో పని చేస్తానని , ఆర్యవైశ్య మహాసభ




కార్యక్రమాలు అందరికి చేరే విధంగా చూస్తానని ఆమె తెలిపారు.మహిళాసంఘ రాష్ట్ర కార్యదర్శి గా నియమితులు అయిన నూకల అన్నపూర్ణ ను పలువురు హర్షం ప్రకటించి అభినందనలు తెలిపారు. తెలిపిన వారిలో 12 వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత బొగ్గవరపు సునీత సుగ్గ ల మాదవి రాయపూడి రజిని రంగా వాసవి రాయల అన్నపూర్ణ రాయల రోజా మిట్టపల్లి సుధ మిటపల్లి రాజ్య లక్ష్మి కొప్పురావూరి జాన్సీ మిట్టపల్లి మహాలక్ష్మి గజ్జల మణి రంగా సుశీల నూకల వాణిశ్రీ మిట్టపల్లి మంజుల సత్య వాణి పెరుమాళ్ళ పద్మావతి వనమా మాణికుమారి కొదుమూరుభాగ్య లక్ష్మి నాళ్ళ నాగ మల్లేశ్వరి, తదితరులు, అభినందనలు తెలియచేశారు.

## విద్యుత్ ఘాతంతో మేకల మృతి


ఒకేచోట రెండు ట్రాన్స్ఫార్మర్ లు


తెగిన వైర్ ను జాయింట్ చేశారు




రిలయన్స్ టవర్ కు వెళ్లే 11kv వైర్ లు

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 12 (ప్రజా కలం)మండలం బండలింగాపూర్ గ్రామంలో వేకువజామున కురిసిన గాలివానకు తెగిపడిన విద్యుత్ వైర్లతో మూడు మేకలు మృత్యువాత పడ్డాయి. బాధితుని కథనం ప్రకారం మేకల కాపరి వాటిని పాకకు తరలిస్తున్న క్రమంలో కిందపడి ఉన్న విద్యుత్ తీగను గమనించకపోవడంతో అవి షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాయన్నారు. ఈ ప్రమాదంలో కటిక సతీష్ అనే వ్యక్తి కూడా తీగను పక్కకు తీసే క్రమంలో షాక్ కు గురయ్యాడన్నారు. కాగా విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బాధితుడు ఆరోపించారు.

### తాడిచెర్ల ఓసీపీ కోల్ బ్లాక్‌లో
## అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలు
### - హైదరాబాద్ నిపుణుల బృందం ప్రశంసలు




మల్హర్, జూన్ 12 ప్రజాకలం ప్రతినిధి. మండల కేంద్రమైన తాడిచెర్ల లోని ఓసిపి బ్లాక్ 01 పనులు నిర్వహిస్తున్న ఏఎంఆర్ ఓసిపి గనిలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన నిపుణుల బృందం నిర్వహించిన సమగ్ర సురక్షిత మరియు ఆరోగ్య నిర్వహణ విధానాల పరిశీలన విజయవంతంగా పూర్తయింది. మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ (మైనింగ్) కె. జె. అమరనాథ్ నాయకత్వంలోని ఈ బృందం ప్రాజెక్టులోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి మూల్యాంకనం చేసింది.ఈ పరిశీలన బృందంలో మాజీ డిప్యూటీ డైరెక్టర్స్ జనరల్ వి. లక్ష్మీనారాయణ, కె. ఎస్. యాదవ్, సింగరేణి మాజీ జనరల్ మేనేజర్ పి. కుమార్ ఉన్నారు. గనిలో చట్టబద్ధమైన నిబంధనల అమలు, పాటిస్తున్న భద్రతా పద్ధతులను బృందం ప్రత్యేకంగా అభినందించింది. కార్మికులలో ఉన్న సురక్షిత అవగాహన, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సన్నద్ధత మరియు సురక్షితమైన పని వాతావరణం పట్ల నిపుణులు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తాడిచర్ల గని తరపున ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ఎ. ప్రభాకర్ రెడ్డి, కె.ఎస్.ఎస్. మూర్తి, మైన్ మేనేజర్ జె. శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ కె. సురేష్ బాబు, ప్రాజెక్టు ఇంజనీర్ కె. కిషన్, సర్వేయర్ ఎం. సర్వోత్తమ, హెచ్ఆర్ డీజీఎం జి. రమేష్ బాబు, జిఎం (ఇఅండ్ఎం) విశ్వ ప్రసాద్, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ ఎస్. రామ్‌కుమార్ పాల్గొని భద్రతా విధానాలను వివరించారు.నిపుణుల బృందం అందించిన సూచనలకు తాడిచర్ల గని యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. గని కార్మికుల రక్షణ,ఆరోగ్యంమరియు సుస్థిర గనుల నిర్వహణలో అత్యుత్తమ ప్రమాణాలను సాధించడానికి ఏఎమ్మార్ సంస్థ కట్టుబడి ఉందని యాజమాన్యం పేర్కొంది.

## ఇండియన్ ఆర్మీ కి సెలెక్ట్ అయిన దేవబండ గ్రామ యువకుడు



అలంపూర్ (ప్రజా కలం న్యూస్)

అయిజ మండలం దేవబండ గ్రామానికి చెందిన నరసన్ గౌడ్ కుమారుడు రాజేంద్ర గౌడ్ అనే యువకుడు ఇండియన్ ఆర్మీలో ని అగ్ని వీర్ టెక్నికల్ జవాన్ గా ఉద్యోగం సాధించారు దీంతో కుటుంబ సభ్యులు మరియు గ్రామ పెద్దలు ఆ యువకుడిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు తమ మారుమూల గ్రామం నుండి దేశ సేవకై ఆర్మీలో ఉద్యోగం సాధించడం పట్ల గ్రామానికి పేరు ప్రతిష్టలు తెచ్చి పెట్టారని గ్రామ పెద్దలు యువకులు కొనియాడారు.

## జిల్లా గ్రంథాలయ శాఖకు తాళం వేసి నిరసన చేపట్టిన పాఠకులు

### -కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారని ఆరోపణలు



ప్రజా కలం న్యూస్ (గద్వాల ప్రతినిధి)

గద్వాల పట్టణంలో గల జిల్లా గ్రంథాలయానికి బీఆర్ఎస్వీ నాయకులు కుర్వపల్లయ్య ఆధ్వర్యంలో పాఠకులు తాళం వేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ఒకే గదిలో 20మందికి పైగా నిరుద్యోగులు కూర్చుని వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని, ఫ్యాన్లు, కుర్చీలు, త్రాగు నీటి ఇబ్బంది ఉన్న అధికారులు కనీస వసతులు కల్పించడం లేదని వారు ఆరోపించారు. అధికారులు వచ్చేంతవరకు లైబ్రరీ తెరిచేది లేదని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే ని మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్



ప్రజా కలం న్యూస్ (గద్వాల ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు శుక్రవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ని గట్టు మండలం తప్పెట్లమర్లు గ్రామ సర్పంచ్ ఆశీర్వాదం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, కౌన్సిలర్ చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ మురళి, తుమ్మల నరసింహులు యాదవ్, నరహరి గౌడ్, ఉపసర్పంచ్ ఎర్రన్న, నాయకులు బంగి సుదర్శన్, బైరెడ్డి, తిమ్మప్ప, బజారి, తిప్పన్న గౌడ్, లోకయ్య,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ చేసిన సర్పంచ్ జి.రాముడు



ప్రజా కలం న్యూస్ (గద్వాల ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని చర్ల గార్లపాడు గ్రామంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం గ్రామ సర్పంచ్ జి.రాముడు ఆధ్వర్యంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు 20 లక్షల రూపాయలతో నూతన గ్రామపంచాయతీ కార్యాలయానికి, 10 లక్షల నిధులతో మహిళ సమైక్య భవనం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇందిరమ్మ రాజ్యం వచ్చాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఇందిరమ్మ ఇల్లు, గ్రామపంచాయతీ భవనాలు ప్రజలు కావాల్సిన మౌలిక వసతులను కల్పిస్తూ అభివృద్ధి చేసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభావతి, ఉప సర్పంచ్ వెంకటన్న గౌడ్, గ్రామ అధ్యక్షులు రా.రామాంజనేయులు, కార్యదర్శి, గుండు గోపాల్, వార్డ్ మెంబర్స్, గ్రామ పెద్దలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ మంజూరు:

ప్రజాకలం న్యూస్ (గద్వాల ప్రతినిధి) 2026.. 28 కి సంబంధించిన జర్నలిస్టుల అక్రిడిటేషన్ అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో మీడియా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు కార్డుల మంజూరు పై చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకి అక్రిడిటేషన్స్ మంజూరు అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ అరీఫుద్దీన్, ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్, మీడియా కమిటీ సభ్యులు అక్బర్ బాషా, పెద్ద ఇస్మాయిల్, రవీందర్ రెడ్డి, నల్లన్న, వెంకటేష్, సిరాజ్, భీమ రాయుడు, జాన్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్యానికి కాపలాదారు...
# కానీ తన బతుకుకు భరోసా ఎక్కడ?

### జర్నలిస్టుల సమస్యలపై ఆవేదన వ్యక్తం చేస్తున్న మీడియా కుటుంబం

నిర్మల్, జూన్ 12:(ప్రజా కలం జిల్లా ప్రతినిధి):

సమాజానికి అద్దం పట్టే జర్నలిస్టు నేడు తన జీవితానికే దారి వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా గుర్తింపు పొందిన జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, ప్రభుత్వ విధానాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి సంక్షేమం మాత్రం నేటికీ ప్రశ్నార్థకంగానే మిగిలిపోయింది.



ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారు. కానీ జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన హామీలు మాత్రం కాగితాలకే పరిమితమవుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, సంక్షేమ పథకాల పేర్లు ఉన్నప్పటికీ, వాటి ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో జర్నలిస్టులకు పూర్తిస్థాయిలో అందడం లేదని పలువురు వాపోతున్నారు.

అక్రిడిటేషన్ ఉన్నా ప్రయోజనం ఎంత?

జర్నలిస్టులకు ప్రభుత్వం అందించే అక్రిడిటేషన్ కార్డులు గుర్తింపుకు ఉపయోగపడుతున్నప్పటికీ, వాటి ద్వారా కలగాల్సిన అనేక సౌకర్యాలు అమలులో కనిపించడం లేదని మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా రవాణా, వైద్య సేవల విషయంలో ప్రకటించిన రాయితీలు పూర్తిస్థాయిలో అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

హెల్త్ కార్డులు ఉన్నా వైద్యం అందని పరిస్థితి

అత్యవసర సమయంలో వైద్యం కోసం ఆసుపత్రులను ఆశ్రయించే జర్నలిస్టులు హెల్త్ కార్డుల ద్వారా ఆశించిన స్థాయిలో సేవలు పొందలేకపోతున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఖరీదైన వైద్య చికిత్సల సమయంలో ఆర్థిక భారం కుటుంబాలపై పడుతోందని పలువురు చెబుతున్నారు.

ఉద్యమాల్లో ముందుంటే... సంక్షేమంలో వెనుకేనా?

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం సహా అనేక ప్రజా ఉద్యమాల్లో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువచ్చి సామాజిక మార్పుకు తోడ్పడ్డారు. అయితే అదే జర్నలిస్టులు నేడు సంక్షేమ పరంగా నిర్లక్ష్యానికి గురవుతున్నారనే భావన మీడియా వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు... కుటుంబాలకు ఆధారం ఎవరు?

విధి నిర్వహణలో ప్రమాదాలకు గురైన లేదా అనారోగ్యంతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాయి. అలాంటి కుటుంబాలకు దీర్ఘకాలిక భరోసా కల్పించే సమగ్ర సంక్షేమ వ్యవస్థ అవసరమనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

యూనియన్ల మధ్య విభేదాలు కూడా సమస్యే

జర్నలిస్టుల సంక్షేమం కోసం పోరాడాల్సిన సమయంలో యూనియన్ల మధ్య భేదాభిప్రాయాలు, వర్గ విభజనలు జర్నలిస్టు సమాజాన్ని మరింత బలహీనపరుస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జర్నలిస్టులందరూ ఒకే కుటుంబంగా ఐక్యంగా నిలిస్తేనే సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని పలువురు సీనియర్ జర్నలిస్టులు సూచిస్తున్నారు.

జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లు

జర్నలిస్టులందరికీ ఉచిత లేదా పూర్తి రాయితీతో బస్సు ప్రయాణ సదుపాయం. జర్నలిస్టుల పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్య.

జర్నలిస్టులు, వారి కుటుంబాలకు సమగ్ర ఆరోగ్య భద్రత మరియు నాణ్యమైన వైద్య సేవలు.

విధి నిర్వహణలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రత్యేక ఆర్థిక సహాయం, పునరావాసం.

ఇళ్ల స్థలాలు, గృహ వసతి మరియు ఇతర సంక్షేమ పథకాల అమలు.

ముగింపు

ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టుల సమస్యలను కూడా ప్రభుత్వం, సమాజం సమానంగా గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యానికి కాపలాదారులుగా నిలిచే మీడియా ప్రతినిధుల సంక్షేమం బలోపేతం అయితేనే స్వేచ్ఛాయుతమైన, బాధ్యతాయుతమైన జర్నలిజం మరింత బలపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జర్నలిస్టుల జీవన భద్రత, కుటుంబ సంక్షేమం కోసం సమగ్ర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మీడియా వర్గాలు కోరుతున్నాయి.

## బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ నాయకత్వంలో ఖమ్మం పోలీస్ కమిషనర్‌ను కలిసిన బీఆర్ఎస్ జిల్లా పార్టీ బృందం

### - మైనర్ బాలికపై దారుణానికి ఒడిగట్టిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఖమ్మం జూన్12( ప్రజాకలం న్యూస్)

ఖమ్మం నగరంలో 12 ఏళ్ల మైనర్ బాలికపై జరిగిన అమానుష, ఘోరమైన ఘటనను భారత రాష్ట్ర సమితి ( బిఆర్ఎస్) ఖమ్మం జిల్లా పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ విషయమై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతా మధుసూదన్, నాయకత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం శుక్రవారం ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. సభ్య సమాజాన్ని తీవ్రంగా కలచివేసిన ఈ ఘటనలో బాధిత బాలికకు తక్షణమే న్యాయం చేయాలని, నిందితుడిపై పోక్సో (పోక్సో ) చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ బృందం డిమాండ్ చేసింది.రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాల పట్ల ఈ సందర్భంగా వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.నిందితుడిపై పోక్సో చట్టంతో పాటు ఇతర సంబంధిత చట్టాల కింద అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలని, బాధితురాలికి త్వరితగతిన న్యాయం జరిగేలా కేసును ఫాస్ట్-ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలని, బాధిత బాలికకు ప్రభుత్వం తరపున అవసరమైన వైద్య, ఆర్థిక, మరియు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ భద్రత తక్షణమే కల్పించాలని, భవిష్యత్తులో జిల్లాలో ఇలాంటి దారుణమైన ఘటనలు పునరావృతం కాకుండా మహిళలు, బాలికల రక్షణ కోసం గట్టి నిఘా, పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, పాఠశాలలు, హాస్టళ్లు, అపార్ట్‌మెంట్‌లు మరియు ఇతర ప్రాంతాలలో బాలికల మరియు మహిళల భద్రతకు సంబంధించి ప్రత్యేక నిఘా ఉంచాలని, పోక్సో చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, బాలల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు అమలు చేయాలని కోరారు.

నేరస్థులు ఏ స్థాయిలో ఉన్నా వదలకుండా, చట్ట ప్రకారం కఠినంగా శిక్షించడం ద్వారానే సమాజంలో నేరగాళ్లకు గట్టి హెచ్చరిక పంపినట్లవుతుందని బీఆర్ఎస్ బృందం స్పష్టం చేసింది.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తో పాటు మాజీ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, భాషబోయిన వీరన్న, నాయకులు రెంటాల ఆనంద్, దర్గయ్య, బలుసు మురళీకృష్ణ, లింగనబోయిన సతీష్, మహమ్మద్ రఫీ, పగడాల నరేందర్, యలమద్ది రవి, గవర్రాజు శంకర్ రాజు, పటేటి సాయి, పోలూరి రామ్, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## తాడిచెర్లలో ముమ్మరంగా లైవ్ ఫొటోల నమోదు...

### - కేంద్రాల వద్దకు రాలేకపోతున్న వృద్ధులు, అనారోగ్య బాధితులు...
### - గడువు పొడిగించాలని వృద్ధులు వేడుకోలు...



మల్హర్, జూన్ 12 ప్రజాకలం ప్రతినిధి...

మండల కేంద్రమైన తాడిచెర్లలో ఫించన్ దారుల ఫేసియల్ రికగ్నిషన్ (లైవ్ అథెంటికేషన్) ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఈ ప్రక్రియ కోసం స్థానిక తాడిచెర్ల పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు ఫించన్ దారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి లబ్ధిదారుల వద్దకు వెళ్లి ప్రతి ఒక్కరి ఫేసియల్ లైవ్ అథెంటికేషన్ ఫొటోలను తన మొబైల్ ద్వారా నమోదు చేస్తున్నారు.

**ఆదివారం సెలవు.. సోమవారమే లాస్ట్!**

ఈ ఫేసియల్ రికగ్నిషన్ ప్రక్రియ పూర్తి కావడానికి సోమవారం వరకే చివరి రోజు అని అధికారులు ప్రకటించారు. అయితే, మధ్యలో ఆదివారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో గడువు చాలా తక్కువగా ఉందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

చివరి రోజైన సోమవారం లోగా అందరి లైవ్ అథెంటికేషన్ పూర్తి చేయడం కష్టసాధ్యమని, కాబట్టి ఈ చివరి గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని పలువురు ఫించన్ దారులు ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఇంటింటికీ వెళ్లి పూర్తి చేయాలి..**

వృద్ధాప్యం, అనారోగ్య సమస్యల కారణంగా చాలా మంది వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్నవారు నేరుగా పంచాయతీ కార్యాలయానికి వచ్చి అథెంటికేషన్ చేయించుకోలేకపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గడువును పొడిగించడమే కాకుండా, సిబ్బంది ప్రతి ఫించన్ దారుని ఇంటికే వెళ్లి ఫేసియల్ రికగ్నిషన్ లైవ్ అథెంటికేషన్ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత




నిర్మల్ జూన్ 12 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన హరిత వాతావరణాన్ని అందించేందుకు అందరూ తమ వంతు కృషి చేయాలని సుశాంత్ సుఖదేవ్ భోబడే, ఐఎఫ్ఎస్, జిల్లా అటవీ అధికారులు పిలుపునిచ్చారు.ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీ నుండి నిర్వహించిన 12 రోజుల ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమం శుక్రవారంతో విజయవంతంగా ముగిసింది. ఈ 12 రోజులపాటు జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, యువత ప్రజలకు పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలు, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించబడింది. అలాగే విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించేందుకు వ్యాసరచన, ఉపన్యాసం చిత్రలేఖన పోటీలు నిర్వహించగా, వాటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు మెమెంటోలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సుశాంత్ సుఖదేవ్ భోబడే, ఐఎఫ్ఎస్, జిల్లా అటవీ అధికారి, నిర్మల్ పాల్గొనగా, నాగిని భాను, అటవీ మండలాధికారి, నిర్మల్, జి. రామకృష్ణారావు, అటవీ క్షేత్రాధికారి, నిర్మల్, ఎం.డి. నజీర్ ఖాన్, ఉప అటవీ క్షేత్రాధికారి, అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వీధి కుక్కలకు వింత రోగం

### భయాందోళనలో గ్రామ ప్రజలు.. చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి...



మల్హర్, జూన్ 12 ప్రజాకలం ప్రతినిధి... :మండల కేంద్రమైన తాడిచెర్లలో వీధి కుక్కలు వింత రోగానికి గురై గ్రామంలో గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తీవ్రమైన ఎండల తీవ్రత కారణంగా ఈ కుక్కలు తీవ్రమైన 'గజ్జి' (చర్మ వ్యాధి) బారిన పడ్డాయి. శరీరంపై వెంట్రుకలు ఊడిపోయి, గాయాలతో కనిపిస్తున్న ఈ కుక్కలు వింతగా అరుస్తూ నివాస గృహాల్లోకి దూసుకొస్తున్నాయి.దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఇళ్ల నుండి బయటకు రావాలంటేనే తీవ్ర భయాందోళనకు లోనవుతున్నారు. ఎప్పుడు ఏ కుక్క దాడి చేస్తుందోనని స్థానికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ వింత రోగం ఇతర జంతువులకు, మనుషులకు వ్యాపిస్తుందేమోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, ఈ వ్యాధిగ్రస్త కుక్కలకు చికిత్స అందించాలని లేదా వాటిని నియంత్రించేందుకు తగిన చర్యలు చేపట్టాలని తాడిచెర్ల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నర్సింహుల గూడెంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

### ముగ్గు పోసిన సర్పంచ్ శంకర్ రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు



జూన్ 12 ఐనవోలు :-(ప్రజాకలం ప్రతినిధి) ఐనవోలు మండలం, నర్సింహుల గూడెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు శుభారంభం పలికారు. ఎమ్మెల్యే కే. ఆర్ నాగరాజు సహకారంతో లబ్ధిదారులైన కట్కూరి ఎల్లమ్మ (కీ.శే. వెంకటయ్య), రావుల లక్ష్మి (బిక్షపతి), నమిండ్ల కల (ఏలీయా) లకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు గ్రామ ప్రజాప్రతినిధులు సంప్రదాయబద్ధంగా ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోలేపల్లి శంకర్ రెడ్డి మాట్లాడుతూ, పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ గృహ పథకం ఎంతో ఉపయోగకరమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ కార్యదర్శి, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో గృహ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరలోనే సొంత ఇంటిలో గృహప్రవేశం చేసేలా సహకరిస్తామని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే ఖ= నాగరాజు, గ్రామ ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

మల్హర్, జూన్ 12 ప్రజాకలం ప్రతినిధి...

మల్హర్ మండలం కొయ్యూరు గ్రామంలో గురువారం రాత్రి ఘోర ప్రమాదం జరిగింది. పాత పెట్రోల్ బంక్ ఎదురుగా రోడ్డు దాటుతున్న నారా ముత్తమ్మ (75) అనే వృద్ధురాలిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలవడంతో ఆమె అక్కడికక్కడే కన్నుమూశారు. పెద్దతూండ్ల గ్రామానికి చెందిన ముత్తమ్మ, కొయ్యూరులో భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. బాధితురాలి బంధువు ఫిర్యాదు మేరకు కొయ్యూరు ఎస్ఐ మహేందర్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## పాడి రైతుల అభిమానాన్ని చూరగొన్న డాక్టర్ రాజేందర్ నాయక్‌కు ఘన వీడ్కోలు

### - ఎనిమిదేళ్ల సేవలకు గుర్తింపుగా సన్మానం
### - భూపతిపేట పశువైద్య కేంద్రానికి బదిలీ



జూన్ 12 ప్రజాకలం ప్రతినిధి:: (వరంగల్ /వర్ధన్నపేట) సాధారణ బదిలీలో భాగంగా వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేట ప్రాథమిక పశువైద్య కేంద్రంలో పశువైద్యునిగా విధులు నిర్వహించిన డాక్టర్ ఎం. రాజేందర్ నాయక్ మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం భూపతిపేట ప్రాథమిక పశువైద్య కేంద్రానికి బదిలీ అయ్యారు.గత ఎనిమిదేళ్లుగా మండలంలోని పాడి రైతులకు, పశుపోషకులకు విశేష సేవలు అందించిన డాక్టర్ రాజేందర్ నాయక్ పాడి పశువులు, గొర్రెలు, మేకలు వంటి మూగజీవాల ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషించారని పశుపోషకులు కొనియాడారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పశుసంవర్ధక రంగ అభివృద్ధికి కృషి చేశారని వారు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఘన సన్మాన కార్యక్రమంలో డాక్టర్ రాజేందర్ నాయక్ మాట్లాడుతూ, తన విధి నిర్వహణలో సహకరించిన పశువైద్య శాఖ సిబ్బందికి, పాడి రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏడి వెంకటేశ్వర్లు, మండల పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్, జేవీఓ శ్రీనివాస్, ఎల్ఎస్ఏ విజేందర్, జలయ్య, భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, వీఏ సాయిలు, ఓఎస్ స్వప్న, శోభన్‌బాబు, గోపాలమిత్ర రజితతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా మడికొండ సురేందర్ రావు జన్మదిన వేడుకలు



హనుమకొండ జూన్ 12 ప్రజా కలం ప్రతినిధి జమ్మికుంట మండలం శాయంపేట గ్రామ సర్పంచ్,సర్పంచుల ఫోరం అధ్యక్షులు మడికొండ సురేందర్ రావు జన్మదిన వేడుకలు శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తన పుట్టినరోజుని పురస్కరించుకొని వివిధ కార్యక్రమాలు నిర్వహించి అభిమానం చాటుకున్న ప్రతి ఒక్కరికి పేరు పేరు నా సురేందర్ రావు శుభాకాంక్షలు తెలియజేసారు. రానున్న రోజులలో ప్రజల, అభిమానుల ప్రేమ తో శాయంపేట గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలియజేసారు.

## ఖనిజ నిక్షేపాలకు విదేశాల్లో విలువ పెంచేందుకు సన్నాహాలు

మదనపల్లె : అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో విలువైన ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు గనులు, భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ నాయనవారిపల్లె సమీపంలో గ్రానైట్ క్వారీని పరిశీలించారు. అన్నమయ్య, చిత్తూరు జిల్లాల నుంచి వివిధ రకాల మినరల్స్ దేశ, విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని, వాటి విలువను మరింత పెంచే అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఐరన్ఓర్, క్వార్ట్జ్, మాంగనీస్, డొలమైట్స్, లైమ్‌స్టోన్ తదితర విలువైన ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించామన్నారు.గత వైసీపీ పాలనలో మైన్స్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి క్వారీలన్నీ మూత పడినట్లు ఈ సందర్భంగా గుర్తుచేశారు. వైసీపీ నేతలు అరాచకాలతోపాటు స్వలాభం కోసం ఖనిజ సంపదను కొల్లగొట్టారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం రాగానే మూతపడిన పరిశ్రమలను తెరిపించామన్నారు. చిన్నచిన్న సమస్యలు పరిష్కరించడంతో మైన్స్‌లో ప్రభుత్వ ఆదాయం 40 శాతం పెరిగిందని తెలిపారు. వడ్డెర సహకార సంఘాలకు కూటమి ప్రభుత్వ మైన్స్ విభాగంలో 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీవో జారీ చేసిందన్నారు. ఇది గతంనుంచి అందుబాటులో ఉండగా దివంగత సీఎం వై.ఎస.రాజశేఖరరెడ్డి రద్దు చేశారని, తర్వాత వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిఆ జీవోను తొక్కి పెట్టగా కూటమి ప్రభుత్వం దాన్ని అమలు చేస్తూ ఆదేశాలు ఇచ్చిందన్నారు. మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చిన బాబు, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు, ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్‌ఖాన్, వై.దొరస్వామినాయుడు, టీడీపీ సీనియర్ నేత ఎస్.జయరామ నాయుడు, సురేంద్రయాదవ్, మైన్స్ ఏడీ రంగకుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మదనపల్లెకు వచ్చిన మంత్రికి జి.శ్రీరామ్‌చినబాబు, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త కె.మల్లికార్జుననాయుడు, స్వాగతం పలికారు.

## జిల్లాను మైనింగ్‌లో అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

చిత్తూరు: 'జిల్లాలో వ్యవసాయం తర్వాత మైనింగ్ రంగం కీలకమైంది. గత వైసీపీ ప్రభుత్వంలో స్తంభించిన అభివృద్ధిని తిరిగి గాడిలో పెడతాం. మైనింగ్ రంగంలో జిల్లాను తిరిగి అగ్రగామిగా తీర్చిదిద్దుతాం' అని గనులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జిల్లాలోని మైనింగ్ పురోగతి, సమస్యలపై అధికారులు, క్వారీ యజమానులతో బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సమీక్షించారు. జిల్లాలో 682 మైనింగ్ లీజులు ఉండగా, వాటిలో 50శాతం మాత్రమే కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్నారు. 500- 600 మధ్య ఖనిజ ఆధార పరిశ్రమలున్నాయి. వివిధ కారణాలతో చాలావరకు పనిచేయడం లేదన్నారు. తమ ప్రభుత్వం ఖనిజాధారిత పరిశ్రమలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. వడ్డెర్లకు 33 శాతం రిజర్వేషన్ కల్పించి.. వడ్డెర సహకార సంఘాలకు 50శాతం రాయితీతో క్వారీ లీజులు అందించేలా చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. అర్హత కలిగిన మరిన్ని సంఘాలకూ అవకాశాలిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర గనుల ఆదాయం సుమారు రూ.3వేల కోట్లకు చేరుకోవడంతో 40శాతం వృద్ధి నమోదైందన్నారు. బీల్‌స్టోన్, ఐరన్ ఓర్, బీచ్ శాండ్ మినరల్స్ వంటి ఖనిజ వనరుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే 12 బ్లాకులను గుర్తించి దశలవారీగా వేలాలు నిర్వహించి,వాటిని ఉత్పత్తిలోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. క్వారీ, గ్రానైట్ పరిశ్రమల సమస్యలను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీతో అధ్యయనం చేయిస్తామన్నారు. కలర్ గ్రానైట్ రంగంలో రాయల్టీ తదితరకారణాల వల్ల నష్టపోతున్నట్లు పలువురు ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకురాగా.. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను పరిశీలిస్తామని చెప్పారు. మైనింగ్‌కు సంబంధించి అటవీ అనుమతు లు, రెవెన్యూ, ఎన్ఓసీ మంజూరులో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి చెప్పారు.

# సంస్కార విద్యకు శ్రీకారం.. ఇల్లందలో శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రారంభం

### - చదువుతో పాటు భారతీయ సంస్కృతి, దేశభక్తి పెంపొందించడమే లక్ష్యం : ఈగ మల్లేశం
### - ప్రత్యేక చండీయాగం, నూతన తరగతి గదుల ప్రారంభోత్సవం

జూన్ 12 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట) ప్రస్తుత కాలంలో విద్యతో పాటు నైతిక విలువలు, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల బోధన విద్యార్థులకు అత్యంత అవసరమని కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల శాఖ పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సరస్వతి శిశు మందిర్ (ఇంగ్లీష్ మీడియం) పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభివృద్ధి, సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక చండీయాగం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ జరిగిన యాగంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈగ మల్లేశం, సరస్వతి మాత చిత్రపటానికి పూజలు నిర్వహించి నూతన తరగతి గదులను ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, శ్రీ సరస్వతి విద్యాపీఠం సనాతన ధర్మానికి, భారతీయ హిందూ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తూ రాబోయే తరాలకు దిక్సూచిగా మారుతోందన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల బోధనే కాకుండా దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, పెద్దల పట్ల గౌరవం వంటి సద్గుణాలను పెంపొందించడంలో సరస్వతి శిశు మందిర్ విద్యాసంస్థలు విశేష కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆధునిక విద్యతో పాటు భారతీయ సంస్కృతి,



సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. చదువుతో పాటు సంస్కారాన్ని అందించే "చదువుల తల్లి"గా సరస్వతి శిశు మందిర్ గుర్తింపు పొందిందని, యువతను సన్మార్గంలో నడిపిస్తూ సమాజానికి ఆదర్శప్రాయమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే విద్యతో పాటు నైతిక విలువలు కూడా అవసరమని, ఆ రెండు అంశాలను సమన్వయం చేస్తూ సరస్వతి శిశు మందిర్ సంస్థలు దేశ భవిష్యత్తును నిర్మిస్తున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్తాన్ కు నీటి కష్టాలు

శ్రీనగర్ : పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్తాన్ విషయంలో అనేక కఠిన నిర్ణయాలు తీసుకుంది. దౌత్యపరమైన చర్యలు చేపట్టింది. దశాబ్దాల నాటి సింధూ జల ఒప్పందాన్ని హోల్డ్‌లో పెట్టింది. తర్వాత ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. రక్తం నీరు ఏకకాలంలో పారవని స్పష్టం చేసింది. దీంతో సింధూ జలాలు రాక పాకిస్తాన్‌లో కరువు చాయలు, ఆకస్మిక వరదలు వస్తున్నాయి. ఒప్పందం పునరుద్ధరణకు పాకిస్తాన్ అంతర్జాతీయంగా భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించింది. కానీ అవి ఫలించలేదు.తాజాగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్.పాటిల్ సింధు జలాల విషయంలో భారత్ కఠిన నిర్ణయాన్ని మరోసారి స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో సింధు నదీ వ్యవస్థ నుంచి పాకిస్థాన్‌కు ఒక్క చుక్క నీరు కూడా చేరకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. 'సింధు జలాల ఒప్పందం రద్దు చేయలేదు. ఇంకా అమలులోనే ఉంది. కానీ తాత్కాలికంగా నిలిపివేశాం. సరిహద్దు గుండా నీళ్లు వెళ్లకుండా ఆపేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని సీఆర్.పాటిల్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు హోం మంత్రి అమిత్ షా ఈ అంశాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు1960 సింధు జలాల ఒప్పందం ప్రస్తుతం హోల్డ్‌లో ఉంది. భారత్ ఈ ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేయకపోయినా, పాకిస్తాన్‌కు నీరు అందకుండా చేసేందుకు సాంకేతిక, ఇంజనీరింగ్ చర్యలు తీసుకోవడం ద్వారా ఒప్పంద స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. ఇటీవలి సరిహద్దు ఉద్రిక్తతలు, ఉగ్రవాద సంఘటనల నేపథ్యంలో భారత్ సింధు జలాలను ఒక వ్యూహాత్మక ఆయుధంగా ఉ



పయోగించుకోవాలని నిర్ణయించింది. నీటిని భారత్ సొంత అవసరాల కోసం వినియోగించుకోవాలి అన్న ప్రధాని మోదీ స్పష్టమైన ఆదేశాలను అమలుకు చర్యలు చేపట్టారు.సింధూ జలాలను కేంద్రం పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు మళ్లించాలని భావిస్తోంది. దీంతో ఆ రాష్ట్రాలకు అదనపు నీటి వనరులు లభించే అవకాశం ఉంది. శత్రు దేశానికి నీటిని వెళ్లకుండా చేయడమే లక్ష్యంగా ఇప్పటికే సింధూ, దాని ఉప నదులపై బ్యారేజీలు నిర్మిస్తోంది. అధిక వర్షాలు ఉంటే గేట్లు ఎత్తి పాకిస్తాన్‌లో ఆకస్మిక వరదలు సృష్టిస్తోంది.భారత్?పాకిస్థాన్ మధ్య నీటి వివాదంలో కొత్త అధ్యాయం మొదలైంది. ఒప్పందం నిలిపివేతను ఆచరణాత్మకంగా అమలు చేయడం ద్వారా భారత్ తన నీటి సార్వభౌమత్వాన్ని బలపరచుకోవాలని చూస్తోంది. ఈ అంశం రాబోయే రోజుల్లో ద్వైపాక్షిక సంబంధాలపై ఎంత ప్రభావం చూపించనుందనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# కోలివింగ్ హాస్టల్స్ లో ఏం జరుగుతోంది?

హైదరాబాద్ : హైదరాబాద్‌లో రోజురోజుకూ కో లివింగ్ కల్చర్ పెరిగిపోతోంది. ఈ క్రమంలోనే కో లివింగ్ హాస్టల్స్ పుట్టగొడుగుల్లో పుట్టుకొస్తున్నాయి. అయితే ఇలాంటి కో లివింగ్ హాస్టల్‌లలో ఉండే యువతీ యువకులు.. తమ కుటుంబాలకు ఆ విషయం చెప్పకుండా.. ప్రియుడు, ప్రియురాలితో కలిసి ఉంటున్న వారే ఎక్కువగా ఉన్నారు. ఈ క్రమంలోనే కో లివింగ్ హాస్టల్‌లలో ఉంటూ.. మనస్పర్థలు ఏర్పడి విడిపోతున్న జంటలు చూస్తూనే ఉన్నాం. మరికొందరు అయితే హత్య చేయడం లేదా ఆత్మహత్యకు చేసుకుని.. ప్రాణాలు తీసుకుంటున్నారు. ఈ కో లివింగ్ కల్చర్ పెరిగిపోవడం పట్ల నగరవాసులు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కో లివింగ్ హాస్టల్స్‌ను సమర్థించే వారు కొందరు, విమర్శించే వారు మరికొందరు ఉండటంతో వీటిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.కో లివింగ్ హాస్టల్స్ నిర్వహణ తీరు, అందులో అసలు ఏం జరుగుతోంది.. ఈ కో లివింగ్ హాస్టల్స్ వల్ల యూత్ ఏ రకంగా ప్రభావితం అవుతోంది అనే విషయాలను తెలుసుకునేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వీ హనుమంత రావు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం నగరంలో నడుస్తున్న కో లివింగ్ హాస్టల్స్‌లో అసలు ఏం జరుగుతుందో క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కో లివింగ్ హాస్టల్స్ పేరుతో అక్కడ జరుగుతున్న పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాల్సి ఉందని వీహెచ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి.. అది అధ్యయనం చేసిన తర్వాత.. వాటిని పూర్తిగా రద్దు చేయాలా లేక ఇంకా కఠినమైన రూల్స్ తీసుకురావాలా అనే విషయంపై ఒక క్లారిటీ వస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి కో లివింగ్ హాస్టల్స్ పరిధిలో ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు మాత్రమే మీడియా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని తెలిపారు.కో లివింగ్ హాస్టల్స్‌లో ఉండటం అనేది అమ్మాయిల తప్పా లేక అబ్బాయిల తప్పా అనేది తెలుసుకోవాలని వీహెచ్ హితవు పలికారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలంటే.. ఒక హై లెవల్ కమిటీ ద్వారా సమగ్రంగా విచారణ చేయించి.. ఆ కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. దీంతో వీహెచ్ చేసిన సూచనపై ఆలోచించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నెటిజన్లు సూచిస్తున్నారు.ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న ఓ కో లివింగ్ హాస్టల్‌పై నుంచి ఒక యువతి దూకి ప్రాణాలు తీసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రియుడి వేధింపులను తట్టుకోలని ప్రియురాలు.. అదే కో లివింగ్ హాస్టల్ బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు కూడా గతంలో ఇలాంటి ఘటనలు జరిగిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ఈ కో లివింగ్ హాస్టల్స్‌లో ఉండే యువతీయువకులు చేసే పనులతో పరిసరాల్లో ఉండే నగరవాసులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# హత్య కేసులో 13 మందికి యావజ్జీవం

మార్కాపురం : పాతకక్షల నేపథ్యంలో దారికాచి వ్యక్తిని హత్య చేసిన కేసులో 13 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జిల్లా ఆరవ అదనపు న్యాయాధికారి వి.భవాని మార్కాపురం కోర్టులో తీర్పు చెప్పారు. 2017 మే 17న జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పొదిలి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన కంచర్ల శ్రీనుపై రాజకీయ, పాతకక్షలు పెంచుకున్న అదే గ్రామానికి చెందిన ప్రత్యర్థులు అతనిని హత్య చేయాలని పథకం పన్నారు. పొదిలిలో ఒక వివాహ వేడుకలో పాల్గొని మోటార్ సైకిల్‌పై తిరిగి రాజుపాలెం వెళుతున్న శ్రీనును దారికాచి కత్తులు, కర్రలు, గొడ్డళ్లు, ఇనుపరాడ్డు వంటి మారణాయుధాలతో దాడిచేసి కొట్టారు. దీంతో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు ఆసమయంలో పొదిలి ఇన్‌చార్జి ఎస్సైగా ఉన్న అప్పటి మర్రిపూడి ఎస్సై వై.శ్రీహరి కేసు నమోదు చేశారు. అప్పటి పొదిలి సీఐ ఎం.శ్రీనివాసరావు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం కేసులో నిందితులుగా ఉన్న చల్లా వెంకటేశ్వర్లు, చల్లా వెంకట నరసింహం, చల్లా శ్రీను, చల్లా అనిల్, లోమడ హరిబాబు, చలివేంద్రం ప్రసాద్, చల్లా రమేష్, సన్నెబోయిన కృష్ణయ్య, చల్లా నాగయ్య, దోసపాటి వెంకయ్య, దోసపాటి శ్రీనివాసులు, జూపల్లి శివయ్య, చల్లా రవి మొత్తం 13మందిని దోషులుగాకోర్టు తేల్చింది. వీరికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ బుధవారం జిల్లా ఆరవ అదనపు న్యాయాధికారి వి.భవాని తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా నెలరోజులు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు.

# పీవీటీజీ గృహాలకు ప్రోత్సాహం

### ప్రభుత్వ చొరవతో పూర్తికానున్న పనులు
#### నిర్మాణ సామాగ్రి పంపిణీకి చర్యలు - హర్షం వ్యక్తంచేస్తున్న గిరిపుత్రులు

సీతంపేట : గిరిజన ప్రాంతాల్లో జీవిస్తున్న నిరుపేద ఆదివాసీల (పర్టిక్యూలర్లి వలనరబుల్ ట్రైబల్ (గ్రూప్స్) సొంతింటి కలను నిజం చేసేందుకు కేంద్రం ప్రభుత్వం 2023-24లో ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం-జన్‌మన్)పథకాన్ని రూపొందించింది. ఈ పథకం కింద పీవీటీజీ లబ్ధిదారులకు ఒక్కో ఇంటి నిర్మాణానికి యూనిట్ ధర రూ.2.39లక్షలుగా నిర్ణయించింది. పునాది (బేస్‌మెంట్ లెవెల్)కి రూ.70వేలు, శ్లాబుఎత్తు (రూఫ్‌లెవెల్)కు రూ.90వేలు, శ్లాబుకు రూ.40వేలతో పాటు ఉపాధిహామీ పథకం కింద రోజువారి కూలి (మ్యాన్‌డేస్)రూ.27వేలు, బాత్‌రూం బిల్లు రూ.12వేలను విడతల వారీగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమచేస్తోంది. సకాలంలో నిధులు చెల్లిస్తుండడంతో జిల్లాలో పీవీటీజీలు నివసిస్తున్న 13 మండలాల్లో గృహ నిర్మాణాలు కొంతవరకు వేగవంతం అవుతున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్న యూనిట్ ధర రూ.2.39లక్షలకు మరో రూ.లక్ష అందజేసి పీవీటీజిలకు అండగా నిలుస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. దీనికి సంబంధించి ఈఏడాది ఫిబ్రవరిలో ఒక ప్రత్యేక జీవోను కూడా విడుదల చేసింది. దీనిలో భాగంగా గిరిపుత్రులకు గృహ నిర్మాణ సామాగ్రిని అందించేందుకు చర్యలు ప్రారంభించింది. ఒక్కొక్కరికి 487 కేజీల ఐరన్ బార్ రాడ్స్,10 ఎలక్ట్రికల్ ప్లాస్టిక్ పైపులు,ఎలక్ట్రికల్ వైర్, స్విచ్‌బోర్డులు, బల్బు వాలర్స్ వంటివి పంపిణీ చేసేందుకు హౌసింగ్ శాఖ కసరత్తు చేస్తోంది. ఈ మెటీరియల్స్ ఇప్పటికే ఆయా మండలాల హౌసింగ్‌శాఖ గోడౌన్లకు చేరాయి.

జిల్లాలో పరిస్థితి.. పీఎం జన్‌మన్ పథకం కింద బలిజిపేట మండలానికి 2 ఇళ్లు, మక్కువ 29, కొమరాడ 11, సాలూరు 84, పాలకొండ 38, జియ్యమ్మవలస 204, గుమ్మలక్ష్మీపురం 555, పార్వతీపురం 15, భామిని 285, పాచిపెంట 46, కురుపాం 2004,వీరఘట్టం 147, సీతంపేట 1749..మొత్తంగా 5,169 గృహాలు మంజూర య్యాయి. వీటిలో 231 గృహ లబ్ధిదారులను అనర్హులుగా (ఇన్‌ఎలిజిబుల్) అధికారులు గుర్తించారు. మిగిలిన 4,938 గృహాలకు గాను ఇంతవరకు పనులు ప్రారంభంకానివి 576వరకు ఉన్నాయి. గ్రౌండింగ్ అయి వివిధ దశల్లో ఉన్నవి 4,362 (84.39శాతం), నిర్మాణాలు పూర్తయినవి 1303 (25.21శాతం) వరకు ఉన్నాయి. ప్రగతి అంత ఆశాజనకంగా లేకపోయినప్పటికీ కూటమి ప్రభుత్వం అందించనున్న గృహనిర్మాణ సామాగ్రితో నిర్మాణాలు వేగవంతమయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

## డ్రోన్ పోలీసింగ్‌తో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట

బెలగాం : డ్రోన్ పోలీసింగ్‌తో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి పోలీసులను ఆదేశించారు. జిల్లా పోలీస్ సమావేశ మందిరంలో నెలవారీ నేర సమీక్షను వర్చువల్‌గా నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, చీటింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాలు తదితర కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సాంకేతికతను ఉపయోగించి పెండింగ్ కేసులను త్వరితగతిన దర్యాప్తు చేయాలని ఆదేశించారు. ప్రజలకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, రోడ్డు భద్రతా నియమాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ-చలానా, డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, సారా నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని పోలీస్ స్టేషన్లలో వాట్సప్ గవర్నస్ సేవలు ప్రజలకు కనబడేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సంబంధిత నేరాలకు సంబంధించి కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసులపై ఆరా తీసి వాటి పరిష్కారానికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. డిజిటల్ పోలీసింగ్ వ్యవస్థను అమలు చేయడం ప్రారంభంలో కొంత కష్టతరంగా ఉన్నప్పటికి, భవిష్యత్‌లో నేరాల దర్యాప్తుకు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ వెంకటేశ్వరరావు, పార్వతీపురం ఏఎస్పీ మనీషా వంగలరెడ్డి, సైబర్ సెల్ సీఐ తదితరులు పాల్గొన్నారు.

## బస్సు ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి

ఎస్.కోట : ఆర్టీసీ బస్సు ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతిచెందిన ఘటన ఎస్.కోట మండలంలోని పోతనాపల్లి జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంట్యాడ మండలం మదుపాడ గ్రామానికి చెందిన కొయినాన నారాయణరావు మండలంలోని సీతంపేట గ్రామంలో ఒక వ్యక్తి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దవాడు స్వామినాయుడు(17) జామి మండలం భీమసింగిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఎంపీసీ రెండో సంవ త్సరం చదువుతున్నాడు. చిన్నకుమారుడు పోతనాపల్లి గ్రామం వద్ద ఉన్న ఒక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. స్పెషల్ క్లాస్‌లకు వెళ్లిన తన తమ్ముడిని ఇంటికి తీసుకొచ్చేందుకు గురువారం రాత్రి స్వామినాయుడు పోతనాపల్లి జంక్షన్ వద్దకు వెళ్లాడు. తమ్ముడిని మదుపాడ తీసుకువస్తున్న క్రమంలో నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న సమయంలో ఎస్.కోట నుంచి విజయనగరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో స్వామినాయుడు ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. శుక్రవారం హాస్టల్‌కు వెళ్లిపోతాడనగా ఇలా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని ఆ తండ్రి విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఈ కేసును సీఐ నారాయణమూర్తి నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు.

## ఖరీఫ్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు

భీమవరం: జిల్లాలో ఖరీఫ్ సాగుకు రైతాంగానికి అవసరమైన సాగునీటిని ఎటువంటి ఆటంకాలు లేకుండా అందించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికతో పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన నీటి పారుదల సలహా మండలి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనుల పురోగతిపై ఇరిగేషన్ సర్కిల్ వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తిచేయాలని, ముఖ్యంగా షట్టర్ల మరమ్మతులను అత్యవసరంగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 18 ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు గుర్రపుడెక్కను ఉపయోగించి కంపోస్ట్ తయారీ చేపట్టిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఈ కార్యక్రమంలో జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ రైతులకు నిరంతర సాగునీటి సరఫరా కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యన్నారు. మునిసిపల్ డ్రెయినేజీ నీటిని నేరుగా పంట కాలువల్లోకి వదలడం అత్యంత ప్రమాదకరమని దీనివల్ల తాగునీటి వనరులు, పర్యావరణం కలుషితమవడంతో ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కె.మురళీకృష్ణంరాజు, వైస్ ఛైర్మన్ గుబ్బల మార్రాజు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, నీటిపారుదల శాఖ ఎస్ఈ దేవప్రకాష్, ఈఈ రమేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వరరావు, డీఈలు నారాయణ, శ్రీనివాస్, భీమవరం డ్రెయిన్స్ ఈఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

## మెరుగైన సేవలు అందించాలి : కలెక్టర్

గూడూర: ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని స్వర్ణ వార్డు కార్యాలయ సిబ్బందిని కలెక్టర్ డాక్టర్ ఏ సిరి ఆదేశించారు. గూడూరులోని 4, 6వ స్వర్ణ వార్డు కార్యాల యాలను కలెక్టర్ తనిఖీ చేసి అక్కడ సిబ్బంది అందిస్తున్న సేవలు, నిర్వహణ విధానాలను పరిశీలించారు. ఇందులో భాగంగా మహిళా పోలీ సులు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై కలెక్టర్ ఆరా తీశారు. గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ అవగాహన కార్యక్రమాల ద్వారా ఎంత మందికి అవగాహన కల్పించారో, వార్డు పరిధిలో ఉన్న మైనర్ బాలికల సంఖ్య ఎంత, వారికి సంబంధించిన రికార్డులు ఎందుకు నిర్వహించలేదని మహిళా పోలీసులను ప్రశ్నించారు. మైనర్ బాలికలకు సంబంధించి సమగ్ర రికార్డులను తప్పనిసరిగా నిర్వహించి వారి విద్య, ఆరోగ్యం, భద్రత అంశాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

## ప్లాస్టిక్ నిషేధం, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్--2026 నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలి.

### ప్లాస్టిక్ రహిత సంగారెడ్డి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి:: మున్సిపల్ చైర్పర్సన్ కూన వనిత సంతోష్.




సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 12:( ప్రజా కలం):

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్--2026 నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలని సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ కూన వనిత సంతోష్ పిలుపునిచ్చారు. గురువారం సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలిసి ప్లాస్టిక్ నిషేధం, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్--2026 నిబంధనలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి అధికారిణి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యావరణానికి తీవ్ర హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేసి, వాటికి బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. అలాగే సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్--2026 నిబంధనల ప్రకారం తడి, పొడి, హానికర వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేసి, శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడం ద్వారా పరిశుభ్రమైన పట్టణాల నిర్మాణం సాధ్యమవు తుందని తెలిపారు.

సదస్సులో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులకు బట్ట సంచులను పంపిణీ చేసి, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు ప్రత్యామ్నాయంగా వాటి వినియోగాన్ని ప్రోత్సహించారు.
ప్లాస్టిక్ రహిత సంగారెడ్డి
నిర్మాణానికి వ్యాపారవేత్తలు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలని అధికారులు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కిరాణా దుకాణాల సంఘం ప్రతినిధులు, బేకరీ షాప్ అసోసియేషన్ సభ్యులు, వ్యాపారవేత్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన టీజిఐఐసి ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్.

**- విజేతలకు బహుమతులు అందజేసిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎం.డి శశాంక**

**- గచ్చిబౌలి ఐ.ఎస్.బి లో ఘనంగా ముగింపు వేడుకలు.**

సంగారెడ్డి ప్రతినిధి జూన్ 12 (ప్రజా కలం):

రెండు రోజుల పాటు ఘనంగా జరిగిన టీజిఐఐసి ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ మూడో రోజైన శుక్రవారం ఉద్యోగుల సాంస్కృతిక వేడుకల తో ముగిసింది.



శుక్రవారం గచ్చిభౌలి ఐఎస్ బి లోని ఖేంకా ఆడిటోరియం లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల లో టీజిఐఐసి ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డాన్స్ లు చేస్తూ , పాటలు పాడుతూ ఆనందంగా గడిపారు. అనంతరం రెండురోజుల పాటు జరిగిన క్రీడా పోటీల్లో గెలిచిన విజేతలకు టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎండీ శశాంక లు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు వీలైనప్పుడల్లా తమ హాబీ లకు పదును పెట్టాలని, తద్వారా మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీజిఐఐసి ఈడి లు పవన్, వీరారెడ్డి లతో పాటు సంస్థ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించాలి: కలెక్టర్ హైమావతి.

సిద్దిపేట ప్రజాకలం జూన్ 12:
ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.హైమావతి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను అభినందించి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రకృతి సంరక్షణపై అవగాహన పెంపొందించుకొని పర్యావరణ హిత చర్యల్లో భాగస్వాములు కావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి పద్మజారాణి, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఆయిల్ పామ్ సాగుపై రైతులకు రెండు రోజుల విజ్ఞాన యాత్ర

## ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ తోటల సందర్శనకు రైతుల బృందం.

సంగారెడ్డి, ప్రతినిధి జూన్ 12:( ప్రజా కలం): రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన పెంపొందించి, శాస్త్రీయ సాగు పద్ధతులను ప్రోత్సహించేందుకు జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు రెండు రోజుల ఆయిల్ పామ్ విజ్ఞాన యాత్రను గురువారం అడిషనల్ కలెక్టర్ సంగీత జెండా ఊపి ప్రారంభించారు. జాతీయ ఆయిల్ పామ్ మిషన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ విజ్ఞాన యాత్రకు సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి గల 22 మంది రైతులను ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలంలోని ఆయిల్ పామ్ తోటల సందర్శనకు గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ సహకారంతో తీసుకెళ్లినట్లు జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వర తెలిపారు . జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి




అదనపు కలెక్టర్ సంగీత రైతుల బృందం విజ్ఞాన యాత్రను జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆయిల్ పామ్ పంట రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయక పంట అని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ముందుకు రావాలని సూచించారు. రెండు రోజులపాటు కొనసాగే ఈ విజ్ఞాన యాత్రలో రైతులు ఆయిల్ పామ్ తోటలను ప్రత్యక్షంగా సందర్శించి సాగు విధానాలు, నాణ్యమైన మొక్కల పెంపకం, తోటల నిర్వహణ, ఎరువుల యాజమాన్యం, నీటి వినియోగ పద్ధతులు, పంట దిగుబడులు, కోత అనంతర నిర్వహణ, ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన పొందనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖి సమావేశమై వారు అనుసరిస్తున్న సాగు పద్ధతులు, పంట ద్వారా పొందుతున్న ఆదాయం, ఎదుర్కొన్న సవాళ్లు మరియు వాటి పరిష్కార మార్గాలపై ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ విజ్ఞాన యాత్ర ద్వారా రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై మరింత అవగాహన పెరిగి, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టేందుకు ప్రోత్సాహం లభిస్తుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారులు, గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో విలీనం దిశగా తృణమూల్

న్యూఢిల్లీ : బీజేపీ నుండి పెరుగుతున్న రాజకీయ ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి , ప్రతిపక్షాలను బలోపేతం చేయడానికి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)ని కాంగ్రెస్లో విలీనం చేయాలని సోనియా గాంధీ ప్రతిపాదించారు. పార్టీలో అంతర్గత విభేదాలు, ప్రముఖ నాయకుల నిష్క్రమణలు వంటి సమస్యలతో సతమతమవుతున్న తరుణంలో ఈ ప్రతిపాదన రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ప్రతిపాదనపై వెంటనే ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా, ఆలోచించుకోవడానికి మమతా బెనర్జీ కొంత సమయం కోరినట్లు సమాచారం. ఈ విలీన ప్రక్రియ కోసం కాంగ్రెస్ ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన ప్రకారం, మమతా బెనర్జీకి కాంగ్రెస్ పార్టీలో జాతీయ ఉపాధ్యక్షురాలి పదవిని, అలాగే టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి పార్టీలో ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలను ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే, ఈ ప్రతిపాదనల గురించి ఇరు పార్టీల నుండి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ధృవీకరణ వెలువడలేదు. రాజకీయ ఉత్కంఠను రేపుతున్న ఈ పరిణామాల మధ్య, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. గంటన్నరకు పైగా సాగిన ఈ చర్చలు చాలా ఫలవంతంగా, నిర్మాణాత్మకంగా జరిగాయని అభిషేక్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్లో ఇటీవల ముగిసిన ఎన్నికల అనంతర పరిస్థితులపై, ప్రస్తుత రాజకీయాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం

**పెరుగుతున్న అసమ్మతి నేతలు**

తృణమూల్ కాంగ్రెస్ లో అంతర్గత సంక్షోభం ముదిరిపోయింది. ఆ పార్టీ చీఫ్ మమతా బెనర్జీ ఇండియా కూటమి సమావేశానికి ఢిల్లీ వెళ్లీ వెళ్లగానే.. కలకత్తాలో తిరుగుబాటు బావుటా ఎగిరింది. ఏకంగా 20 మంది ఎంపీలు,



తాము ఎన్డీయేలో చేరేందుకు అనుమతి కావాలంటూ స్పీకర్ ఓం బిర్లాకి లేఖ రాయడం కలకలం రేగింది. అయితే.. తాజాగా మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. యూసుఫ్ పఠాన్, సయోని ఘోష్, శత్రుఘ్న సిన్హా వంటి ప్రముఖులతో సహా దాదాపు 19 మంది ఎంపీలు తిరుగుబాటుదారుల జాబితాపై సంతకాలు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. దీనితో పార్టీ నిలువునా చీలిపోయే దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ పరిణామాలన్నీ దీదీకి సవాల్ గా నిలుస్తున్నాయి. బసిర్హత్ ఎంపీ హాజీ నూరుల్ ఇస్లాం మరణంతో ఒక స్థానం ఖాళీగా ఉండగా, ప్రస్తుతం లోక్సభలో టీఎంసీకి 28 మంది ఎంపీలు ఉన్నారు. అయితే, తాజా తిరుగుబాటు కారణంగా సభలో మమతా బెనర్జీకి ఉన్న వాస్తవ మద్దతు బలం కేవలం 19 మంది ఎంపీలకు తగ్గిపోయింది. తక్షణమే రాజీనామా చేయకూడదని లేదా అధికారికంగా ఃఏఖలో చేరకూడదని అసమ్మతి ఎంపీలు నిర్ణయించుకున్నట్లు ఆ వర్గాల సమాచారం. దానికి బదులుగా, వారు ఎన్డీఏకి మద్దతునిస్తూ ఒక ప్రత్యేక వర్గంగా కొనసాగాలని యోచిస్తున్నారు; ఫిరాయింపు నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తిరుగుబాటు వర్గానికి నాయకత్వం వహిస్తున్నట్లు భావిస్తున్న కాకోలి ఘోష్ దస్తీదార్, ఎన్డీయేకు మద్దతు ప్రకటిస్తూ లోక్సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాస్తామని చెప్పారు. కనీసం 20 మంది టీఎంసీ ఎంపీలు స్పీకర్కు అధికారిక లేఖ సమర్పించడానికి సిద్ధంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. లోక్సభలో టీఎంసీ ఛీఫ్ విప్గా దస్తిదార్ కొనసాగుతున్నారని స్పీకర్ ముందు వాదించే అవకాశం ఉందని అసమ్మతి వర్గం భావిస్తున్నట్లు సమాచారం; పార్లమెంటులో తలెత్తే అవకాశం ఉన్న న్యాయపరమైన మరియు విధానపరమైన పోరాటంలో ఈ వాదన కీలక అంశంగా మారవచ్చు.


# దడ పుట్టించిన తొలి వర్షం..

హైదరాబాద్ : హైదరాబాద్ నగరవాసులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు రాష్ట్రాన్ని తాకాయి. ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన భాగ్యనగరానికి తొలకరి పలకరింపు ఎంతో ఉపశమనాన్ని ఇస్తుందని భావించినప్పటికీ.. ఈ వాన మాత్రం సున్నితంగా, ఆనందంగా డాన్సులు వేసేలా లేదు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన ఉగ్రరూపం దాల్చి నగరవాసులను ఒక్కసారిగా దడదడలాడించింది. మంగళవారం సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా అంధకారమయమై, ఒక భారీ ఉరుముల, మెరుపుల వర్షం నగరంలోకి ప్రవేశించడంతో వాతావరణం క్షణాల్లో మారిపోయింది. వాతావరణ పరిశీలకుల హెచ్చరికల ప్రకారం.. అమీన్పూర్, పటాన్చెరు, బాచుపల్లి మీదుగా అంచెలంచెలుగా విస్తరించిన ఈ భారీ మేఘాల గుంపు, గంటల వ్యవధిలోనే హైదరాబాద్ మహా నగరాన్ని పూర్తిగా చుట్టేసింది. పశ్చిమ, మధ్య హైదరాబాద్ పరిధిలోని ఐటీ కారిడార్తో పాటు దాదాపు అన్ని ప్రాంతాల్లో ఉరుముల గర్జనలతో కూడిన కుండపోత వాన కురిసింది. కేవలం గంట వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 40 మి.మీ నుండి 50 మి.మీ వరకు వర్షపాతం నమోదు కావడంతో.. నగర రహదారులు చూస్తుండగానే చెరువులను తలపించాయి. కార్యాలయాలు ముగించుకుని ఇళ్లకు తిరుగు ప్రయాణమైన వేలాది మంది ఉద్యోగులు, సాధారణ ప్రజలు ఈ ఆకస్మిక వాన దెబ్బకు తడిసి ముద్దయ్యారు. ఈ భారీ వర్షం కారణంగా నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ముఖ్యంగా మాధాపూర్, గచ్చిబౌలి, కూకట్పల్లి, మియాపూర్, బంజారాహిల్స్, పంజాగుట్ట వంటి రద్దీ ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. రోడ్లపై చేరిన మోకాల్లోతు నీరు, లోతట్టు ప్రాంతాల్లో జలమయమైన రహదారుల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వానకు తోడు నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడటం, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడం సమస్య తీవ్రతను మరింత పెంచిందినగరంలో తలెత్తిన ఈ ట్రాఫిక్ గందరగోళాన్ని చక్కదిద్దడానికి హైదరాబాద్, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తక్షణమే రంగంలోకి దిగారు. జీహెచ్ఎంసీ డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బందితో కలిసి రోడ్లపై నిలిచిన నీటిని తొలగించే పనులను ముమ్మరం చేశారు. వాహనదారులకు సోషల్ మీడియా ద్వారా నిరంతరం అలర్ట్లు జారీ చేశారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, వీలైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ శాఖ నగరవాసులకు కొన్ని కీలక సూచనలు చేసింది. వర్షం పడుతున్న సమయంలో రోడ్లపై ప్రయాణించేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. రోడ్లు జారే ప్రమాదం ఉన్నందున వాహనాల వేగాన్ని తగ్గించి, ముందు వెళ్లే వాహనానికి తగినంత దూరం పాటించాలి.

# నందూస్ వరల్డ్ కు చిక్కులు

విజయవాడ: నందూస్ వరల్డ్ నందన, మధుకర్ కపుల్పై యూకే వీసా స్కాం ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. వీసా ఇప్పిస్తామని నమ్మబలికి విద్యార్థులు, నిరుద్యోగుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ కపుల్ చేతిలో మోసపోయామంటూ ఒక్కొక్కరిగా బయటకు వస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా గుజరాత్, కర్ణాటక నుంచి కూడా బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. నందూస్ వరల్డ్ నందనతో పాటు ఆమె భర్త మధుకర్ జాగర్లమూడి ఇద్దరూ కలిసి తెలుగు విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేశారనేది ప్రధాన ఆరోపణ. గత కొద్ది రోజులుగా అటు సోషల్ మీడియా ఇటు మేజర్ మీడియా ఛానళ్లలో యూకే వీసా స్కాం ఆరోపణలే హాట్ టాపిక్గా మారాయి. వీసాలు, ఉద్యోగాల పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేశారని... సర్టిఫికెట్ స్పాన్సర్షిప్ పేరుతో డబ్బులు దోచుకున్నారని బాధితులు పోలీస్ స్టేషన్ మెట్లెక్కారు. ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో కేసు నమోదు కాగా... దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు. మధుకర్, రమానందన పాత్రపై ఎంక్వైరీ సాగుతోంది. హైదరాబాద్, గుంటూరుల్లో ఆఫీసులు ఏర్పాటు చేసి వసూళ్లకు పాల్పడినట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. సోషల్ మీడియాలో పాపులర్ అయిన రమా నందన తన భర్తకు సహకరించారంటూ బాధితులు ఆరోపిస్తున్నారు. నందూస్ వరల్డ్ అకౌంట్కే డబ్బులు ట్రాన్స్ఫర్ చేశామని చెబుతున్నారు. కర్ణాటకకు చెందిన ఓ మహిళ తన నుంచి మధుకర్ రూ. 22 లక్షలు తీసుకున్నారని పోలీసులకు కంప్లైంట్ చేశారు. అధికారులు ఆమె సమర్పించిన ఆధారాలు పరిశీలిస్తున్నారు. నేరం రుజువైతే... ఒకవేళ నేరం రుజువైతే యూకే/భారత చట్టాల ప్రకారం జాగర్లమూడి రమానందన, మధుకర్కు పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలుస్తోంది. జైలు శిక్ష తర్వాత పాస్ పోర్ట్ రద్దు చేసి ఇండియాకి డిపోర్ట్ చేసే ఛాన్స్ ఉందని సమాచారం. పోలీసులు త్వరలోనే ఈ అంశంపై పూర్తి వివరాలు వెల్లడించనున్నారు. యూట్యూబ్ ఛానల్ కూడా సస్పెండ్ చేసే అవకాశం ఉంది. ఈ దంపతులపై భారత్లో ఇప్పటికే లుక్ అవుట్ నోటీసులు జారీ అయ్యాయి.

# బండికి బ్రేకులు..



కరీంనగర్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ దూరంగా ఉండబోతున్నారా? ఈసారి ప్రచారంలో పాల్గొనే అవకాశం లేదా? గత ఎన్నికల్లో పార్టీ కార్పొరేటర్స్ గెలుపులో కీలకంగా వ్యవహరించారని పేరున్న బండి ఇప్పుడెందుకు దూరం అవుతారు? పార్టీలో అసలా చర్చ ఎందుకు జరుగుతోంది? అది బండి వ్యక్తిగతమా లేక పార్టీ నిర్ణయమా? తెలంగాణలో పదవీ కాలం ముగిసిన మున్సిపల్ కార్పొరేషన్స్కు, గత ఎన్నికల టైంలో వివిధ కారణాలతో ఆగిన మరికొన్ని మున్సిపాలిటీలకు త్వరలోనే ఎలక్షన్స్ జరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలోని అన్ని పార్టీలు అందుకు సన్నద్ధం అవుతున్నాయి. ఆ దిశగా కమలం పార్టీ కూడా గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టింది. పాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లు, వరంగల్ , ఖమ్మం మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతాయి. గత ఎన్నికలలో బీజేపీ గ్రేటర్ పరిధిలో, వరంగల్ లో చెప్పుకోతగ్గ సీట్లే గెలుచుకుంది. గ్రేటర్ హైదరాబాద్లో ఎవరూ ఊహించనన్ని సీట్లు సాధించింది. అప్పట్లో పార్టీ ఆ స్థాయిలో పనితీరు కనబరచడానికి కారణం నాడు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ చేసిన ప్రచారం ఆయన ప్రసంగాలేనన్న అభిప్రాయం స్థానిక కేడర్లో ఉంది. బండి పార్టీలో జోష్ తీసుకురావడంతోపాటు ప్రజలను పార్టీ వైపు ఆకర్షించగలిగారన్నది వాళ్ల మాట. ఆ తర్వాత జరిగిన వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీజేపీ మంచి పెర్ఫార్మెన్స్ చూపించింది. అది కూడా బండి సంజయ్ వల్లనే అనే మాట పార్టీలో ఉంది. మళ్ళీ ఇప్పుడు ఈ రెండు ప్రాంతాల్లో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి. దీంతో బండి సంజయ్ రోల్ ఏంటన్న చర్చ మొదలైంది. ఆ మధ్య జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్ను గెల్చుకుంది బీజేపీ. నెక్ట్స్ మా టార్గెట్ జీహెచ్ఎంసీ అని అప్పుడే అన్నారు బండి సంజయ్. కానీ ఇప్పుడు మాత్రం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆయన ప్రచారంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గత ఎన్నికల టైమ్లో బండి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు కాబట్టి అంతటా తిరిగే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు ఆ ఛాన్స్లేదు. పైగా గ్రేటర్ పరిధిలో బీజేపీకి నలుగురు ఎంపీలు ఉన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు ఈ పరిధిలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ లెక్కలన్నిటినీ చూసుకుంటే ఈసారి బండి సంజయ్ ఇక్కడ ప్రచారం చేయకపోవచ్చన్న అంచనాలున్నాయి. అలాగే ఇక్కడి నేతలు కొందరికి, ఆయనకు మధ్య గ్యాప్ కూడా ఉందని చెప్పుకుంటున్నారు. ఇలాంటి రకరకాల కారణాలతో బండి సంజయ్ కూడా వ్యక్తిగతంగా గ్రేటర్లో ప్రచారంపై ఆసక్తిగా లేరని తెలుస్తోంది. అయితే హైదరాబాద్ని వదిలేసినా వరంగల్లో ప్రచారం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. పార్టీ పెద్దలకు కూడా ఇదే విషయం చెప్పినట్టు తెలిసింది.

# వామపక్షాల దారెటు...

విజయవాడ : తెలుగు రాష్ట్రాల్లో వామపక్ష భావజాలం కాస్తా పక్కదారి పట్టినట్టు కనిపిస్తోంది. మొన్నటి ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎపిసోడ్లో కూడా ఇది స్పష్టమైంది. ఇప్పుడు తాజాగా విశాఖపట్నంలో వామపక్షాల నేతలు వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉంది. రాజకీయ ప్రేరేపితం అన్నట్టు వారి ప్రవర్తన ఉంది. కూటమి వచ్చిన తర్వాత వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలకు కొంత స్వేచ్ఛ వచ్చిన మాట వాస్తవం. ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో కనీసం నోరు తెరవ లేకపోయారు వామపక్షాల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు. అంతలా ఉక్కు పాదం మోపారు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇప్పుడు కూటమి వచ్చిన తర్వాత స్వేచ్ఛ ఇస్తే.. మరోలా మాట్లాడుతున్నారు. లేనిపోని వివాదాలు తెచ్చుకుంటున్నారు. తెలంగాణలో కేసీఆర్, ఏపీలో జగన్మోహన్ రెడ్డి వామపక్షాలను ఎంతలా చూశారో అందరికీ తెలిసిన విషయమే.. ఇప్పుడు వారిద్దరి పార్టీలకు మైలేజ్ వచ్చేందుకు ఇదే వామపక్షాల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు ప్రయత్నిస్తుండటం మాత్రం విమర్శలకు తావిస్తోంది. వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలు అంటే ముందుగా గుర్తొచ్చేది సమస్యల పరిష్కారం. కార్మికులతో పాటు ఉద్యోగులు వామపక్షాలను ఆశ్రయిస్తారు. ఎందుకంటే వారు పోరాటం చేస్తే ఏదో ఒక సమస్యకు పరిష్కార మార్గం దొరుకుతుందన్న ఆశ. అయితే ఇప్పుడు వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలు రాజకీయ ప్రేరేపితం అనే చట్రంలో చిక్కుకుంటున్నాయి. లేనిపోని వివాదాలకు అవకాశం కల్పిస్తున్నాయి. సమస్యలకు పరిష్కారం మరిచి.. మరింత జఠిలం చేస్తున్నాయి. తాజాగా విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటనకు సంబంధించి.. బాధితుల పరామర్శకు వెళ్లిన.. బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చిన మంత్రి లోకేష్ పై నిలదీసినంత పని చేశారు. ఆయన సైతం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. చనిపోయింది మీ కుటుంబాలు వారు కాదు కదా బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు అంటూ.. విరుచుకు పడే దాకా పరిస్థితి వచ్చింది. ఇప్పుడు అనవసరంగా విశాఖకు చెందిన వామపక్షాల నేతలు ట్రోల్ అవుతున్నారు.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చింది. నాడు జగన్ సర్కార్ నోరు తెరవలేదు. కనీసం ప్రైవేటీకరణను నిలువరించే ప్రయత్నం చేయలేదు. ఎప్పుడైతే బిజెపితో టిడిపి, జనసేనకు పొత్తు కుదిరిందో.. నాటి నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం యూటర్న్ తీసుకుంది. ప్రైవేటీకరణ ఆగింది. 13 వేల కోట్ల రూపాయల ప్యాకేజీ సమకూరింది. వైసీపీ హయాంలో కొందరు వామపక్షాల నేతలు చెట్టాపట్టాలు వేసుకుని తిరిగారు వైసీపీ నేతలతో. కానీ ఇప్పుడు మాత్రం బాధ్యతగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తుంది. కేంద్ర ఉక్కు శాఖ పర్యవేక్షిస్తుంది. మానవతా దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. అయితే ఇప్పుడు వైసీపీ ట్రాప్ లో పడి వామపక్షాల నేతలు సమస్యలకు పరిష్కారం చూపించాల్సింది పోయి తామే సమస్యలను సృష్టిస్తున్నారు. వారికి ఉన్న మంచి పేరును చెడగొట్టుకుంటున్నారు.

# జగన్ కొత్త టీమ్...

నెల్లూరు : జగన్మోహన్ రెడ్డికి ఒక కోర్ టీం ఉంది. చాలా దగ్గరగా మెలిగే ఒక బృందం ఉంది. ఆయన చుట్టూ ఒక రక్షణ కవచంలా ఉంటుంది. ఆయన రాజకీయాల్లో యాక్టివ్ అయిన తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత.. అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ కోర్ కమిటీ లో కీలక వ్యక్తులు చేరుతూ వచ్చారు. నాగేశ్వర్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడిగా ఉండేవారు. కృష్ణమోహన్ రెడ్డి ఓ ఎస్ డి గా వ్యవహరించేవారు. సీఎంగా మారిన తర్వాత ధనుంజయ రెడ్డి ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా ఉండేవారు. సజ్జల రామకృష్ణారెడ్డి సలహాదారుడిగా మెలిగారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అయితే గట్టి మద్దతుదారుడిగా నిలిచారు. కానీ తాజాగా వీరందరినీ పక్కనపెట్టి కొత్త టీం ఏర్పాటు చేసుకునే పనిలో ఉన్నారట జగన్మోహన్ రెడ్డి. ఇటీవల జరిగిన పరిణామాలతో ఆయన కలత చెందారట. చుట్టూ వీరిని ఉంచుకొని రాజకీయాలు చేయలేనని భావించి.. కొత్త టీం ను రంగంలోకి దించేందుకు సిద్ధమయ్యారట. 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయంతో జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోటరీ పై అనేక రకాల ఆరోపణలు వచ్చాయి. వారి తీరుతోనే పార్టీ నేతలకు అధినేతకు మధ్య గ్యాప్ వచ్చిందని విమర్శలు వచ్చాయి. అయితే వైసిపి అధికారంలో ఉన్నప్పుడే జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోర్ టీం పై అనేక రకాల ఫిర్యాదులు ఉన్నాయి. కానీ అధికారంలో ఉన్నప్పుడు ఇవి సహజం అని చాలా లైట్ తీసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. అటు అధికారం కోల్పోయిన తర్వాత కూడా ఈ కోర్ టీం కూటమి ప్రభుత్వానికి టార్గెట్ అయింది. అయితే తనకు అండగా నిలిచినందునే ప్రభుత్వం టార్గెట్ చేసిందని భావించారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఎప్పుడైతే మద్యం కుంభకోణంలో నమ్మలేని నిజాలు బయటపడ్డాయో అప్పటినుంచి ఆలోచనలో పడ్డారు. సాధారణంగా అధికార పార్టీ అంటేనే అవినీతి అనేది ఉంటుంది. ఆ ఆరోపణలు కూడా వస్తుంటాయి. అదే మాదిరిగా తన చుట్టూ ఉన్న కోర్ టీం పై అవినీతి ఆరోపణలు వచ్చి ఉంటాయని జగన్మోహన్ రెడ్డి భావించారు. కానీ ఒక్కొక్కరి అక్రమ సంపాదనను ప్రత్యేక దర్యాప్తు బృందం బయటపెడుతోంది. మరోవైపు కేంద్ర సంస్థ ఈడీ సైతం వెల్లడిస్తోంది. తన వ్యక్తిగత సహాయకుడి వద్ద వందల కోట్ల రూపాయల ఆస్తులు బయటపడేసరికి జగన్ సైతం ఆశ్చర్యపోయారట. తాను ఎంతో నమ్మిన అధికారులుగా తన వద్ద పెట్టుకున్న వారు సైతం భారీగా పోగేసుకోవడాన్ని జగన్మోహన్ రెడ్డి గుర్తించారట. అయితే అత్యంత వీర విధేయుడుగా మెలిగిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అక్రమ సంపాదన చూసి ఆశ్చర్యపోయారట. సజ్జల రామకృష్ణారెడ్డి శిబిరం చేతికి మట్టి అంటకుండా చేసిన దోపిడీ గురించి తెలుసుకొని జగన్ బాధపడ్డారట. ఇంతకాలం ఇటువంటి వారిని చుట్టూ పెట్టుకున్నానా? అని బాధపడుతున్నారట. అందుకే కోర్ టీం మార్చాలన్న నిర్ణయానికి వచ్చారట. వచ్చే ఏడాది పాదయాత్రకు సిద్ధపడుతున్నారు జగన్మోహన్ రెడ్డి. ఆ సమయానికి తన చుట్టూ ఉన్న టీం ను మార్చే పనిలో ఉన్నారట. గతంలో విజయసాయిరెడ్డి ఉండేవారు. ఆయన సైతం బయటకు వెళ్లిపోయారు. అయితే ఇప్పుడు నమ్మకస్తులుగా భావించిన కోర్ టీం నట్టేట ముంచెయ్యడంతో జగన్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే జగన్ కొత్త టీం లో ఎవరు చేరుతారు అనేది ఇప్పుడు ప్రశ్నార్థకం. రకరకాల పేర్లు తెరపైకి వస్తున్నాయి. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో జగన్ కోర్ టీంలో ఎవరు చేరుతారు? అనే సందేహాలు కూడా ఉన్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# ఫీల్ గుడ్ తప్పు.. ఫీల్డ్ లో బ్యాడే

గుంటూరు : పల్నాడు జిల్లా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు వ్యవహారం గురించి ప్రస్తుతం రకరకాల చర్చలు జరుగుతున్నాయి, కొందరికి కొత్త కొత్త డౌట్స్ వస్తున్నాయి. అసలు ఆయన్ని ఏ కోణంలో చూడాలంటూ పార్టీ వర్గాలే మాట్లాడుకుంటున్నాయి. పైకి మంచి అనిపిస్తున్నా కాస్త లోతుల్లోకి తొంగి చూస్తే ఎక్కడో ఏదో తేడా కొడుతోందని అనేవాళ్ళ సంఖ్య నియోజకవర్గంలోనే పెరిగిపోతోంది. ఈ పరిస్థితుల్లోనే తాజాగా టీడీపీ అధిష్టానం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించి ఎంపీ పనితీరుకు సంబంధించిన ప్రశ్నలు సంధించడం కలకలం రేపుతోంది. 2019లో తొలిసారి నరసరావుపేట నుంచి వైసీపీ తరపున గెలిచారు లావు. 2024 ఎన్నికల్లో మరోసారి అక్కడి నుంచే బరిలో దిగాలని అనుకున్నా గుంటూరు పంపాలని నిర్ణయించింది అధిష్టానం. ఆ క్రమంలోనే వైసీపీకి రాజీనామా చేసి కొన్నాళ్ళ తర్వాత టీడీపీ కండువా కప్పుకున్నారాయన. రెండోసారి సైకిల్ గుర్తు మీద నరసరావుపేట ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో అందరూ టీడీపీ ఎమ్మెల్యేలే ఉన్నారు. మొదట్లో అంతా బాగానే ఉన్నా? మెల్లిగా పదవుల పంపకాల్లో శ్రీకృష్ణదేవరాయులుతో పాటు టీడీపీలో చేరిన వారికి ప్రాధాన్యత లభిస్తోందంటూ వివాదం మొదలైంది. వినుకొండకు చెందిన మక్కెన మల్లిఖార్జునరావుకు జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి దక్కడం వెనక ఎంపీ చొరవ ఉందని పార్టీలో ప్రచారం జరిగింది. అలాగే?లావుతో పాటు టీడీపీలోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తికి టీటీడీ బోర్డు మెంబర్‌గా అవకాశం లభించింది. ఎంపీ పరపతిని గట్టిగా వాడటం వల్లే వాళ్ళకు పదవులు వచ్చాయన్న టాక్ గట్టిగా నడిచింది పల్నాడు టీడీపీలో. అటు లోక్‌సభలో టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపీకి టీడీపీ అధిష్టానం కూడా ప్రాధాన్యం ఇచ్చింది. అదంతా ఒక ఎత్తయితే శ్రీకృష్ణ దేవరాయులు పార్టీలో గ్రూప్స్‌ని ప్రోత్సహిస్తున్నారన్న అభిప్రాయం బలపడుతోంది. ఇదే ఇప్పుడు సమస్యగా మారుతోందట. గతంలో వైసీపీ ఎంపీగా ఉన్నప్పుడు కూడా ఆయన గ్రూపులు ప్రోత్సహించారన్న ఆరోపణలున్నాయి. టీడీపీలో కూడా అదే ట్రెండ్ కొనసాగిస్తున్నారంటూ లోకల్‌గా పార్టీలో అసహనం వ్యక్తం అవుతోంది. పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుతో ఎంపీకి పొసగడం లేదని చెప్పుకుంటున్నారు. ఎంపీతో సన్నిహితంగా ఉంటాడని పేరున్న నర్సరావుపేట జనసేన నేత తరచూ తమనేతను టార్గెట్ చేస్తూ ఆరోపణల డోస్ పెంచడమే ఇందుకు నిదర్శనం అంటున్నారు ఎమ్మెల్యే వర్గీయులు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మిగతా ఎమ్మెల్యేలతో ఇప్పటికిప్పుడు విబేధాలు బయటపడకున్నా?అంతర్గతంగా ఏదో నడుస్తోందన్నది ఇంటర్నల్ టాక్. లావు తనతోపాటు వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం టీడీపీలో కొంతమంది సీనియర్లకు ఇష్టం లేదట. నియోజకవర్గాల్లో తమ ప్రాధాన్యత తగ్గకుండా చూసుకోవాలన్న టార్గెట్‌తో? ముందు జాగ్రత్తగా ఎంపీ వర్గీయులకు చెక్ పెట్టేలా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే? తాజాగా ఎంపీ పనితీరు ఎలా ఉందంటూ నియోజకవర్గంలో చాలా మందికి ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. లావుకు పార్టీలో అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పుకుంటున్న టైంలో? ఆయన పనితీరు గురించి టీడీపీ అధిష్టానం సర్వే నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. శ్రీకృష్ణదేవరాయలు వ్యవహారశైలి గురించి పార్టీ పెద్దలకు ఫిర్యాదులు వెళ్ళడం వల్లే ఈ సర్వే నిర్వహించారా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఎంపీ తీరు నచ్చని కొంతమంది నేతలైతే. అవును, నిజమే?. అందుకే సర్వే చేశారంటూ బల్ల గుద్దుతున్నారు. మొత్తం మీద నరసరావుపేట టీడీపీలో ఇప్పుడు ఐవీఐర్ఎస్ ప్రకంపనలు రేగుతున్నాయి.

# రూట్ మార్చిన కొల్లగట్ల...

విజయనగరం : విజయనగరం జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు మాజీ డిప్యూటీ స్పీకర్ వ్యవహారంపై హాట్ హాట్ డిస్కషన్స్ నడుస్తున్నాయి. మరీ ముఖ్యంగా కోలగట్ల వీరభద్రస్వామి సొంత పార్టీ వైసీపీ నాయకులకైతే ఆయన అంతరంగం అంతుచిక్కక గందరగోళ పడుతున్నారట. ఒకప్పుడు అందరికీ అందుబాటులో ఉంటూ, పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా కనిపించే స్వామి. ఇప్పుడు ఎందుకు గడప దాటటం లేదు? యాక్టివ్‌గా కనిపించడం లేదంటూ రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. ఆ క్రమంలోనే కొన్ని కొత్త సంగతులు తెలుస్తున్నాయట. మాజీ డిప్యూటీ స్పీకర్ తన వారసురాలి రాజకీయ భవిష్యత్ విషయమై ఆందోళనగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. ఆ క్రమంలోనే ఒకడుగు వెనక్కేస్తున్నారన్నది ఇంటర్నల్ టాక్. ఒకప్పుడు ఉదయం నుంచి రాత్రి వరకు పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, సమావేశాలు, నిరసనలు అంటూ నిత్యం ప్రజల మధ్యనే కనిపించేవారాయన. కానీ కొంతకాలంగా రాజకీయంగా నెమ్మదించారన్నది జిల్లాలో ఉన్న విస్తృతాభిప్రాయం. దాంతో గతంలో కనిపించినంత చురుగ్గా ఎందుకు లేరంటూ పార్టీ వర్గాలు సైతం సమాధానాలు వెదికే ప్రయత్నంలో ఉన్నాయి. తన సహజ శైలికి భిన్నంగా ప్రస్తుతం పార్టీ కార్యక్రమం ఉంటే హాజరవుతున్నారు. నాయకత్వం పిలిస్తే ముందుకొస్తున్నారు తప్ప యాక్టివ్ రోల్ తీసుకోవడం లేదు. అయితే ఈ మౌనం వెనుక ఉన్నది రాజకీయ వ్యూహమా? లేక కుటుంబ రాజకీయ భవిష్యత్తుపై ఆలోచనలా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. వాటికి సమాధానంగానే వినిపిస్తోంది వారసత్వ వ్యవహారం. తన కుమార్తె శ్రావణి రాజకీయ భవిష్యత్తుపై కోలగట్ల ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్టు చెబుతున్నారు. ఆమె గతంలో డిప్యూటీ మేయర్ బాధ్యతలు కూడా నిర్వహించినందున ఇక మీదట తనకు బదులుగా కుమార్తెను పొలిటికల్‌గా ప్రమోట్ చేయాలని భావిస్తున్నారట. ఆమె రాజకీయ భవిష్యత్‌కు బాటలు వేసే క్రమంలోనే వైసీపీ అధిష్టానం మీద వత్తిడి తెచ్చేలా వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారన్నది లోకల్ టాక్. ముఖ్యంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవిపై కోలగట్ల కన్నుపడిందని అంటున్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో తన కుమార్తె శ్రావణిని పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా ప్రకటించాలని, ఆ మేరకు ఇప్పుడే తనకు హామీ ఇవ్వాలని వీరభద్రస్వామి పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. ఛాన్స్ దొరికినప్పుడే ఉపయోగించుకుంటూ తాను పాలిటిక్స్‌లో యాక్టివ్‌గా ఉన్నప్పుడే కుమార్తె భవిష్యత్‌కు బాటలు వేయాలని అనుకుంటున్నారట కోలగట్ల. అందుకే పార్టీ అధిష్టానం నుంచి హామీ కోరుతూ ఆ విషయంలో క్లారిటీ వచ్చేదాకా కామ్ ఉండాలని భావిస్తున్నట్టు సమాచారం. మరోవైపు పార్టీ నాయకత్వం మాత్రం అలాంటి హామీలకు ఇది సమయం కాదని అంటున్నట్టు తెలిసింది. మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్న విషయంలో క్లారిటీ లేదు. అప్పటికి రాజకీయ సమీకరణలు ఎలా మారతాయో తెలియదు.

# కర్నూలులోనూ కుప్పం ఫార్ములా...

కర్నూలు : 2024 ఎన్నికల వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో టీడీపీ బాగా బలహీనంగా ఉండేది. అది ఎంతలా అంటే 2019లో అసెంబ్లీకి, లోక్‌సభకు జిల్లా నుంచి అస్సలు ప్రాతినిధ్యమే లేనంత. ఇక జెడ్పీ, మున్సిపాలిటీల్లోనూ అదే పరిస్థితి. ఇక్కడ ఇంకో విచిత్రం ఏంటంటే పార్టీ క్యాడర్ బలంగా వున్నా, కేవలం నాయకుల మధ్య విబేధాలు, వాళ్ళ మీదున్న వ్యతిరేకత లాంటి కారణాలతోనే టీడీపీ వెనుకబడింది. సుమారు రెండు దశాబ్దాల పాటు ఉమ్మడి జిల్లాలో టీడీపీ బలహీనంగానే కనిపించింది. కానీ 2024 ఎన్నికలకు వచ్చేసరికి అనూహ్యంగా పుంజుకుంది తెలుగుదేశం. జిల్లాలోని మొత్తం 14 అసెంబ్లీ, రెండు లోక్‌సభ నియోజకవర్గాలకుగాను కూటమి 12 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లలో గెలిచింది. అందులో టీడీపీ వాటానే 11 అసెంబ్లీ , 2 ఎంపీ సీట్లు. దీంతో ఇక పూర్వ వైభవం వచ్చినట్టేనని సంబరపడ్డారు ఇక్కడి తమ్ముళ్లు. కానీ ఇప్పుడు ఒక్కసారి రెండేళ్ళ వెనక్కి తిరిగి చూసుకుంటే? మొత్తం తేడాతేడాగానే కనిపిస్తోందట. పరిస్థితి మళ్లీ అధ్వాన్నంగానే మారుతోందన్నఅభిప్రాయం టీడీపీ వర్గాల్లోనే బలపడుతోంది. అందుకు కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం ఒక కారణం అయితే టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో నేతల తీరు మరో కారణం అంటున్నారు. శాసనసభ్యుల తీరు పార్టీకి తీరని నష్టం కలిగించేలా ఉందన్న వాదన బలపడుతోంది. కొందరు ఎమ్మెల్యేలు నిత్యం వివాదాల్లో చిక్కుకోవడం, నియోజకవర్గాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, భూ కబ్జా ఆరోపణలు, అక్రమ రిజిస్ట్రేషన్లతో భూములు సొంతం, దౌర్జన్యాలు, అనుచరుల ఆగడాలు వెరసి కూటమి ప్రభుత్వానికి మరకలు అంటుకునేలా చేస్తున్నాయన్నది కేడర్ వాయిస్. వీటన్నిటికీ మించి ఎమ్మెల్యేలు, ఇతర నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం లేకపోవడం, కొన్ని నియోజకవర్గాల్లో సీనియర్ నేతలు పార్టీని వీడిపోవడం, దూరంగా ఉండడం లాంటివి నష్టం కలిగిస్తున్నట్టు చెబుతున్నారు. ఆలూరు, మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, డోన్, నంద్యాల, ఆళ్లగడ్డ, శ్రీశైలం నియోజకవర్గాల్లో సమస్యలు అధికంగా ఉన్నాయట. దీంతో.. ఇప్పుడు ఆయా నియోజకవర్గాల్లో కూడా కుప్పం ఫార్ములాను అప్లయ్ చేస్తారా అంటూ తాజా చర్చలు జరుగుతున్నాయి. తన సొంత నియోజకవర్గం కుప్పంలో పార్టీ నేతలు గాడి తప్పుతున్నారని గుర్తించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నియోజకవర్గ వ్యవహారాలను చూస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను ఉన్నఫళంగా బాధ్యతల నుంచి తప్పించడం హాట్ టాపిక్ అయింది. దాంతో.. గాడి తప్పుతున్న కర్నూలు వ్యవహారాలను కూడా అదే స్పీడ్‌తో, అంతే స్ఫూర్తితో సెట్ చేస్తారా అంటూ మాట్లాడుకుంటున్నాయి పార్టీ వర్గాలు. పార్టీని చక్కదిద్దేందుకు చంద్రబాబు తన నియోజకవర్గం నుంచే ఆపరేషన్ ప్రారంభించారని, జిల్లాలోనూ ఆ ఫార్ములాను అమలు చేస్తే బాగుంటుందని కొందరు అంటుంటే అలా చేస్తారా అంటూ క్వశ్చన్ మార్క్ ఫేస్ పెట్టేవాళ్ళు మరికొందరు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను. 8 నుంచి 10 చోట్ల అంతర్గత సమస్యలతో సతమతం అవుతోంది టీడీపీ. ఎమ్మెల్యేల తీరుపై విమర్శలు తీవ్రస్థాయిలో ఉన్నట్టు అధిష్టానం దగ్గర కూడా నివేదికలు ఉన్నాయట. ఎమ్మెల్యేలపై ఆరోపణలు ఉన్న నియోజకవర్గాల్లోని పరిస్థితి ఇటీవల సమీక్షించిన చంద్రబాబు ఒక హెచ్చరిక కూడా పంపారట. నియోజకవర్గంలో పరిస్థితి ఎలా ఉందో నేరుగా చెప్పి స్ట్రాంగ్ వార్నింగ్ కూడా ఇచ్చినట్టు సమాచారం. అయినా సరే కొందరి తీరు మారడం లేదనే అభిప్రాయం కూడా పెరుగుతున్నట్టు తెలిసింది. ఈ పరిస్థితుల్లో అందర్నీ సెట్ చేయాలంటే కుప్పం తరహా ట్రీట్ మెంట్‌ను ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూడా ఇస్తారనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. అందులోనూ మా నియోజకవర్గంలోనే కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటూ ఎమ్మెల్యేలపై అసంతృప్తిగా ఉన్న కొందరు ఆల్రెడీ ప్రచారం మొదలుపెట్టేశారట. అలాంటి వాళ్ళంతా స్థానిక పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు అధిష్టానానికి చేరవేస్తున్నట్టు తెలుస్తోంది. కుప్పం తరహా ట్రీట్‌మెంట్ ఒక్కరికి ఇచ్చినా మిగతా నియోజకవర్గాలన్నిటిలో ఎక్కడి వాళ్ళు అక్కడ సెట్ అవుతారన్న అభిప్రాయం పెరుగుతోంది.

# వైసీపీ కాపు రాజకీయం...

కాకినాడ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 2029 ఎన్నికల లక్ష్యంగా చాలా రకాల వ్యూహాలు పన్నుతోంది. అందులో భాగంగా పార్టీ జనసేన పై ఫుల్ ఫోకస్ పెట్టింది. జనసేన ను దారుణంగా దెబ్బతీయాలని చూస్తోంది. కాపులను జనసేనకు దూరం చేస్తే ఆ ప్రభావం కూటమిపై పడుతుందని.. అదే జరిగితే ఇతర పక్షాల మద్దతుతో చాలా సులువుగా అధికారంలోకి రావచ్చని అంచనా వేస్తోంది. అయితే అది అంత తేలికైన విషయం మాత్రం కాదు. ముఖ్యంగా జనసేన నుంచి కాపులను ఇప్పట్లో వేరు చేయడం కుదిరే పని కాదు. ఎందుకంటే కాపులు పవన్ కళ్యాణ్ విషయంలో కొంత సంతృప్తితో అయితే మాత్రం ఉన్నారు. తమ వాడు డిప్యూటీ సీఎం పదవి వరకు వచ్చాడు అని.. ఏపీలో పాలనలో భాగస్వామ్యం అవుతున్నాడని.. ఆయన నిర్ణయాలకు గౌరవం లభిస్తుందని వారిలో సంతృప్తి ఉంది. అయినా సరే కాపులను విభజిస్తే తప్ప రాజకీయాలు చేయలేమని జగన్మోహన్ రెడ్డికి తెలుసు. కాపుల మద్దతు కోసం ఒకవైపు.. జనసేనకు దూరం చేసేందుకు మరోవైపు జగన్ చేయని ప్రయత్నం అంటూ లేదు. ప్రస్తుతం కాపులు పవన్ కళ్యాణ్ వెంట ఉన్నారు. కాపు నేతలు మాత్రం జగన్మోహన్ రెడ్డి వెంట ఉన్నారు. అంబటి రాంబాబు, బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, పేర్ని నాని, కురసాల కన్నబాబు.. ఇలా పేరు మోసిన నేతలంతా జగన్మోహన్ రెడ్డి వెంట ఉన్నారు. అయితే వీరి ద్వారా కాపులను ఆకర్షించే ప్రయత్నం చేయడం లేదు జగన్మోహన్ రెడ్డి. ఎందుకంటే వీరు ఆకర్షించే స్థితిలో లేరు. ఎంతవరకు పవన్ పై విమర్శలు చేయగలరే తప్పించి.. వీరికి మరో పని చేతకాదు. పోనీ ముద్రగడ [illegible] రామ జోగయ్య లాంటి వారిని తిరిగి ప్రయోగిస్తామంటే కాపులు మరింతగా తిరస్కరిస్తారు. ఈ విషయం జగన్మోహన్ రెడ్డికి తెలుసు కూడా. అందుకే కొత్త కాపుల కోసం ఆయన అన్వేషిస్తున్నారు. అందుకే దాసరి రాము, వంగవీటి కుటుంబం వంటి వారిపై ఆశలు పెట్టుకున్నారు. పవన్ కళ్యాణ్ టిడిపి తో పొత్తు పెట్టుకోకుండా హరిరామ జోగయ్య పేరు చెప్పుకొని చాలా ప్రయత్నాలు చేశారు అప్పట్లో. ఒకవేళ పొత్తు పెట్టుకున్న సగానికి పైగా సీట్లు కావాలని కోరారు. పవన్ కళ్యాణ్ ను కోరమని చెప్పారు. లేకుంటే పొత్తు వద్దు అని తేల్చేయమని సలహా ఇచ్చారు.

ఎప్పటికప్పుడు హరి రామ జోగయ్య పేరుతో లేఖలు రాసి పవన్ కళ్యాణ్ పై ఒత్తిడి చేసే ప్రయత్నం చేశారు. ముద్రగడ పద్మనాభం అయితే జనసేనలోకి వచ్చి.. తనదైన వైసీపీ ప్రయోజనాల కోసం కృషి చేయాలని చూశారు. దానిని ముందుగానే గ్రహించారు పవన్ కళ్యాణ్. అందుకే జనసేనలోకి ముద్రగడ ఎంట్రీని లేకుండా చేశారు. ఆ కోపంతోనే ముద్రగడ వైసీపీలోకి వెళ్లారు. పవన్ ను ఓడిస్తానని శపథం చేశారు. ఓడించలేక పద్మనాభ రెడ్డి గా పేరు మార్చుకున్నారు. జగన్మోహన్ రెడ్డి ముందుగా హరి రామ జోగయ్యను వాడేసారు. తరువాత ముద్రగడ పద్మనాభంను వాడేసారు. ఇప్పుడు కొత్తగా వాడేందుకు దాసరి రాము కనిపిస్తున్నారు. అవసరం అనుకుంటే వంగవీటి కుటుంబంలో ఒకరిని తెచ్చి కాపు రాజకీయంతో కాక రేపాలని చూస్తున్నారు. కానీ వారు ముందుకు వస్తారా లేదా అన్నది చూడాలి.

# టీజీ వర్సెస్ బైరెడ్డి... లేటెస్ట్‌గా వెంకటేష్ ఎంట్రీ

కర్నూలు : కర్నూలు రాజకీయాలు వేడెక్కాయి. టీజీ భరత్, బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి మధ్య మొదలైన వివాదంలోకి టీజీ వెంకటేష్ ఎంట్రీ ఇచ్చారు. సిద్దార్థ్ రెడ్డి నోరు జాగ్రత్తగా పెట్టుకుని మాట్లాడాలంటూ టీజీ వెంకటేష్ పరోక్షంగా హెచ్చరించారు. ఆయన తాత తనకు బాగా పరిచయమని.. ఆ పరిచయంతోనే మంచిగా మాట్లాడేది నేర్చుకోమని చెప్తున్నానని సలహా ఇచ్చారు. ఇలాగే మాట్లాడితే తాము ఊరుకున్నా.. తమ కార్యకర్తలు నాలుక కట్ చేస్తారంటూ వార్నింగ్ ఇచ్చారు. రాయలసీమ రాజకీయాలు వేడెక్కాయి. వైసీపీ నేత బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డికి, టీజీ కుటుంబానికి మధ్యన మాటల యుద్ధం నడుస్తోంది, బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి వర్సెస్ టీజీ భరత్ గా మొదలైన కర్నూలు రాజకీయం.. ఇప్పుడు మరో టర్న్ తీసుకుంది. ఇందులోకి మంత్రి టీజీ భరత్ తండ్రి టీజీ వెంకటేష్ ఎంట్రీ ఇచ్చారు. టీజీ భరత్, బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి మధ్య మొదలైన ఈ సవాళ్లు- ప్రతి సవాళ్లలోకి టీజీ వెంకటేష్ ప్రవేశించారు. బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి పేరు ప్రస్తావించకుండానే స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఎగిరెగిరి పడినవాళ్లంతా చల్లారిపోయారని.. మాటలు జాగ్రత్తగా మాట్లాడాలని టీజీ వెంకటేష్ హెచ్చరించారు.

"కొంతమంది అప్పుడప్పుడూ ఎగిరిపడుతుంటారు. ఇటీవలే ఒకడు ఎగిరిపడ్డాడు. ఆ అబ్బాయికి సంవత్సరం కిందటే ఓసారి మాటల్లో చెప్పా. నీ పేరు అందరికీ తెలిసింది. భవిష్యత్తు బాగుంటుంది. జాగ్రత్తగా మాట్లాడి, నోరుపారేసుకోకుండా బాగా మాట్లాడేది నేర్చుకోమని చెప్పా. ఎక్కడో వారిపై ప్రేమ ఉండేది. ఎందుకంటే వాళ్ల తాత నాకు క్లోజ్. చాలా సంవత్సరాలు కలిసి మెలిసి ఉన్నాం. ఆ పరిచయాలతోనే చెప్పా. కుటుంబంలో నికృష్టుడు పుడుతుంటారు. మంచి కుటుంబాల్లోనూ దరిద్రులు పుడుతుంటారు. అలాంటి వారికి బుద్ధి చెప్పే విధానాలు వేరుగా ఉంటాయి. ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు ఇలా చూస్తాం."""" రాయలసీమలో మీసాలు తిప్పుకున్నోళ్లంతా, మీసాలు దింపుకుని మాతో సహకరించారు. ఏదో వందమంది రౌడీలను వేసుకుని ఎగిరిపడుతున్నారు. ఆ పిల్లోడికి చెప్పేదొక్కటే.

వాళ్లు 100 మందిని తెస్తే మేము వేయిమందిని తెస్తాం. వాళ్లు వేయిమందిని తెస్తే మేము పదివేల మందిని తేగలం.. 10 వేల మందిని తెస్తే.. లక్ష మందిని తెస్తాం. వాళ్లు లక్ష రూపాయలు ఖర్చుచేస్తే.. నేను కోటి రూపాయలు ఖర్చు చేయగలను. నోరు పారేసుకుంటే మేమేమీ చేయకపోయినా.. మా కార్యకర్తలు ఎవరో ఒకరు నాలుక కట్ చేస్తారు.. జాగ్రత్తగా ఉండాలి" అంటూ బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డికి టీజీ వెంకటేష్ వార్నింగ్ ఇచ్చారు. కర్నూలు చెందిన సతీష్ అనే దళిత యువకుడు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే సతీష్ కుటుంబానికి ఓ ఫార్మా కంపెనీ నుంచి డబ్బులు అందాయంటూ బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి ఆరోపించటంతో ఈ వ్యవహారం మొదలైంది. సతీష్ కుటుంబానికి న్యాయం చేయాలని అడుగుతున్నందుకు అధికార పార్టీ తనను బెదిరిస్తోందన్న బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి.. ఈ క్రమంలోనే టీజీ భరత్ మీద అవినీతి ఆరోపణలు చేశారు.

# కేపీ నగర్ లో ఎమ్మెల్యే గద్దె పర్యటన


విజయవాడ : విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, వి ఎమ్ సి అధికారులు కలిసి 10వ డివిజన్, కెపి నగర్ ఏరియాలో ప్రజా సమస్యలపై పర్యటించారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ రావు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి తండ్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణం గల కారణాలు ఇంతవరకు బయట పెట్టలేదని మరియు,బాబాయ్ వివేకానంద రెడ్డి ని 48 గొడ్డలి పొట్లతో హత్య చేసినా కుటుంబ సభ్యులు ఏవిధంగా హార్ట్ ఎటాక్ చెప్పారన్నారు. భారతదేశంలో ఉమ్మడి రాష్ట్రాలను అభివృద్ధి చేసింది ఒక చంద్రబాబు వారు మాత్రమే నని,అభివృద్ధి, సంక్షేమం రెండిటినీ కూడా చిత్త శుద్ధితో చేసే నాయకులు ఎవరైనా ఉన్నారంటే చంద్రబాబు నాయుడు మాత్రమే అన్నారు. విజయవాడ నగరంలో అన్ని గేటెడ్ కమ్యూనిటీల కంటే పరిశుభ్రమైనది కెపి నగర్ మాత్రమే. రింగ్ రోడ్డు నిర్మాణం జరుగుతున్నప్పుడు నేషనల్ హైవే వారు కల్వర్టులు కట్టకపోవడం



# గ్రీన్ అవుట్‌ఫిట్‌లో సంయుక్త మ్యాజిక్...

సౌత్ ఇండియన్ క్రేజీ బ్యూటీ సంయుక్త మీనన్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక కొత్త ఫోటో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ప్రఖ్యాత 'రా మ్యాంగో' బ్రాండ్‌కు చెందిన వైబ్రెంట్ గ్రీన్ కలర్ డ్రెస్‌లో ఆమె దేవకన్యలా మెరిసిపోతోంది. "నేను కాల్చేసే వంతెనలే నా దారికి వెలుగునివ్వాలి" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ ఆమె బోల్డ్ అటిట్యూడ్‌ను చూపిస్తోంది. హాట్ టాపిక్‌గా మారిన లేటెస్ట్ ఫోటోషూట్: సంయుక్త మీనన్ ఫోటోషూట్ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఆమె అందం, కాన్ఫిడెన్స్ ఈ ఫోటోల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రముఖ సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్ట్ కాజల్ ములాని, హెయిర్ స్టైలిస్ట్ ప్రేమ్, స్టైలిస్ట్ గరిమా గార్గ్ లు సంయుక్తను ఎంతో అద్భుతంగా రెడీ చేశారు. ఫోటోగ్రాఫర్ అభిలాష్ రంగి తన కెమెరా కంటితో సంయుక్త సౌందర్యాన్ని అద్భుతంగా బంధించారు. ఈ ఫోటోషూట్ కోసం సంయుక్త ధరించిన డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ లగ్జరీ టెక్స్‌టైల్ బ్రాండ్ 'రా మ్యాంగో' డిజైన్ చేసిన రిచ్ సిల్క్ దుస్తులు ఇవి. లోతైన స్వీట్‌హార్ట్ నెక్ లైన్, దానికి కాంబినేషన్‌గా వచ్చిన గోల్డ్ టోన్ జ్యామితీయ ఆరి ఎంబ్రాయిడరీ, టాసెల్స్ వర్క్ ఈ డ్రెస్‌కు మరింత రాయల్ లుక్‌ను తీసకువచ్చాయి. ఇక ఈ ట్రెడిషనల్ అండ్ మోడ్రన్ లుక్‌లో సంయుక్త చాలా క్లాసీగా కనిపిస్తోంది.

# ఐస్ బ్లూ డ్రెస్ లో మృణాల్ కొత్త లుక్..



హను రాఘవపూడి దర్శకత్వంలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నేరుగా తెలుగులో చేసిన చిత్రం సీతరామం. ఈ సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాగూర్. సీతా మహాలక్ష్మి పాత్రలో చీరకట్టులో సాంప్రదాయంగా కనిపించి తన అద్భుతమైన నటనతో అందరిని మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా సీత పాత్రలో మృణాల్ ఒదిగిపోయింది. ఈమె నటనకు అభిమానులు మంత్రముగ్ధులు కాగా విమర్శకులు ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా ఈ సినిమా అప్పట్లో కలెక్షన్ వర్షం కురిపించి.. దుల్కర్ కు హీరోగా తెలుగులో ఒక స్థానాన్ని కల్పించింది. హీరోయిన్గా తెలుగు ప్రేక్షకుల హృదయాలను సొంతం చేసుకున్న మృణాల్.. ఈ సినిమా తర్వాత శౌర్యువ్ (తొలి పరిచయం) దర్శకత్వంలో నాని హీరోగా నటించిన హాయ్ నాన్న సినిమాలో జ్యోత్స్న పాత్రతో మరోసారి అభిమానుల హృదయాలను దోచుకుంది. ఈ సినిమా తర్వాత ఈమె చేసిన ది ఫ్యామిలీ స్టార్ సినిమా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. ఇక ఈ సినిమా డిజాస్టర్ కావడంతో కొంతకాలం టాలీవుడ్ కి దూరమైన ఈమెకు తెలుగులో అవకాశాలు లభించడం కష్టమే అనే కామెంట్లు వినిపిస్తున్న సమయంలో సడన్గా అడివి శేష్ డెకాయిట్ మూవీ నుండి శృతిహాసన్ తప్పుకోవడంతో ఆ స్థానం ఈమెకు లభించింది.అలా వచ్చిన అవకాశాన్ని ఒడిసి పట్టుకున్న ఈమె.. ఈ సినిమాలో సరస్వతి, జూలియట్ పాత్రలతో మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా ఈ సినిమాలో జూలియట్ పాత్రకు మంచి మార్కులే పడ్డాయి. ఇక ఇటు బాలీవుడ్ లో కూడా సినిమాలు చేస్తూ దూసుకుపోతోంది. అందులో భాగంగానే వరుణ్ ధావన్, పూజా హెగ్డే లతో కలిసి హై జవానీతో ఇష్క్ హోనా హై అనే సినిమాలో నటించింది. జూన్ 5వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. అటు ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా పలు ఇంటర్వ్యూలకు హాజరవుతూ సందడి చేస్తున్న మృణాల్ లేటెస్ట్ అవుట్ ఫిట్ తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. అందులో భాగంగానే తాజాగా ఐస్ బ్లూ కలర్ వెస్ట్రన్ వేర్ ధరించి ఆకట్టుకుంది.

# కళ్ళు చెదిరే గెటప్ లో ఐశ్వర్య లేటెస్ట్ లుక్!



స్వర్గీయ నటులు రాజేష్ కూతురుగా సినీ ఇండస్ట్రీ లోకి చైల్డ్ ఆర్టిస్ట్ గా అడుగుపెట్టింది ఐశ్వర్య రాజేష్. ముద్దు ముద్దు మాటలతో రాజేంద్రప్రసాద్ రాంబంటు సినిమాలో తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకున్న ఈమె.. తమిళంలో ఎక్కువగా సినిమాలు చేస్తూ హీరోయిన్గా స్థిరపడింది. ఇక తెలుగులో మళ్ళీ అదే రాజేంద్రప్రసాద్ లీడ్ రోల్ పోషించిన కౌసల్య కృష్ణమూర్తి సినిమా ద్వారా నటిగా తెలుగు తెరకు పరిచయమైన ఈమె..ఆ తర్వాత వరల్డ్ ఫేమస్ లవర్ , టక్ జగదీష్ అంటూ పలు చిత్రాలు చేసి తెలుగు ప్రేక్షకులను పలకరించింది. గత ఏడాది అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్ సరసన భాగ్యం పాత్రలో సంక్రాంతికి వస్తున్నాం అనే సినిమా చేసి అదరగొట్టేసింది. ఈ పాత్రకు ఐశ్వర్య తప్ప మరొకరు న్యాయం చేయలేరు అనే రేంజ్ లో నటించి అందరి దృష్టిని ఆకట్టుకుంది ఐశ్వర్య. ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా మారింది. డైరెక్టర్ కన్నీళ్లపై డిస్ట్రిబ్యూటర్ ఫైర్ ఇకపోతే ప్రస్తుతం ఈమె పలు భాషా చిత్రాలలో నటిస్తూ బిజీగా ఉన్నప్పటికీ.. మరొకవైపు సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. వాస్తవానికి ఐశ్వర్య రాజేష్ నటిగానే కాకుండా తనకంటూ ప్రత్యేకమైన ఫ్యాషన్ సెన్స్ ను కూడా కలిగి ఉంది. ట్రెడిషనల్ డ్రెస్ ల నుండి వెస్ట్రన్ స్టైల్ వరకు అన్నింటిలో కూడా తనదైన శైలిని ప్రదర్శిస్తూ అందరి దృష్టిని ఆకట్టుకుంటున్న ఐశ్వర్య ఒకవైపు సాంప్రదాయంగా పట్టు చీరలు, అందమైన లెహంగాలు, మోడ్రన్ డిజైనర్ శారీలలో ఆకర్షణీయంగా కనిపిస్తూ.. ట్రెడిషనల్ వేర్ లో కూడా పర్ఫెక్ట్ నిరూపించుకుంటోంది. సాంప్రదాయంగానే కాదు బోర్డ్ రూమ్ మీటింగ్స్ లేదా రెడ్ కార్పెట్ ఈవెంట్ల కోసం తరచుగా మెరూన్ లేదా ఇతర డార్క్ కలర్ వెస్ట్ కోట్ అండ్ ట్రౌజర్ సెట్లను ధరిస్తూ ప్రేక్షకులను మెస్మరైజ్ చేసే ఈమె తాజాగా మరో ఔట్ఫిట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

# ట్రెండీ అవుట్‌ఫిట్‌లో జియా.. గ్లామర్ ఓవర్ లోడెడ్!

తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ జియా శంకర్. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ, తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన గ్లామరస్ ఫోటోలు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. షుగర్ అండ్ స్పైస్ అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్, షేర్ చేసిన ట్రెండీ లుక్ ఇప్పుడు కుర్రకారు గుండెల్లో మంటలు పుట్టిస్తూ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. జియా శంకర్ తన తాజా ఫోటోషూట్ కోసం ఎంచుకున్న కలర్ ఫుల్ కాంబినేషన్ అదిరిపోయింది. ఆమె త్రీ-పీస్ కో-ఆర్డ్ సెట్ ధరించి ఎంతో స్టైలిష్‌గా, హాట్‌గా కనిపిస్తోంది. ఇక లైట్ ఎల్లో కలర్ క్రాప్ టాప్, దానికి కాంబినేషన్‌గా ఆలివ్ గ్రీన్ కలర్ హై-వైస్టెడ్ మినీ ర్యాప్ స్కర్ట్ వేసుకుంది. దీనిపై సాఫ్ట్ పింక్ కలర్ లాంగ్ స్లీవ్ కార్డిగాన్ ధరించి, తన గ్లామర్‌తో అందరినీ కట్టిపడేస్తోంది. ఇక ఈ వెస్ట్రన్ లుక్‌లో జియా చార్మింగ్ అండ్ కాన్ఫిడెంట్ లుక్స్ నెటిజన్లకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. చాలా మందికి తెలియని విషయం ఏంటంటే.. జియా శంకర్ తన నటన ప్రయాణాన్ని మన టాలీవుడ్ నుంచే మొదలుపెట్టింది. 2013లో వచ్చిన 'ఎంత అందంగా ఉన్నావే' అనే తెలుగు సినిమాతో ఆమె వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత 2018లో వచ్చిన 'హైదరాబాద్ లవ్ స్టోరీ' అనే రొమాంటిక్ కామెడీ సినిమాలోనూ నటించి మెప్పించింది. ఇక ఆ తర్వాత హిందీ టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టి 'మేరి హానికారక్ బీవి', 'కాటేలాల్ అండ్ సన్స్' వంటి సీరియల్స్‌తో దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకుంది.






# ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన కుటుంబాల ఇంటి పన్ను చెల్లించిన సర్పంచ్ సంతోష శ్రీనివాస్

## గొప్ప నిర్ణయానికి హర్షం వ్యక్తం చేసిన తాజ్పూర్ గ్రామస్తులు

యాదాద్రి భువనగిరి /జూన్ 12 ప్రజా కలం ప్రతినిధి :

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల లో చేర్పించిన కుటుంబాల ఇంటి పన్ను మినహాయింపు పథకం వర్తింపు , మరియు ప్రభుత్వ పథకాల కు మొదటి ప్రాధాన్యత అందేలా చేస్తామని తీర్మానం చేశామని ఆ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 15 లక్షల రూపాయల స్వంత నిధులతో పాఠశాల పునరుద్దరణ చేసమని రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలిచిన తాజ్ పూర్ సర్పంచ్ స్వయంగా వాళ్ళ ఇంటి పన్ను గ్రామ పంచాయతీ కి ప్రతి సంవత్సరం చెల్లిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. శుక్రవారం రోజున ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం పాలకవర్గ సభ్యులతో కలిసి గడప గడపకు తిరిగి వారి స్వంత ఖర్చులతో గ్రామ ప్రభుత్వ బడిని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల కు ధీటుగా పునరుద్దరించిన సందర్భంగా నాణ్యమైన విద్యకై ప్రభుత్వ పాఠశాల లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరడం జరిగిందని తెలిపారు. ఒక వినూత్న ఆలోచనతో గ్రామ ప్రజలకు ఎక్కడా లేనివిదంగా ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి పాఠశాల లో చేర్పించిన వారికి ఇంటిపన్ను రద్దు చేస్తానని అట్టి డబ్బులను గ్రామ పంచాయతీ తాను స్వంతంగా చెల్లిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని అదే విదంగా ప్రభుత్వ పథకాలు కూడా మన ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన కుటుంబాలు మాత్రమే అర్హులుగా ప్రకటిస్తామని ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానించడం జరిగిందని అన్నారు.అన్ని సౌకర్యాల తో, నాణ్యమైన అధ్యాపక బృందం తో చక్కని విద్య అదే విధంగా ప్రభుత్వ పథకాల అమలుకై ప్రభుత్వ పాఠశాల బలోపేతం చేయాలని వారు కోరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో సామాజిక వేత్త డా.ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి,ఉపసర్పంచ్, వార్డు సభ్యులు,ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, అంగన్వాడీ, ఆశ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలు జర్నలిస్టుల పిల్లల చదువు కోసం ఫీజులో 50% రాయితీ ఇవ్వాలి: టిడబ్ల్యూజేఎఫ్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)ప్రైవేట్ పాఠశాలలు జర్నలిస్టుల పిల్లల చదువు కోసం ఫీజులో 50% రాయితీ ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో మాయొక్క జర్నలిస్టుల పిల్లలకు 2026-27



సంవత్సరాలకు ఫీజుల్లో 50% రాయితీ జిల్లా విద్యాధికారి (DEO) వినతిపత్రం అందజేశారు. టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి గడ్డమీది అశోక్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు దామర జగదీశ్వర్ గుప్తా, ఏ గోవిందరావు లు మాట్లాడుతూ.... మేడ్చల్ జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టుల పిల్లలకు ప్రతి విద్యా సంవత్సరం మాదిరిగా ప్రైవేట్ పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం మన జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 80 శాతం జర్నలిస్టులు వేతనాలు లేక నెలవారీ ఆదాయం లేక తమ పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు ఫీజులు కట్టలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరాల్లో ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50% ఫీజు రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక రాయితీ అమలు చేయాలని సూచించారు చేస్తున్నాం. రాబోయే 2026-27 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేనాటికి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా జీవో/సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ జేఎఫ్ నాయకులు శివకుమార్, వీరేష్ ముదిరాజ్, సంజీవ్ కుమార్, శ్యాం ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ప్రజా సమస్యలపై స్పందించిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, జూన్ 12,(ప్రజా కలం)

డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఎమ్మెల్యే క్యాంపు




కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, కాలనీల ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మౌలిక వసతుల సమస్యలు, అభివృద్ధి పనులపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందిస్తాం" అని పేర్కొన్నారు.

# గ్రామ పంచాయతీల ఆర్థిక పురోగతితోనే బంగారు తెలంగాణ సాధ్యం

## స్థానిక సంస్థల బలోపేతానికి ద్వితీయ ఫైనాన్స్ కమిషన్ సరైన సూచనలు చేయాలి

## సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి

రంగారెడ్డి జిల్లా, జూన్ 12,(ప్రజా కలం)

తెలంగాణ రాష్ట్ర ద్వితీయ ఆర్థిక సంఘం (ఫైనాన్స్ కమిషన్) సభ్యులు మహ్మద్ ఆసిఫ్ అలీకి వారి జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసిఫ్ అలీ భవిష్యత్తులో ప్రజాసేవలో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన రెండవ ఆర్థిక సంఘంపై క్షేత్రస్థాయిలో ఉన్న స్థానిక సంస్థలకు, ముఖ్యంగా గ్రామ పంచాయతీలకు ఎన్నో ఆశలు మరియు అంచనాలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించాలన్నా, స్థానిక సంస్థలు



బలోపేతం కావాలన్నా ఆర్థిక వనరులు అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ద్వితీయ ఫైనాన్స్ కమిషన్.. స్థానిక సంస్థల ఆర్థిక స్వయం సమృద్ధికి, నిధుల సరైన కేటాయింపులకు సంబంధించి ప్రభుత్వానికి అత్యంత పటిష్టమైన, సరైన సూచనలు చేయాలని ఆసీఫ్ అలీని, లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి కోరారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు సకాలంలో నేరుగా పంచాయతీల ఖాతాల్లోకి చేరేలా చూడాలని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్యాకేజీలు అందించేలా సిఫార్సు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీల బలోపేతంతోనే రాష్ట్ర ప్రగతి ముడిపడి ఉందని, ఆర్థిక సంఘం సభ్యుడిగా ఆసిఫ్ అలీ స్థానిక సంస్థల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ గ్రామ ఉపసర్పంచ్ ఈరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కదారి రామకృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్ అలీ, నాయకులు కడ్తాల్ మండల బీసీ సంఘం మాజీ మండల అధ్యక్షుడు పిప్పళ్ళ వెంకటేష్, గురిగల్ల రామచంద్రయ్య, కందికంటి సుధాకర్ గౌడ్,మూడ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

## మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, పాలమూరు-రంగారెడ్డి దిండి ఎత్తిపోతల పథకాల పురోగతిపై కమిషనర్ సమీక్ష

## భూసేకరణ కమిషనర్ కె శివకుమార్ నాయుడు

మహేశ్వరం, జూన్ 12,(ప్రజా కలం)

సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం, పరిహారం చెల్లింపుల ప్రక్రియలను వేగవంతం చేసి, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ పునరావాసం, పునర్ ఉపాధి మరియు భూసేకరణ కమిషనర్

కె. శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు కలెక్టరేట్‌కు విచ్చేసిన కమిషనర్ శ్రీ కె. శివకుమార్ నాయుడుకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) అనంత్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) సునీల్ ఘన స్వాగతం పలికారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, దిండి ఎత్తిపోతల పథకం తదితర ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. భూసేకరణ, అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు, పెండింగ్ కేసుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సాగునీటి ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో కందుకూరు,




ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఆమనగల్లు, మాడ్గుల్ తహసీల్దార్లు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో ఘనంగా 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత సదస్సు

సిద్దిపేట ప్రజాకలం జూన్ 12.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్స్‌లో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. సీపీ రష్మి పెరుమాళ్, కలెక్టర్ కె. హైమావతి ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి చేర్చిన వారికి రూ. 25 వేల రహవీర్ అవార్డు అందజేస్తామని మంత్రి తెలిపారు. అనంతరం డ్రైవర్లకు యూనిఫారాలు, మెడికల్ ఫస్ట్ ఎయిడ్ కిట్లు, హెల్మెట్లు పంపిణీ చేసి, హెల్మెట్ వినియోగం, సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్ చేయకూడదని, మద్యం సేవించి వాహనం నడపకూడదని ప్రతిజ్ఞ చేయించారు.



# సంగుపల్లి పాత కుంట శిఖం భూములను కాపాడాలి

## అన్యాక్రాంతం అవుతున్న కుంట శిఖం భూములు.. అధికారుల జోక్యం కోరిన గ్రామస్తులు

గజ్వేల్:12 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మండలంలోని సంగుపల్లి గ్రామంలో ఉన్న పాత కుంటల శిఖం భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని,వాటిని పరిరక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం గజ్వేల్ ఎమ్మార్వోకు కౌన్సిలర్ నక్క సంతోషి రాములు గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని పాత కుంట సర్వే నంబర్ 671లో 30 ఎకరాల 19 గుంటలు, సంఘమైన కుంట సర్వే నంబర్ 726లో 17 ఎకరాల 35 గుంటల భూమి ఉన్నట్లు తెలిపారు. అయితే ఈ కుంటల పరిసర ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు సాగు పేరుతో శిఖం భూములను ఆక్రమిస్తూ అన్యాక్రాంతం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి చెందిన ఈ భూములను కాపాడేందుకు రెవెన్యూ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి ఆక్రమణలను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. గ్రామ ప్రజల అవసరాలకు ఉపయోగపడే కుంటల శిఖం భూములను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్క రేగొండ, శ్రీనివాస్ గౌడ్, యాదగిరి తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తోపాజి ప్రమాణ స్వీకారం

సంగారెడ్డి ప్రతినిధి జూన్ 12 (ప్రజా కలం):

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంగారెడ్డికి చెందిన తోపాజి అనంత కిషన్ హైదరాబాద్లోని చంపాపేటలో ఉన్న సామ సరస్వతి గార్డెన్ శుక్రవారం ప్రమాణస్వీకారం నిర్వహించారు. మాజీ మంత్రి టీజీ వెంకటేష్ సమక్షంలో తోపాజి అనంత కిషన్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంత కిషన్ మాట్లాడుతూ.. తనకు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ అభినందనలు తెలిపారు.



# జర్నలిజం విలువలు కాపాడేలా జర్నలిస్ట్ లు కృషి చేయాలి

## - జర్నలిస్టులకు ప్రభుత్వం ఇవ్వకుంటే తన సొంత నిధులతో ఇళ్ల స్థలాలు ఇస్తా...

## - కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 12 ప్రజా కలం :** జర్నలిజం విలువలు కాపాడేలా జర్నలిస్ట్ లు కృషి చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని వరలక్ష్మి గార్డెన్స్ లో టీయూడ బ్ల్యూజే (ఐజేయూ) తృతీయ మహాసభలు, జిల్లా కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే కె.వి.ఆర్ మాట్లాడుతూ..సమాజంలోజర్నలిస్టులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంద న్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా జర్నలిస్టులు పని చేస్తారని, ప్రస్తుతం పెయిడ్ జర్నలిజంతో విలువలు తగ్గిపోతున్నాయని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఏది నిజం, ఏది అబద్ధమో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. నిజా నిజాలను నిగ్గు తేల్చడంలో జర్నలిస్టులు కీలక పాత్ర




పోషించాలన్నారు. ప్రజలకు ఉపయోగపడేలా, వారి సమస్యల పరిష్కారమయ్యేలా వార్తలు ప్రచురించాల న్నారు. ప్రభుత్వ పరంగా సాధ్యం కాకపోతే తన సొంత నిధులతో అయినా సరే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కామారెడ్డి జిల్లా టీయూడ బ్ల్యూజే (ఐజేయు) నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది.

ఎన్నికైన సభ్యులతో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేయిం చారు. ఈ కార్యక్రమంలో టీయుడ బ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, కార్యదర్శి రాంనారాయణ, మున్సిపల్ ఛైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి, ప్రముఖ వ్యాపారవేత్త సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. టీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గం ఇదే.. కామారెడ్డి జిల్లా టీయూడ బ్ల్యూజే ప్రింట్ మీడియా అధ్యక్షుడిగా రజనీకాంత్, కార్యదర్శిగా తోట రాజేష్, కోశాధికారిగా ముదాం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా సయ్యద్ కౌసర్అలీ, ఎండీ అబీద్, ముదాం శంకర్, బాలయ్య, ఎండీ యూనస్, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాస్ రెడ్డి , సాయిప్రసాద్, కే. శ్రీనివాస్ రావు , యు. రామకృష్ణ,లక్ష్మినారాయణ, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, ఈ.వెంకటేశ్వర్లు, ఇంజమూరి శ్రీనివాస్, కే.గంగాధర్, జే.బాలప్రకాష్, ఎండీ వాజీద్ అలీ, జి.శ్రీనివాస్, మేకల రవి, భవాని ఎన్నికయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా పి.శ్రీనివాస్, కార్యదర్శిగా బి. సుధాకర్ గౌడ్, కోశాధికారిగా జి. సత్య నారాయణగౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎంఏ మాజీద్, సహాయ కార్యదర్శులుగా రామేశ్వర్ రావు, ఎన్.సాయిరాం, జే.వీరయ్య, రవీందర్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా అవునూరి ఆశన్న, ఎండీ రజాక్, పోచయ్య, గంగాధర్, బన్సీలాల్, దినకర్, ప్రవీణ్ కుమార్లు ఎన్ని కయ్యారు.

# డీసీఎం వ్యాన్ ఢీకొని 17 మేకలు, వ్యక్తి మృతి



కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 12 ప్రజా కలం : మేకలను మేత కోసం అటవీ ప్రాంతానికి తీసుకు వెళ్తున్న ఓ వ్యక్తితో పాటు 17 మేకలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం ఎల్లారెడ్డి మండలంలోని కొట్టాల గ్రామం వద్ద చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం..... ఎల్లారెడ్డి మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన ఆలకుంట శివయ్య (74) తన మేకలను మేపడానికి శుక్రవారం ఉదయం కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొట్టాల గ్రామం వద్ద కామారెడ్డి వైపు నుంచి ఎల్లారెడ్డి వైపు అతివేగంగా వస్తున్న డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 17 మేకలు అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన శివయ్యను స్థానికులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే శివయ్య చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందారు. మృతుడి భార్య పోచవ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఆర్డీఓ కార్యాలయంలో 'సర్ సహాయ కేంద్రం' ప్రారంభం...

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 12 ప్రజా కలం : ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా




ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, ఎల్లారెడ్డి ఆర్డీఓ ప్రభాకర్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ....పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీ లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను చేపడుతు న్నామని తెలిపారు. ఈ ప్రక్రియకు సంబంధించిన సమాచారం అందించడంతో పాటు ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం 1950 టోల్ ఫ్రీ నంబర్ సేవలను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పు, తొలగింపు, సవరణలు, ఇతర అంశాలకు సంబంధించి ప్రజలు 1950 టోల్ ఫ్రీ నంబర్ను సంప్రదించి సేవలు పొందవచ్చని తెలిపారు. ప్రతి అర్హులైన పౌరుడు ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శాఖ అధికారులు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# యువతి,యువకుల కు ఉద్యోగ అవకాశాలు

## మాజీ సర్పంచ్ బండి కృష్ణ

భూదాన్ పోచంపల్లి జూన్ 12 ( ప్రజా కలం )

యువతి,యువకుల కు ఉద్యోగ అవకాశాలు వినియోగించుకోవాలని ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా ప్రైవేట్ రంగంలో కూడా ముందుకు సాగాలని ఇంద్రియాల గ్రామం మాజీ సర్పంచ్ బండి కృష్ణ అన్నారు. శుక్రవారం పోచంపల్లి పట్టణ ధరణి డైరీ లో మెగా జాబ్ వేల కార్యక్రమాన్ని నిర్వహించారు.రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్ లో ఫాక్స్కాన్ కంపెనీ నందు 500 మందికి ఉద్యోగాల కొరకు. ఆదిత్య ఎంటర్ప్రైజెస్ వారి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. హాజరైన విద్యార్థిని విద్యార్థులకు ఇంటర్వ్యూ నిర్వహించినారు.ఈ కార్యాక్రమంలో రేణుక ,మచ్చ నర్సింహా బీమాగోని శ్రీకాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలు జర్నలిస్టుల పిల్లల చదువు కోసం ఫీజులో 50% రాయితీ ఇవ్వాలి: టిడబ్ల్యూజేఎఫ్



ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)ప్రైవేట్ పాఠశాలలు జర్నలిస్టుల పిల్లల చదువు కోసం ఫీజులో 50% రాయితీ ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో మాయొక్క జర్నలిస్టుల పిల్లలకు 2026-27 సంవత్సరాలకు ఫీజుల్లో 50% రాయితీ జిల్లా విద్యాధికారి (ఐజూ) వినతిపత్రం అందజేశారు. టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి గడ్డమీది అశోక్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు దామర జగదీశ్వర్ గుప్తా, ఏ గోవిందరావు లు మాట్లాడుతూ.... మేడ్చల్ జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టుల పిల్లలకు ప్రతి విద్యా సంవత్సరం మాదిరిగా ప్రైవేట్ పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం మన జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 80 శాతం జర్నలిస్టులు వేతనాలు లేక నెలవారీ ఆదాయం లేక తమ పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు ఫీజులు కట్టలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరాల్లో ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50% ఫీజు రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక రాయితీ అమలు చేయాలని సూచించారు చేస్తున్నాం. రాబోయే 2026-27 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేనాటికి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా జీవో/ సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ జేఎఫ్ నాయకులు శివకుమార్, వీరేష్ ముదిరాజ్, సంజీవ్ కుమార్, శ్యాం ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా పెండ్యాల విజయభాస్కర్ బాధ్యతల స్వీకారం

**హైదరాబాద్, జూన్ 12( ప్రజా కలం )**

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా పెండ్యాల విజయభాస్కర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్లోని చంపాపేట్ సామ సరస్వతి గార్డెన్స్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ విజయభాస్కర్తో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మాజీ రాజ్యసభ సభ్యుడు టి.జి. వెంకటేష్ మెమొంటో అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య ప్రముఖులు పెండ్యాల విజయభాస్కర్ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలో సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని విజయభాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో తొండపు నాగమణి, పెండ్యాల ప్రసాద్రావు, తొండపు సుబ్బారావు, కొదుమూరి భాను ప్రకాష్, తొండపు నవీన్, పెండ్యాల నరసింహారావు, సరిత, కృష్ణవేణి, కళావతి తదితరులు పాల్గొన్నారు.



## బస్సు నిలిపివేతపై ముక్తాపూర్ ప్రజలు తీవ్ర ఆందోళన

# వెంటనే పునరుద్ధరించాలి

భూదాన్ పోచంపల్లి, జూన్ 12 (ప్రజా కలం )

పోచంపల్లి నుంచి హైదరాబాద్కు నడిచే ప్రైవేట్ అద్దె బస్సుల కాలపరిమితి ముగియడంతో అధికారులు బస్సు సర్వీసులను నిలిపివేయడం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ప్రతిరోజూ హైదరాబాద్కు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు ప్రత్యామ్నాయ రవాణా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


ఈ నేపథ్యంలో ముక్తాపూర్ గ్రామానికి రావాల్సిన 'నైట్ అవుట్' బస్సు శుక్రవారం రాకపోవడంతో విద్యార్థులు, యువకులు, వృద్ధులు కలిసి రహదారిపై ధర్నా నిర్వహించారు. వెంటనే బస్సు సేవలను పునరుద్ధరించాలని నినాదాలు చేస్తూ అధికారుల దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి నైట్ అవుట్ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముక్తాపూర్ విద్యార్థులు, వృద్ధులు, యువకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## సీలింగ్ భూములు అమ్మిన కొన్న

# సీలింగ్ భూముల పట్టాలను రద్దు చేస్తాం

- పెద్దమ్మ తండా గ్రామంలో 28 ఎకరాల సీలింగ్ భూమిపై రైతులకే హక్కు
- పెద్దమ్మ తండా సర్వేనెంబర్ 74,75 సీలింగ్ పట్టా
- భూమి ని అమ్మినా కొన్న నేరం
- పెద్దమ్మ తండా గ్రామంలో సీలింగ్ భూములను రైతులకు వ్యవసాయం కోసం ఇచ్చాం
- పెద్దమ్మ తండా గ్రామంలో 28 ఎకరాల సీలింగ్ భూమి ఎలాంటి కబ్జా జరగలేదు
- కందుకూరు ఎమ్మార్వో గోపాల్






కందుకూరు, జూన్ 12,(ప్రజా కలం)

సీలింగ్ భూములు అమ్మిన కొన్న చర్యలు తీసుకుంటాం అని కందుకూరు ఎమ్మార్వో గోపాల్ అన్నారు. కందుకూరు మండలం పెద్దమ్మ తండా గ్రామంలో 28 ఎకరాల సీలింగ్ భూమి సర్వే నంబర్ 74,75 లో కబ్జా జరిగిందని వస్తున్న ఆరోపణల పట్ల విలేకరులు అడిగిన దానికి ఎమ్మార్వో గోపాల్ వివరణ ఇచ్చారు. పెద్దమ్మ తండా సర్వేనెంబర్ 74,75 సీలింగ్ పట్టా భూమి ఎలాంటి కబ్జా జరగలేదని ఆ భూమిలో రైతులు మాత్రమే వ్యవసాయం చేసుకోవాలని అక్కడ ఎవరు అమ్మిన కొన్న చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో హెచ్చరించారు. సీలింగ్ భూమిలో రైతులకు హక్కు ఉంటుందని రైతులు వ్యవసాయం చేసుకోవాలని రైతుల పేరు చెప్పి ఎవరు భూమిని స్వాధీనం చేసుకున్న అమ్మిన కొన్న చట్టపరమైన చర్యలు తీసుకొని సీలింగ్ భూముల పట్టాలను రద్దు చేస్తామని ఎమ్మార్వో గోపాల్ తెలిపారు. ఇతరులు కబ్జా చేసినట్టు ఆరోపణలు రాగానే జిపిఓ తో పూర్తి విచారణ జరిపించడం జరిగిందని రైతులు వ్యవసాయం చేసుకోవడానికి అక్కడ మట్టి పోసి చదును చేసుకుంటున్నారని అక్కడ రైతులు వ్యవసాయం మాత్రమే చేయాల్సి ఉంటుందని ఎమ్మార్వో అన్నారు. ఎవరైనా ఏలాంటి కబ్జాకు పాల్పడిన వెంటనే భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ఎమ్మార్వో తెలిపారు.



# పనులు చేయకపోతే నల్లజాబితా

### -పనులు మొదలు పెట్టకపోతే నల్లజాబితా..

### -రూ.75 కోట్ల అభివృద్ధి పనులకు వేగం పెంచాలన్న ఎమ్మెల్యే ఆదేశం

పటాన్‌చెరు, జూన్ 12 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో రూ. 75 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లను నల్లజాబితాలో చేర్చాలని పటాన్‌చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడిదల ప్రాంతాల్లో సగానికి పైగా పనులు ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. జిన్నారం మున్సిపాలిటీలో టెండర్లు పొందిన కాంట్రాక్టర్లు పనులు చేపట్టకపోవడంతో, వారిని నల్లజాబితాలో చేర్చి తిరిగి టెండర్లు పిలవాలని ఎమ్మెల్యే సూచించారు. అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆయన ఆదేశించారు. ఇస్నాపూర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారంగా త్వరలో జీవ వ్యర్థాల శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలో రూ.10 కోట్లతో ఫంక్షన్ హాళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్లు, ఉపాధ్యక్షులు, కమిషనర్లు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు..

# జగ్గారెడ్డి దమ్ముంటే ఇంటి దొంగ పేరు బయటపెట్టు

### - ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చాలెంజ్. - మీనాక్షికి ద్రోహం చేసింది మీ కాంగ్రెస్ పార్టీ వాడే
### - హరీష్ రావు నిజాలు చెబితే ఎందుకు ఉలికిపాటు?
### - ప్రశ్నలకు సమాధానాలు లేకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నావ్ - పదవికోసం దిగజారి మాట్లాడుతున్నావు
### - కాంగ్రెస్ అవినీతి, అక్రమాలపై సమాధానం ఇవ్వు జగ్గారెడ్డి
### మీనాక్షి నటరాజన్ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ విచారణకు ఆదేశించి నిజాలు బయటపెట్టాలి



సంగారెడ్డి ప్రతినిధి జూన్ 12( ప్రజా కలం):

బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తుందని విమర్శించే ముందు కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న అంతర్గత రాజకీయాలపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. మీనాక్షి నటరాజన్‌కు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నప్పటికీ, ఆమె నామినేషన్ ప్రక్రియను అడ్డుకునేలా సమాచారం ఇచ్చింది తెలంగాణ కాంగ్రెస్ నాయకులేనన్న ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. " కామాలు, ఫుల్‌స్టాప్‌ల వల్లే నామినేషన్ ఆగిపోయిందని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే " అని విమర్శించారు. జాతీయ పార్టీ ఇంచార్జి స్థాయి నాయకురాలి అఫిడవిట్‌లో తప్పులు జరగడం కాంగ్రెస్ వైఫల్యమేనని అన్నారు. అలాగే, సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడిగా చెప్పబడుతున్న వ్యక్తే మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచాడనే ఆరోపణలపై కాంగ్రెస్ ఎందుకు మౌనం పాటిస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో జరుగుతున్న అంతర్గత కుమ్ములాటలను దాచిపెట్టేందుకే బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. దొంగతనం చేసింది బీజేపీ వాళ్లు , బురద జల్లేది బిఆర్ఎస్ అని అడ్డుగోలు మాటలు మాట్లాడుతున్నారు. మధ్యప్రదేశ్ మంత్రులే ఆధారాలతో సహా మీ తెలంగాణ కాంగ్రెస్ నాయకులే సమాచారం ఇచ్చారని కుండబద్దలు కొడితే దానికి సమాధానం చెప్పే దమ్ము మీకు లేదు. " హరీష్ రావు విమర్శలు ఊహాగానాలు కావు... ఆధారాలతోనే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి అంశాలను ప్రజల ముందుకు తీసుకొస్తున్నారు " అని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లోని కోవర్టుల వ్యవహారాన్ని బయటపెట్టినందుకే హరీష్ రావుపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని అన్నారు. మీనాక్షి నటరాజన్ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ విచారణకు ఆదేశించి నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. మీనాక్షి నటరాజన్ కు ద్రోహం చేసింది ముఖ్యమంత్రి వర్గమే అని తెలిసిన మీరెందుకు మాట్లాడడం లేదు జగ్గారెడ్డి గారు ...? మీ నోరు ఎవరు నొక్కేశారు ...? ముఖ్యమంత్రి కోసం రూ.100 కోట్లతో నిర్మిస్తున్న గెస్ట్ హౌస్, యూనిఫామ్ టెండర్లు, ప్రభుత్వ వ్యయాలు, హెలికాప్టర్ అద్దె ఖర్చులు. వంటి అంశాలపై హరీష్ రావు లేవనెత్తిన ప్రశ్నలకు కాంగ్రెస్ సమాధానం చెప్పాలని కోరారు. సంగారెడ్డిలో ప్రజల చేతిలో ఓటమి పాలైన జగ్గారెడ్డికి, ప్రజల గుండెల్లో ఉంటూ ఆరు సార్లు భారీ మెజారిటీతో గెలిచిన ప్రజా నాయకుడు హరీష్ రావు గారిని విమర్శించే నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి లాగా దొంగ హామీలిచ్చి , అబద్దాలు చెప్పి, ఢిల్లీ వాళ్ల కాళ్లు మొక్కి పదువులు తెచ్చుకుని అలవాటు మిది ...? హరీశ్ రావు గారు ఎప్పుడు రైతులు, పేదల పక్షాన పోరాడుతూ ప్రజల మధ్యనే ఉండే నాయకుడు. కానీ మీరు మాత్రం పదవికోసం ఢిల్లీ నాయకుల చుట్టూ తిరుగుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రాపకం కోసం ఆరాటపడుతున్నారు. ఎవరైనా కోవర్టులు ఉంటే తోడ్కలు తీస్తామని జగ్గారెడ్డి గారు ప్రగల్భాలు పలుకుతున్నారు. మీకు నిజంగా అంత దమ్ముంటే , ముందుగా సీటు రాకుండా అడ్డుకున్న ఆ ముఖ్యమంత్రి అనుచరుడైన కోవర్టు పేరు బయటపెట్టండి. రేవంత్ రెడ్డిని టీడీపీ కోవర్ట్ అని, పార్టీని నాశనం చేయడానికి వచ్చిన బ్లాక్ మెయిలర్ అని గాంధీ భవన్ మెట్లు మీద కూర్చొని తిట్టిన జగ్గారెడ్డి.. ఈరోజు పదవి కాపాడుకోవడం కోసం అదే రేవంత్ రెడ్డికి వంతపాడటం మీ దిగజారుడుతానికి నిదర్శనం. ఫార్మాసిటీ రద్దుతో రాష్ట్రానికి రావాల్సిన పరిశ్రమలు, ఉద్యోగాలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయని, రైతులు--పేదలు--యువత సమస్యలపై సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఇలాంటి కుంటి సాకులు చెబుతూ మీడియా ముందు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు.

# ప్రభుత్వ విద్యకు పెద్దపీట

### -చదువే లక్ష్యం.. ఎమ్మెల్యే సందేశం..

### -ప్రభుత్వ విద్యకు మరో బలం..

పటాన్‌చెరు, జూన్ 12 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంచేలా పటాన్‌చెరులో మరో ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో విజయాలు సాధించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



పిలుపునిచ్చారు. ప్రభుత్వ కళాశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని అందుకు పటాన్‌చెరు ప్రభుత్వ విద్యాసంస్థలు నిదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు శుక్రవారం పటాన్‌చెరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ బోధనా ఫలకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనూ నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఉన్నత విద్య, ఉద్యోగాల్లో రాణించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశలను నెరవేర్చేలా క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు.

పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, విద్యా సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ప్రభుత్వ విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, నాయకుడు వంగరి అశోక్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు..

# ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో కౌన్సిలర్ గోలి మమత సంతోష్ కు ఘన సన్మానం

గజ్వేల్:12 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ రెండవ వార్డ్ కౌన్సిలర్ గోలి మమత సంతోష్ కు శుక్రవారం హైదరాబాద్ చంపాపేట్ లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సముద్రాల హరినాథ్ మాట్లాడుతూ, ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ,కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఇటీవల ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య ప్రజా ప్రతినిధులను సన్మానించి జ్ఞాపకతో సత్కరించడం జరిగిందని అందులో భాగంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రెండవ వార్డ్ కౌన్సిలర్ గోలి మమతా సంతోష్ కు తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ,ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్ చేతుల మీదుగా సన్మానం చేసి జ్ఞాపిక అందజేయడం జరిగిందని,గోలి మమత సంతోష్ రాజకీయంగా మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు,



# ఖమ్మం ఘటన నిందితుడికి కఠిన శిక్ష విధించాలి

### బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి: డాక్టర్ కుమారస్వామి

గజ్వేల్:12 జూన్ 2026 (ప్రజా కలం ప్రతినిధి):

ఖమ్మం పట్టణంలో మైనర్ బాలికపై జరిగిన అఘాయిత్యాన్ని తీవ్రంగా ఖండిస్తూ నిందితుడికి కఠిన శిక్ష విధించాలని విశ్వహిందూ పరిషత్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ కుమారస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితుడితో పాటు అతని వెనుక ఉన్న అసాంఘిక, దేశ వ్యతిరేక శక్తులను గుర్తించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని కోరారు. మహిళలు, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే నిందితులపై చట్టపరంగా వేగంగా చర్యలు తీసుకుని కఠిన శిక్షలు అమలు చేయాలని అన్నారు. ఈ ఘటనపై కొన్ని సంఘాలు, రాజకీయ నాయకులు స్పందించకపోవడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు రక్షణ కల్పించాలని, బాలిక భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవసరమైన చట్టపరమైన, న్యాయపరమైన సహాయాన్ని అందించాలని కోరారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు డి. శ్రీనివాస్,జంగం సోమేశ్వర్, చంద్రశేఖర్, రజక సంఘ నాయకుడు కనకయ్యతో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.




Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275**, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com